సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 142
సోమవారం 6-2-2023
SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'


అశు 'కంచు పట్టు'
వరల్డ్ రెజ్లింగ్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో భారత రెజ్లర్‌కు కాంస్యం - 12లో


పన్ను ఆదా మార్గాలు..
పన్ను భారం తగ్గించుకునేందుకు ఉన్న మార్గాలపై ప్రత్యేక కథనం - 13లో


చైనా బెలూన్ పేల్చివేత
తమ గగనతలం మీదుగా ఎగురుతూ కలకలం రేపిన అనుమానాస్పద చైనా నిఘా బెలూన్‌ను అమెరికా పేల్చివేసింది.
వివరాలు 6లో ▸


పర్వేజ్ ముషారఫ్ కన్నుమూత
అమిలాయిడోసిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న పాకిస్తాన్ మాజీ సైనిక పాలకుడు పర్వేజ్ ముషారఫ్ కన్నుమూశారు.
వివరాలు 6లో ▸


232 విదేశీ యాప్‌లపై నిషేధం
చైనాతో పాటు వివిధ దేశాలకు చెందిన సంస్థలు నిర్వహిస్తున్న 232 యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది.
వివరాలు 6లో ▸


నేడు 'సుప్రీం' జడ్జీల ప్రమాణం
సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తులుగా నియమితులైన ఐదుగురు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.
వివరాలు 6లో ▸

బాలికల ఓటు చదువుకే

విద్య, ఉద్యోగాలకే తొలి ప్రాధాన్యం.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో పరిస్థితి మెరుగు

- రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలే ఇందుకు కారణం
- తల్లిదండ్రుల ఆలోచనల్లోనూ మార్పు
- ఫలితంగా పాఠశాలలు, కాలేజీల్లో పెరుగుతున్న బాలికల శాతం.. బాలికల డ్రాపవుట్లు భారీగా తగ్గుముఖం
- ఏపీలో జీఈఆర్ 11.03%.. జాతీయ స్థాయిలో కేవలం 2.28%
- అసర్, ఐష్, యూడైస్+ సర్వే నివేదికల్లో వెల్లడి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మూడున్నరేళ్లుగా వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రతి దశలోనూ అండగా నిలవడంతో విద్యా రంగంలో అమ్మాయిలు దూసుకెళ్తున్నారు. ఒకప్పుడు చదువుల్లో వెనుకబడిన ఆడపిల్లలు నేడు అన్ని అడ్డంకులను అధిగమించి పోటాపోటీగా దూసుకుపోతున్నారు. తల్లిదండ్రులు కూడా బాలికల చదువులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో యుక్త వయసు రాక ముందే ఆడ పిల్లల పెళ్లిళ్లపై దృష్టి సారించే తల్లిదండ్రులు.. నేడు ఆ ఆలోచనను వాయిదా వేసి, వారి చదువులపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత చదువుల వరకు స్కూళ్లు, కాలేజీల్లో ఆడపిల్లల చేరికలు భారీగా పెరుగుతుండడమే ఇందుకు నిదర్శనం. ఇటీవల ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ విడుదల చేసిన ఏన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్టు (అసర్), ఆలిండియా సర్వే ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఐష్) నివేదికల్లోని గణాంకాలు ఈ విషయాలను వెల్లడిస్తున్నాయి. బాలికల చేరికల్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో మరింత అధికమని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అనేక విద్యాభివృద్ధి పథకాలు, కార్యక్రమాలతో తల్లిదండ్రులు ఆడపిల్లలను బడులకు పంపిస్తున్నారు. పాఠశాల స్థాయి అనంతరం.. ఇంటర్మీడియెట్ చదవులకు వీలుగా బాలికల కోసం ప్రతి మండలానికి రెండు జూనియర్ కాలేజీలను అందుబాటులోకి తెస్తోంది. ఉన్నత కోర్సుల్లో చేరే వారికి పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంటుతోపాటు
మిగతా 2వ పేజీలో ▶

అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, స్వేచ్ఛ, ఇంగ్లిష్ మీడియం, నాడు-నేడు, డిజిటల్ తరగతులు, బైజూస్ కంటెంట్, సీబీఎస్ఈ, కరిక్యులమ్‌లో మార్పులు, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలు, కార్యక్రమాలు రాష్ట్రంలోని బాలికల్లో చదువుకోవాలన్న ఆలోచనను రెట్టింపు చేస్తున్నాయి. ఫలితంగా అమ్మాయిలందరూ బడిబాట పడుతున్నారు. పాఠశాలల స్థాయిలోనే ఆగిపోకుండా కళాశాలలో సైతం అడుగు పెడుతున్నారు.



మంచి ఉద్యోగమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. ప్రతి బాలిక కనీసం పదో తరగతి వరకు అయినా చదవాలన్న తపన, తాపత్రయంతో ప్రభుత్వం 'కళ్యాణమస్తు' కార్యక్రమానికి పదో తరగతి అర్హత పెట్టింది. ఇలా వైఎస్ జగన్ ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలవడంతో తల్లిదండ్రులు సైతం బాలికల చదువుకు ఊకొడుతున్నారు. ఫలితంగా ఏడాదికేడాది పాఠశాలలు, కళాశాలల్లో వీరి చేరికలు పెరుగుతున్నాయి.



94.50 కోట్లు
భారీగా పెరిగిన ఓటర్లు

1951 నుంచి ఇప్పటి వరకు ఆరు రెట్లు పెరిగిన సంఖ్య

దేశంలో ఈ ఏడాది జనవరి 1 నాటికి నమోదైన ఓటర్ల సంఖ్య 94.50 కోట్లు అని కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. త్వరలో పలు రాష్ట్రాల అసెంబ్లీలకు, వచ్చే ఏడాది లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ఇప్పటి నుంచే ఎన్నికల సంఘం వ్యూహాలు పన్నుతోంది.
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

'యువగళం మన కోసం' పేరుతో ఘరానా మోసం..



యువగళం పేరుతో ఓ వైపు టీడీపీ నేత నారా లోకేశ్ పాదయాత్ర చేస్తుంటే.. ఆయన అనుచరులు అదే పేరుతో వాట్సాప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి మోసాలకు తెగబడుతున్నారు. 'యువగళం మన కోసం' వాట్సాప్ గ్రూప్ సభ్యులకు లోన్ ఇస్తానంటూ అడ్మిన్ మనోహర్ చౌదరి నమ్మబలికి.. డబ్బులు కాజేసిన ఉదంతం బయటపడింది.
వివరాలు 5 ▸

అధిక జీతాలిచ్చే కొలువులివే



ప్రస్తుత డిజిటల్ యుగంలో అధిక వేతనాలిచ్చే కొలువులపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆసక్తి నెలకొని వుంది. ఈ నేపథ్యంలో 2023లో అధిక వేతనాలిస్తూ డిమాండ్ అధికంగా ఉన్న 10 రకాల ఉద్యోగాలను ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థ సింప్లీ లెర్న్ విడుదల చేసింది.
వివరాలు 2 ▸

రైతులే పాలకులు కావాలి



''భారత్ రాష్ట్ర సమితి దేశంలోనే మొదటిసారిగా.. ఏ పార్టీ ఇవ్వని విధంగా 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అనే నినాదంతో రైతులనే పాలకులను చేసేందుకు ప్రజల ముందుకు వచ్చింది'' అని తెలంగాణ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. మహారాష్ట్రలోని 288 స్థానాల్లోనూ పోటీ చేస్తామని నాందేడ్ సభలో ప్రకటించారు.
వివరాలు 10 ▸

అదనపు వ్యాట్ బాబు వేసిందేగా?

లీటరుపై రూ.4 చొప్పున విధించింది చంద్రబాబు కాదా?

- అదే అదనపు వ్యాట్ ఇప్పుడూ కొనసాగుతోంది కదా?
- బాబు హయాంలో రోడ్లు దారుణంగా తయారవటం అబద్ధమా?
- ఇప్పుడు 8,970 కి.మీ. రోడ్లను రూ.2,205 కోట్లతో చేపట్టారు కదా?
- ఇందుకోసం వసూలు చేస్తున్నది కేవలం లీటర్‌పై 1 రూపాయి
- ఈ వాస్తవాలను దాచిపెట్టి 'ఈనాడు' దుర్మార్గపు రాతలు
- రాత్రికి రాత్రే పెంచేసినట్లుగా రాష్ట్ర ప్రభుత్వంపై బురద
- వాస్తవంగా పెట్రో ఆదాయంలో కేంద్రం రాష్ట్రాలకిస్తున్నది 5.8 శాతమే..



సాక్షి, అమరావతి: చంద్రబాబు నాయుడి హయాంలోనూ అదే 31 శాతం వ్యాట్. ఇప్పుడూ అదే వ్యాట్. చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చాక పెట్రోలు, డీజిల్ రెండింటిపైనా లీటర్‌కు 4 రూపాయలు అదనపు వ్యాట్ విధించారు. ఇప్పుడూ అదే అదనపు వ్యాట్ కొనసాగుతోంది. కాకపోతే చంద్రబాబు హయాంలో రోడ్లను పట్టించుకోకపోవటంతో... దారుణంగా తయారైన రహదారుల మరమ్మతుల కోసం ఈ ప్రభుత్వం లీటరు డీజిల్, పెట్రోల్‌పై ఒక రూపాయి సెస్‌ను మాత్రం వసూలు చేస్తోంది. విచిత్రమేంటంటే 'ఈనాడు'కు గానీ..
మిగతా 2వ పేజీలో ▶



'కానిస్టేబుల్' మెయిన్ పరీక్షకు 95,208 మందికి అర్హత

- ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదల
- రేపటివరకు ఓఎంఆర్ షీట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం
- మెయిన్ పరీక్ష దరఖాస్తులు ఈనెల 13 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో..

3 లో




వేలంపై కాదు... పాకిస్తాన్‌తో సమరంపైనే దృష్టి

- భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్
- టి20 ప్రపంచకప్‌లో 12న పాకిస్తాన్‌తో పోరు
- 13వ తేదీన ముంబైలో మహిళల ప్రీమియర్ లీగ్ వేలం

12 లో

ఇదండీ సంగతి



కుట్రపూరిత కథనాలే

- ఓఎస్డీతో కలిసి నేను విజయవాడ వెళ్లినట్లు అభూత కల్పనలు
- ఉద్యోగులందరిలో అత్యున్నత స్థాయి అధికారిని టార్గెట్ చేస్తూ అవాస్తవాలా?
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిష్టకు భంగం కలిగించడం ఏ జర్నలిజం విలువలు?
- బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందే.. తప్పుడు కథనాలపై నా ఖండనను అంతే ప్రాధాన్యతతో ప్రచురించాలి
- లేదంటే బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తప్పవు: సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: 'సీఎస్‌తో కలసి వెళ్లిన ఓఎస్డీ' శీర్షికన ఎల్లో మీడియా ప్రచురించిన కథనాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దారుణమైన అబద్ధాలను ఆలంబనగా చేసుకుని ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలు, ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్, ఏబీఎన్ చానల్ రాష్ట్రంలో ఉద్యోగులందరికీ అధినేత అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని చులకన చేస్తూ, కుట్రపూరితంగా కట్టుకథలు అల్లాయని స్పష్టం చేశారు. ఓ అత్యున్నత స్థాయి అధికారిని, వ్యవస్థను కించపరుస్తూ తప్పుడు కథనాలు ప్రచురించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఉద్యోగులందరిలో అత్యున్నతస్థాయి అధికారిని టార్గెట్ చేస్తూ అవాస్తవాలను ప్రచురించడం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిష్టకు భంగం కలిగించడం ద్వారా ఏ జర్నలిజం విలువల ఆధారంగా పని చేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. తాను ఖండనలో పొందుపరిచిన అన్ని విషయాలను అంతే ప్రాధాన్యతతో, బేషరతుగా క్షమాపణలు కోరుతూ ప్రచురించాలన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన సత్యదూరమైన న్యూస్ ఐటమ్‌ను ఆయా పత్రికల్లో ఏ పేజీల్లో ఎంత ప్రాముఖ్యతతో ప్రచురించారో, ఏ సమయంలో ఎంత ప్రాధాన్యతతో చానల్‌లో కథనాలను ప్రసారం చేశారో అంతే ప్రాముఖ్యత, ప్రాధాన్యతతో ఖండనను ప్రసారం చేస్తూ జరిగిన పొరపాటుకు క్షమాపణలు కూడా చెప్పాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో ఆ న్యూస్ ఐటమ్‌కు బాధ్యులపై న్యాయ నిపుణుల సలహా, ప్రభుత్వ నిబంధనలకు లోబడి చట్టపరమైన చర్యలు
మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఏఎంసీలో 15 పీజీ సీట్ల పెంపునకు అనుమతి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ)లో 15 పోస్టు గ్రాడ్యుయేట్ సీట్ల పెంపునకు అనుమతి వచ్చినట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తెలిపారు. రేడియాలజీ, బయో కెమిస్ట్రీ, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్ తదితర విభాగాల్లో పెరిగిన సీట్లకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఎంసీలో 38 వైద్య విభాగాల్లో 237 పీజీ సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ కోటా నేపథ్యంలో ఏఎంసీలో 131 పీజీ సీట్లు పెంపునకు ప్రతిపాదించారు. వీటితో కలిపితే పీజీ సీట్ల సంఖ్య 368కి చేరుతుంది. సీట్ల పెంపు విషయమై గత నెల 12వ తేదీన జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) బృందం ఏఎంసీలోని విభాగాలను, కేజీహెచ్‌లో వార్డులను తనిఖీ చేసింది. వసతులు, మౌలిక సదుపాయాలను పరిశీలించింది. తొలి విడతగా 15 పీజీ సీట్లకు అనుమతిచ్చింది.

టీడీపీ నేత కుటుంబానికి రూ.5 లక్షల ప్రభుత్వ సాయం

చెక్కు అందజేసిన ఎమ్మెల్సీ భరత్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: చిత్తూరు జిల్లా చెంగుబళ్ల పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు, గతంలో జన్మభూమి కమిటీ సభ్యుడిగా ఉన్న మునిసిబ్ గారి ప్రసాద్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసింది. చెంగుబళ్ల పంచాయతీ పరిధిలోని సోగడబళ్లలో ఆదివారం ఎమ్మెల్సీ భరత్ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ప్రసాద్ కుమారుడు మోహన్‌కు ఎమ్మెల్సీ భరత్ అందజేశారు. ప్రసాద్ భార్య రూప తీవ్ర అనారోగ్యం బారిన పడి ప్రస్తుతం కోలుకుంటున్నారని.. ఆమె వైద్యానికి అయిన ఖర్చులను ప్రభుత్వం మంజూరు చేసిందని భరత్ చెప్పారు.

బాల్య వివాహాలు చేసేవారిపై కేసులు పెట్టండి

జిల్లా ఎస్పీలకు బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ అప్పారావు ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బాల్య వివాహాలు చేసేవారిపై కేసులు పెట్టాలని జిల్లా ఎస్పీలను ఏపీ బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రాన్ని బాల్య వివాహాలు రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ఇటీవల కఠిన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఆ నిబంధనలకు, చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా బాల్య వివాహాలు జరిపిస్తే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఎంతో మంచి భవిష్యత్ ఉన్న బాలలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడంతో వారి ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు దేశాభివృద్ధికి దోహదం చేసే యువశక్తి నిర్వీర్యమైపోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. బాల్య వివాహాల వల్ల బాలల భవిష్యత్ అంధకారంలోకి నెట్టివేయబడుతుందని, మాతా, శిశు మరణాల రేటు పెరిగే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాలను నివారించేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల సహకారం తీసుకోవాలని సూచించారు.

అధిక జీతాలిచ్చే కొలువులివే..

2023 టాప్-10 ఉద్యోగాల జాబితా విడుదల చేసిన సింప్లీ లెర్న్

ఆర్థిక మాంద్యంతో ప్రపంచవ్యాప్తంగా పలు సంస్థలు ఉద్యోగులను తొలగిస్తుండటం.. తాజాగా చదువులు పూర్తిచేసుకుంటున్న విద్యార్థుల్లో గుబులుపుట్టిస్తోంది. అదే సమయంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ డిజిటలైజేషన్ దిశగా వేగంగా అడుగులు వేస్తుండడంతో అంతే వేగంగా ఉపాధి అవకాశాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. విద్యార్హతలు, అనుభవం, నైపుణ్యాలను బట్టి ఆయా సంస్థలు వేతనాన్ని ఆఫర్ చేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో చదువు పూర్తయిన తర్వాత అధిక వేతనాలిచ్చే కొలువులపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో కూడా ఆసక్తి నెలకొని వుంది. ఈ నేపథ్యంలో.. 2023లో అధిక వేతనాలిస్తూ డిమాండ్ అధికంగా ఉన్న 10 రకాల ఉద్యోగాలను ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థ సింప్లీ లెర్న్ విడుదల చేసింది. ఈ సంస్థ విడుదల చేసిన జాబితా ప్రకారం ఈ పది ఉద్యోగాల్లో వార్షిక వేతనం రూ.7 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు అందిస్తున్నాయి.

- సాక్షి, అమరావతి

ఏడాదికి సగటున రూ.7 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వార్షిక వేతనాలు

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ రంగంలో సగటున రూ.40 లక్షలు..

ప్రోడక్ట్ మేనేజర్ కెరీర్ ఎంచుకున్న వారికి రూ.14.40 లక్షలు

మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ కెరీర్‌లో సగటున రూ.11.49 లక్షలు

ఐటీ రంగంలో మెషిన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్‌లకు రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వేతనం

డాక్టర్లకు రూ.6.99 లక్షల నుంచి రూ.11.59 లక్షలు, సీఏలకు రూ.7.89 లక్షల వేతనం



ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్

దేశీయంగా, అంతర్జాతీయంగా అత్యధిక వేతనాలు అందిస్తున్న వాటిలో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ కొలువు ఒకటి. ఖాతాదారులకు సంబంధించిన నగదును నిర్వహిస్తూ వారికి అధిక లాభాలను అందించడమే ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ విధి. ఫైనాన్స్ సబ్జెక్ట్‌తో పాటు వివిధ ఫైనాన్షియల్ సేవలపై పట్టున్న వారికి ఇది సరైన కెరీర్. ఈ రంగంలో ప్రారంభ వేతనాలు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఉన్నా, అనుభవమున్న వారికి రూ.40 లక్షల వరకు కూడా ఇవ్వడానికి సంస్థలు ముందుకొస్తున్నాయి. సిటీబ్యాంక్, డచ్ బ్యాంక్, హెచ్ఎస్‌బీసీ, గోల్డ్‌మాన్‌శాక్స్, జేపీ మోర్గాన్ ఛేజ్ వంటి సంస్థలు అవకాశాలను కల్పిస్తున్నాయి.

బ్లాక్‌చైన్ డెవలపర్

ఈ మధ్య కాలంలో కొత్త టెక్నాలజీ కోర్సుల్లో అత్యధికంగా వినపడేది బ్లాక్‌చైన్ టెక్నాలజీనే. దేశాల నగదు లావాదేవీలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ, డేటా సెక్యూరిటీ వంటి వాటిలో బ్లాక్‌చైన్ కీలక పాత్ర పోషిస్తుంది. కంప్యూటర్ సైన్స్ పూర్తిచేసి బ్లాక్‌చైన్ టెక్నాలజీ కోర్సు చేసినవారికి సగటు ప్రారంభ వేతనం రూ.8,01,938 లభిస్తుంటే, అనుభవం ఉన్నవారికి రూ.45 లక్షలు వరకు ఇస్తున్నాయి. ఆక్సీసెస్, సైంజీ, ప్రిమ్‌చైన్, సాఫ్ట్‌కోల్, ఓపెన్ ఎక్సల్, మైండెఫ్ట్ వంటి సంస్థలు ఈ రంగంలో ఉన్నాయి.

వైద్య వృత్తి

అధిక వేతనంతో అధిక డిమాండ్ ఉన్న వాటిలో వైద్య వృత్తి కూడా ఒకటి. దేశంలో వైద్య సేవలు వేగంగా విస్తరిస్తుండటంతో వైద్య నిపుణులకు అధిక వేతనం చెల్లించడానికి ఆస్పత్రులూ వెనుకాడటంలేదు. కేవలం డాక్టర్స్, సర్జన్సే కాకుండా ఈ రంగానికి అవసరమైన హెల్త్‌కేర్ అడ్మిన్, నర్సింగ్, ఫార్మసీ, హోమ్ హెల్త్ వంటి రంగాలకు డిమాండ్ ఉంటోంది. దేశంలో సగటు వైద్యుడి వేతనం రూ.10 లక్షలుగా ఉంది. జనరల్ ఫిజీషియన్స్‌కు రూ.6.99 లక్షలు, జనరల్ సర్జన్స్‌కు రూ.11.59 లక్షలు ఇస్తుంటే స్పెషలైజేషన్ చేసిన వారికి రూ.20 లక్షల వరకు వేతనం లభిస్తోంది. ఎయిమ్స్, ఫోర్టిస్, అపోలో, మాక్స్, కొలంబియా ఆసియా వంటి ఆస్పత్రులు అధిక వేతనాన్ని ఇస్తున్నాయి.

మెషిన్ లెర్నింగ్

వ్యాపార సంస్థలు తమ వ్యాపార విస్తరణలో మెషిన్ లెర్నింగ్(ఎంఎల్) కీలకపాత్ర పోషిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కు సంబంధించిన వాటిలో మెషిన్ లెర్నింగ్ ఒకటి. ఎంఎల్ ప్రోగ్రాంల ద్వారా వ్యాపార విస్తరణకు అవసరమైన ఆల్గోరిథమ్స్‌ను ఈ నిపుణులు అభివృద్ధి చేస్తారు. ఎంఎల్ కోర్సు పూర్తిచేసిన వారికి సగటున రూ.7.28 లక్షల వేతనం లభిస్తోంది. అదే అనుభవం ఉన్న వారికి రూ.19.48 లక్షల వరకు వేతనాన్ని ఇస్తున్నాయి.

యాక్సెంచర్, ఐబీఎం, ఐటీసీ ఇన్ఫోటెక్, జైకస్, క్వాంటిపి వంటి సంస్థలు ఈ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి.

ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్

వ్యాపార రంగంలో ఒక వస్తువును డిజైన్ చేసి, అభివృద్ధి చేసి దాన్ని వేగంగా మార్కెట్లోకి తీసుకెళ్లడం అనేది అత్యంత కీలకం. ప్రోడక్ట్ మేనేజర్లు ఒక వస్తువును డిజైన్ చేసి దాన్ని మార్కెటింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ రంగంలో సగటు ప్రారంభ వేతనం రూ.14.40 లక్షలుగా ఉంది. ప్రారంభ వేతనం రూ.7లక్షలు లేదా రూ.8 లక్షల నుంచి, అనుభవమున్న వారికి రూ.17లక్షలు–రూ.26లక్షల వరకు ఇస్తున్నాయి. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫ్లిప్‌కార్ట్, సేల్స్‌ఫోర్స్, ఊబర్, ఓలా వంటి సంస్థల్లో వీరికి డిమాండ్ ఉంది.

డేటా సైంటిస్ట్

అంతర్జాతీయంగా ఇప్పుడు అత్యధిక డిమాండ్ ఉన్నది డేటా సైంటిస్ట్‌లకే. అందుబాటులో ఉన్న డేటాను సేకరించి సరైన విశ్లేషణ చేసే వారికి రూ.లక్షల్లో జీతాలను ఇవ్వడానికి సంస్థలు పోటీ పడుతున్నాయి. కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామింగ్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లో పట్టున్న వారికి డేటా సైంటిస్ట్ రంగం సరైన వేదిక. డేటా సైన్స్ రంగం ఎంచుకున్న వారికి దేశంలో సగటున రూ.11 లక్షల వేతనం అందుతుండగా, అనుభవం ఉన్న వారికి రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వేతనం ఇవ్వడానికి కంపెనీలు వెనుకాడటంలేదు. డేటాసైన్స్ సర్టిఫికేషన్ పూర్తి చేసిన వారికి అమెజాన్, ప్రోక్టర్ అండ్ గ్యాంబుల్, వాల్‌మార్ట్ ల్యాబ్స్, గ్రే ఆటమ్ వంటి సంస్థలు తలుపులు తెరిచి ఉంచుతున్నాయి.



మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్

ఎంబీఏ చేసి మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ వృత్తిని ఎంచుకున్న వారికి సగటున రూ.11.49 లక్షల వేతనం లభిస్తోంది. వీరికి ప్రారంభ వేతనం రూ.6లక్షలు–రూ.7 లక్షల నుంచి ఉంటే అనుభవం ఉన్న వారికి రూ.17లక్షలు నుంచి రూ.26 లక్షల వరకు వేతనం లభిస్తోంది. కేపీఎంజీ, పీడబ్ల్యూసీ, మెకన్సీ, డెలాయిట్, ఎర్నెస్ట్ యంగ్, యాక్సెంచర్ వంటి సంస్థలు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ అవకాశాలు కల్పిస్తున్నాయి. సీఏ, మార్కెటింగ్ మేనేజర్స్, బిజినెస్ అనలిస్ట్ వంటి రంగాల్లో కూడా రూ.4 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వేతనాలు లభిస్తున్నాయి. ఈ మూడు వృత్తులను ఎంచుకున్న వారికి ఈ ఏడాది దేశంలోని పలు అంతర్జాతీయ సంస్థలు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి. చార్టర్డ్ అకౌంటెంట్స్‌కు స్టాండర్డ్ చార్టర్డ్, ఎర్నెస్ట్ ఎంగ్, డెలాయిట్, కేపీఎంజీ, బీడీఓ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు.. మార్కెటింగ్ మేనేజర్లకు ఐబీఎం, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, టీసీఎస్, టాటా మోటర్స్ వంటి సంస్థలు.. బిజినెస్ అనలిస్ట్‌లకు మైక్రోసాఫ్ట్, సిటీ, యాక్సెంచర్, అమెజాన్ వంటి సంస్థలు అవకాశాలను కల్పిస్తున్నాయి.

బాలికల ఓటు చదువుకే

▶ మొదటి పేజీ తరువాయి

వసతి దీవెన కింద ఏటా రూ.20 వేల వరకు అందిస్తోంది. విద్యకు సంబంధించిన భారమంతా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుండటంతో ఆడపిల్లల చేరికలు బాగా పెరిగాయి.

ఏటా పెరుగుదల

రాష్ట్రంలో 2020–21లో టెన్త్‌లో 3,19,193 మంది బాలికలు ఉండగా, 2021–22లో వారిలో 2,37,530 (75 శాతం) మంది ఇంటర్‌లో చేరారు. అంతకు ముందు ఏడాది.. అంటే 2019–20లో టెన్త్‌లో 3,20,227 మంది ఉండగా, అందులో 2,24,943 (70 శాతం) మంది 2020–21లో ఇంటర్‌లో చేరినట్లు యూడైస్ గణాంకాలు వివరిస్తున్నాయి. ఏటేటా బాలికల చేరికల శాతం పెరుగుతోందనేందుకు ఈ గణాంకాలే తార్కాణం. ఉత్తీర్ణతలోనూ బాలికలే పైచేయి సాధిస్తున్నారు. 2022 ఇంటర్ ఫలితాల్లో 68 శాతం మంది బాలికలు ఉత్తీర్ణులవ్వగా బాలురు 32 శాతమే ఉత్తీర్ణులయ్యారు. జాతీయ స్థాయితో పోల్చితే రాష్ట్రంలో బాలికల చేరికలు మరింత మెరుగ్గా ఉన్నాయి. జాతీయ స్థాయిలో బాలికల జీఈఆర్ పెరుగుదల 2.28 శాతం మాత్రమే ఉండగా రాష్ట్రంలో 11.03 శాతానికి పెరిగిందని ఐష్ గణాంకాలు చెబుతున్నాయి.

దేశ వ్యాప్తంగా తగ్గిన డ్రాపవుట్లు

గతంలో దేశ వ్యాప్తంగా చాలా కాలంగా 7 లేదా 8వ తరగతి తర్వాత ఆడపిల్లల డ్రాపవుట్లు చాలా ఎక్కువగా ఉండేవి. ఇటీవలి కాలంలో క్రమేణా ఆ పరిస్థితి మారుతోంది. 14–16 వయసు బాలికలు బడికి వెళ్లకుండా ఇంటిలోనే ఉండిపోయే వారి శాతం 2018 నాటికి 13.5 శాతం వరకు ఉన్నట్లు అసర్ గత నివేదికలు పేర్కొన్నాయి. అయితే ప్రస్తుతం ఆ శాతం 7.9 శాతానికి తగ్గినట్లు 2022 నివేదిక పేర్కొంది. 11 నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న బాలికల్లో బడులకు వెళ్లని వారి శాతం 4.1 శాతం నుంచి 2 శాతానికి తగ్గినట్లు వెల్లడించింది.

ఇంటర్‌లో పెరిగిన చేరికలు

గతంలో టెన్త్ తర్వాత బాలికల చదువు ముందుకు సాగడానికి చాలా సమస్యలు ఉండేవి. అయితే కాలేజీల అందుబాటు, వివిధ వనరుల కల్పనతో భద్రతాపరమైన చర్యలు పెరగడం, తల్లిదండ్రులు కూడా పిల్లలను కాలేజీల్లో చేరేలా ప్రోత్సహిస్తుండడంతో హయ్యర్ సెకండరీ, ఇంటర్మీడియెట్ స్థాయిల్లోనూ బాలికల చేరికలు బాగా పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో విడుదల చేసే దేశ వ్యాప్త గణాంకాల ప్రకారం 2021–22లో పదో తరగతిలో 89,66,648 మంది బాలికలు ఉండగా.. ఇందులో ఇంటర్‌లో 73,36,609 (82 శాతం) మంది చేరారు. 2020–21 గణాంకాల ప్రకారం టెన్త్‌లో 91,64,940 మంది ఉండగా, వారిలో ఇంటర్‌లో 65,80,132 (72 శాతం) మంది చేరారు. అంటే పది శాతం మేర బాలికల చేరికలు పెరిగినట్లు యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ – యూడైస్+ (యూడీఐఎస్+) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉన్నత విద్యలోనూ బాలికల పెరుగుదల

- ఇంటర్మీడియెట్ అనంతరం ఉన్నత చదువుల్లోనూ బాలికల చేరికలు గణనీయంగా పెరుగుతున్నట్లు ఐష్ పేర్కొంది. 2020–21 నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా ఉన్నత చదువుల్లో చేరికలు 2019–20లో 3.85 కోట్లు ఉండగా, 2020–21లో అది 4.13 కోట్లకు చేరినట్లు తెలిపింది. అంటే 28.80 లక్షల మంది పెరిగారు.
- 2018–19లో 2.7 శాతం ఉండగా, 2019–20లో 3 శాతం మేర, 2020–21లో 7.4 శాతం మేర పెరిగాయని ఆ నివేదిక తెలిపింది. వీరిలో బాలికల చేరికలు 2019–20లో 1.89 కోట్లు కాగా, 2020–21లో 1.96 కోట్లుగా ఉంది. 2021–22, 2022–23 అధికారిక గణాంకాలు ఖరారైతే ఈ సంఖ్య మరింతగా పెరుగుతుంది.
- ఏపీ విషయానికి వస్తే యూడైస్ గణాంకాల ప్రకారం 2018–19లో టెన్త్ బాలికల్లో 70 శాతం మంది ఇంటర్ ఫస్టియర్లో చేరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 2019–20లో అమ్మ ఒడి తదితర కార్యక్రమాలతో 78 శాతం మంది ఇంటర్‌లో చేరారు.
- 2020–21లో కరోనా వంటి ప్రతికూల పరిస్థితుల్లో చేరికలు 70 శాతంగా ఉన్నా, మళ్లీ 2021–22 నాటికి బాలికల చేరికల శాతం 75 శాతానికి చేరుకుంది. ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే ఇంటర్‌లో బాలికల చేరికలు 2021–22లో ఏపీలో 75 శాతంగా ఉండగా బీహార్‌లో 56 శాతం, కర్ణాటకలో 73 శాతం, తెలంగాణలో 74 శాతంగా ఉన్నాయి.

ఐష్ నివేదికల ప్రకారం జాతీయ స్థాయిలో ఉన్నత విద్యా సంస్థల్లో 2018-19 నుంచి 2020-21 వరకు చేరికలు

సంవత్సరం	పురుషులు	మహిళలు	మొత్తం
2018-19	1,92,09,888	1,81,89,500	3,73,99,388
2019-20	1,96,43,747	1,88,92,612	3,85,36,359
2020-21	2,12,37,910	2,01,42,803	4,13,80,713

ఏపీలోని ఉన్నత విద్యా సంస్థల్లో 2018-19 నుంచి 2020-21 వరకు చేరికల గణాంకాలు

సంవత్సరం	పురుషులు	మహిళలు	మొత్తం
2018-19	9,64,806	7,96,024	17,60,830
2019-20	10,21,126	8,76,023	18,97,149
2020-21	10,56,065	9,31,553	19,87,618

యూడైస్ గణాంకాల ప్రకారం 2018-19 నుంచి 2021-22 వరకు జాతీయ స్థాయిలో 1 నుంచి ఇంటర్ వరకు చేరికలు

సంవత్సరం	బాలికలు	బాలురు	మొత్తం
2018-19	11,94,80,992	12,88,57,592	24,83,38,584
2019-20	12,08,89,058	13,00,82,652	25,09,71,710
2020-21	12,20,72,631	13,17,31,830	25,38,04,461
2021-22	12,28,91,568	13,28,49,055	25,57,40,623

యూడైస్ గణాంకాల ప్రకారం 2018-19 నుంచి 2021-22 వరకు ఏపీలో 1 నుంచి ఇంటర్ వరకు చేరికలు

సంవత్సరం	బాలికలు	బాలురు	మొత్తం
2018-19	37,70,964	40,90,935	78,61,899
2019-20	39,23,683	42,13,250	81,36,933
2020-21	39,43,871	42,64,715	82,08,586
2021-22	39,31,189	42,36,067	81,67,256

యూడైస్ గణాంకాల ప్రకారం 2018-19 నుంచి 2021-22 వరకు ఏపీలో 10, 11వ తరగతి విద్యార్థులు

సంవత్సరం	10వ తరగతి			11వ తరగతి		
	బాలికలు	బాలురు	మొత్తం	బాలికలు	బాలురు	మొత్తం
2018-19	3,15,440	3,34,073	6,49,513	2,16,468	2,16,100	4,32,568
2019-20	3,20,227	3,36,824	6,57,051	2,47,998	2,34,182	4,82,180
2020-21	3,19,193	3,42,234	6,61,427	2,24,943	2,26,730	4,51,673
2021-22	3,18,040	3,40,341	6,58,381	2,37,530	2,36,919	4,74,449

2018లో బడులకు వెళ్లని 14-16 ఏళ్ల బాలికలు 13.5 శాతం

తాజాగా అది 7.9 శాతానికి తగ్గుముఖం

బడికి వెళ్లని 11-14 ఏళ్ల బాలికల శాతం 4.5 నుంచి 2 శాతానికి తగ్గుదల

అదనపు వ్యాట్ బాబు వేసిందేగా?

▶ మొదటి పేజీ తరువాయి

పనిగట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్న దాని అధిపతి రామోజీరావుకు గానీ ఈ పన్నులన్నీ మునుపటి నుంచే కొనసాగుతున్నాయన్న వాస్తవం తెలిసి కూడా తెలియనట్లే వ్యవహరిస్తుండటం!!. ఇప్పుడేదో కొత్తగా పన్నులు పెంచేసినట్లు... దీనివల్ల ఇంధన ధరలు రాత్రికి రాత్రే హఠాత్తుగా పెరిగిపోయినట్లు 'ఈనాడు' రాసిన కథనం చూస్తే ఎవ్వరికైనా 'ఔరా..!' అనిపించకమానదు. పైపెచ్చు తాను పెంచిన అదనపు వ్యాట్ 4 రూపాయలు కాగా... కేవలం ఎన్నికలకు మూడునాలుగు నెలల ముందు ఏదో ఉపశమనం ఇస్తున్నట్లుగా అందులో 2 రూపాయలు తగ్గించారు చంద్రబాబు. తన పదవీకాలం మొత్తం పెంచిన ఛార్జీల్ని వసూలు చేసి... చివర్లో నాలుగు నెలలు ఎన్నికల్లో ఓట్ల కోసం... అందులోనూ సగం మాత్రమే తగ్గిస్తే... అప్పట్లో 'ఈనాడు' దీన్ని ప్రశ్నిస్తే ఒట్టు!. ఇదంతా ఎన్నికల గిమ్మిక్కేనని ఒక్క అక్షరం కూడా రాయని రామోజీరావు... ఇప్పుడూ అవే ఛార్జీలను కొనసాగిస్తున్నా.. ఏదో రాత్రికి రాత్రే రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరల్ని పెంచేసినట్లు వార్తలు రాయటం చూస్తే ఇదెక్కడి పాత్రికేయమని అనిపించకమానదు.

పన్నులన్నీ కేంద్రానివేనని తెలియదా?

అంతర్జాతీయంగా ముడి చమురు ధరల కదలికలను బట్టే దేశంలో ధరలు పెరగటం, తగ్గటం జరుగుతోందన్నది వాస్తవం. కాకపోతే అంతర్జాతీయంగా బాగా తగ్గినపుడు... కేంద్రం ఆ ఉపశమనాన్ని వినియోగదారులకు బదలాయించటం లేదు. రకరకాల పన్నులను పెంచటం ద్వారా ఆ ప్రయోజనాన్ని తన ఖాతాలో వేసుకుంటోంది. ఇలా కేంద్రం అదనపు ఎక్సైజ్ డ్యూటీలు, సెస్‌ల పేరుతో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం వల్లే ఇంధన ధరలు భగ్గుమంటున్నాయన్నది రామోజీరావుకు తెలియనిదేమీ కాదు. నిజం చెప్పాలంటే ఇంధన ధరలు రూపాయి అటూఇటుగా ఇంచుమించు అన్ని రాష్ట్రాల్లో ఒకే మాదిరిగా ఉన్నాయి. ఒక పక్క ఛార్జీలు, సెస్‌లు పేరిట కేంద్రం వాతలు పెడుతుంటే వాటిపై స్పందించకుండా రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపటం చూస్తుంటే రామోజీరావు ఏ స్థాయికి దిగజారుతున్నారన్నది అర్థం కాకమానదు.





- ముడి చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్లో గణనీయంగా తగ్గినప్పటికీ దేశీయ మార్కెట్లో అందుకు అనుగుణంగా ధరలను తగ్గించలేదు. 2019 మే నెలలో లీటరు పెట్రోలు రూ.76.89, డీజిల్ రూ.71.50 చొప్పున ఉండగా 2021 నవంబర్ 1న పెట్రోలు రూ.115.99, డీజిల్ రూ.108.66కి పెరిగాయి. ఇప్పుడు పెట్రోల్ లీటర్ రూ.111.87, డీజిల్ రూ.99.61 ఉంది.
- పెట్రోలు, డీజిల్‌పై కేంద్రం వసూలు చేస్తున్న మొత్తం పన్నుల్లో రాష్ట్రాల వాటా కేవలం 5.8 శాతం. నేరుగా పన్నుల పేరిట వసూలు చేస్తే రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సి ఉంటుంది కనక సెస్‌లు, సర్‌చార్జీలు, అదనపు ఎక్సైజ్ డ్యూటీ, అదనపు ప్రత్యేక ఎక్సైజ్ డ్యూటీ పేరిట కేంద్రం వసూలు చేస్తోంది. ఇలా వసూలు చేస్తున్న మొత్తంలో ఒక్క పైసా కూడా రాష్ట్రాలకు వాటా ఇవ్వడం లేదు.
- పెట్రో ఉత్పత్తుల విక్రయాలపై వార్షికంగా రూ.3.35 లక్షల కోట్లు వసూలవుతున్నా రాష్ట్రాలకు ఇస్తున్న వాటా రూ.19,475 కోట్లు (5.8%) మాత్రమే. వాస్తవానికి కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాల వాటాగా 41 శాతం పంచాల్సి ఉంది. అయితే పెట్రో ఆదాయం ఇలా డివిజబుల్ పూల్‌లోకి రాకుండా సెస్‌లు, సర్‌చార్జీ రూపంలో కేంద్రం సుమారు రూ.2,87,500 కోట్లు వసూలు చేస్తోంది. ఈ వాస్తవం 'ఈనాడు'కు తెలియదనుకోలేం!!.
- టీడీపీ అధికారంలో ఉండగా రహదారులపై దృష్టి పెట్టకపోవడంతో నిర్వహణ లోపం కారణంగా రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా ఏటా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఫలితంగా రోడ్లు ఇబ్బందికరంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో రూ.2,205 కోట్లతో 8,970 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధి, మరమ్మతులు చేపట్టింది ప్రభుత్వం. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా లీటరుపై కేవలం రూ.1 మాత్రమే సుంకంగా విధించాల్సి వచ్చింది. ఇది మినహా వ్యాట్ గానీ, గత సర్కారు విధించిన అదనపు నాలుగు రూపాయలకు మించిగానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్క పైసా పెంచలేదు. గత ప్రభుత్వంలో ఉన్నట్లే వ్యాట్, అదనపు రూ.నాలుగు ఇప్పుడూ ఉన్నాయి. మరోవైపు కోవిడ్ వల్ల రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్ల రాబడిని కోల్పోయింది. అయినప్పటికీ వాహనదారులపై భారం మోపలేదు.

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌పై పన్నులు ఇలా..

వివరాలు	పెట్రోల్		డీజిల్	
	వ్యాట్	అదనపు వ్యాట్, సెస్ లీటర్‌కు	వ్యాట్	అదనపు వ్యాట్, సెస్ లీటర్‌కు
05-02-2015 నాటికి	31 శాతం	--	22.5 %	---
05-02-2015 నుంచి	31 శాతం	రూ.4	22.5 %	రూ.4
19-09-2020 నుంచి	31శాతం	రూ.4 +రూ.1 సెస్	22.5%	రూ.4 +రూ.1 సెస్

పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం విధించే పన్నులలో రాష్ట్రాల వాటా

పన్నుల వివరాలు	పన్ను మొత్తం (కోట్లలో)	రాష్ట్రాల వాటా శాతం	రాష్ట్రాల వాటా రూ.కోట్లు
ఎక్సైజ్ డ్యూటీ	47,500	41	19,475
ప్రత్యేక అదనపు ఎక్సైజ్ డ్యూటీ (సెస్)	74,350	0	0
అదనపు ఎక్సైజ్ డ్యూటీ (రోడ్-ఇన్‌ఫ్రా సెస్)	1,98,000	0	0
ఇతర పన్నులు (సెస్, సర్‌చార్జీలు	15,150	0	0
మొత్తం	3,35,000		19,475 (5.80%)

ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌కు సతీ వియోగం

- నివాళులర్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దంపతులు
- స్వర్ణ కుమారి కుమార్తె ప్రణవకు ధైర్యం చెప్పిన వైఎస్ భారతి
- తాము అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా



తలశిల రాఘురాం సతీమణి స్వర్ణకుమారి భౌతికకాయం వద్ద నివాళిలర్పిస్తున్న సీఎం జగన్, భారతి

భవానీపురం (విజయవాడ పశ్చిమ)/సాక్షి, అమరావతి : ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయ కర్త, శాసనమండలి సభ్యుడు తలశిల రఘురామ్‌కు సతీ వియోగం కలిగింది. అనారోగ్య కారణంగా విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రఘురామ్ సతీమణి తలశిల స్వర్ణ కుమారి (45) ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. ఆమె భౌతికకాయాన్ని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని రఘురామ్ నివాసంలో ఉంచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, భారతి దంపతులు స్వర్ణకుమారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. తమ కుటుంబానికి ఎంతో ఆప్తుడైన రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి ఆకస్మిక మృతి దిగ్భ్రాంతి కలిగించిందని చెప్పారు. రఘురామ్‌తో పాటు ఆయన తండ్రి చంద్రశేఖరరావు, కుమార్తె తలశిల ప్రణవ, సోదరులు ధూళిపాళ్ల శ్రీనాథ్, శ్రీకాంత్‌ను పరామర్శించారు. రఘురామ్ కుమార్తె ప్రణవను సీఎం జగన్ సతీమణి భారతి అక్కున చేర్చుకుని ఓదార్చారు. తాము ఉన్నామంటూ వారందరికీ ధైర్యం చెప్పారు. చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కాగా, పలువురు ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు స్వర్ణకుమారి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. రఘురామ్‌ను, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గవర్నర్, సీఎం సంతాపం

'తలశిల రఘురామ్ సతీమణి తలశిల స్వర్ణ కుమారి చిన్న వయస్సులోనే మృతి చెందటం ఆ కుటుంబ సభ్యులకు తీరని లోటు. రఘురామ్ ఈ బాధను అధిగమించాలి' అని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. 'నా ఆత్మీయుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురామ్ సతీమణి తలశిల స్వర్ణకుమారి అకాల మరణం బాధాకరం. రఘురామ్ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా' అని సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

వర్రీ 'గుడ్ మార్నింగ్'

దేశంలో సెల్‌ఫోన్లను ముంచెత్తుతున్న సందేశాలు

- 2 వేల కోట్లకు పైగా కొత్త ఏడాది శుభాకాంక్షలు
- మొరాయిస్తున్న మూడోవంతు మొబైళ్లు
- ప్రతి మూడు ఫోన్లలో ఒకటి మెమరీ ఫుల్.. ఐదేళ్లలో గూగుల్ సెర్చ్ 10 శాతం పెరుగుదల
- వెస్టర్న్ డిజిటల్ కార్పొరేషన్ సంస్థ అధ్యయనంలో వెల్లడి



ఉదయం నిద్ర లేవగానే చాలా మంది మొదట చేతిలోకి తీసుకునేది సెల్‌ఫోనే. మొబైల్ ఓపెన్ చేయగానే టపటపా వచ్చిపడే మెస్సేజీలలో 'గుడ్ మార్నింగ్' సందేశాలే అధికం. ఒకప్పుడు బాగానే ఉన్నా ఇప్పుడవి చిరాకు పుట్టిస్తున్నాయి. ఎవరు పంపారో చూడకుండానే తొలగించే ప్రక్రియతో రోజు ప్రారంభించాల్సిన పరిస్థితి. గుడ్ మార్నింగ్ సందేశాలు స్మార్ట్‌ఫోన్‌కు పెద్ద సమస్యగా మారుతున్నాయి. భారత్‌లో ఈ మెస్సేజ్‌ల వల్ల మూడో వంతు ఫోన్లు పనిచేయడం లేదని, ప్రతి మూడు స్మార్ట్ ఫోన్లలో ఒకటి మెమరీ ఫుల్ అయిపోతోందని అమెరికాకు చెందిన కంప్యూటర్ డ్రైవ్ తయారీ, డేటా నిల్వ సంస్థ 'వెస్ట్రన్ డిజిటల్ కార్పొరేషన్' తెలిపింది. - సాక్షి, అమరావతి

10 రెట్లు పెరిగిన సెర్చింగ్

భారతీయుల గుడ్ మార్నింగ్ సందేశాలు రోజూ కోట్ల సంఖ్యలో ఇంటర్నెట్‌ను ముంచెత్తుతున్నాయి. అపరిమిత డేటా అందుబాటులో ఉండడంతో గత ఐదేళ్లలో గుడ్ మార్నింగ్ సందేశాల కోసం గూగుల్‌లో సెర్చ్ చేయటం 10 రెట్లు పెరిగింది. దేశంలో పింటరెస్ట్ యాప్ నుంచి సందేశాలతో కూడిన ఫొటోల డౌన్‌లోడ్ ఏడాదిలో 9 రెట్లు పెరిగింది.

దేశంలో మెస్సేజ్ లెక్కలు ఇవీ

వాట్సాప్ యూజర్లు 48.75 కోట్లు

యాక్టివ్ వినియోగదారులు 39 కోట్లు

రోజుకు సగటున పంపే మెస్సేజ్‌లు 54



భారత్‌లో 2 వేల కోట్ల న్యూ ఇయర్ మెస్సేజ్‌లు



సోషల్ మీడియా గ్రూప్‌లో వాట్సాప్ క్రేజ్ అంతా ఇంతా కాదు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 200 కోట్ల మంది వాట్సాప్ వాడుతుండగా మన దేశమే అతిపెద్ద మార్కెట్. భారత్‌లో 48.75 కోట్ల మంది వాట్సాప్ యూజర్లు ఉండగా 39 కోట్ల మంది నిత్యం గ్రూపుల్లో చురుగ్గా ఉంటున్నట్లు వెస్టర్న్ డిజిటల్ కార్పొరేషన్ సర్వే తేల్చింది. నూతన సంవత్సరం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా 100 బిలియన్ల సందేశాలు పంపితే భారత్ నుంచి 20 బిలియన్లకు పైగా (2 వేల కోట్లకు పైగా) సందేశాలు వెల్లువెత్తాయని, ఇది ప్రపంచ రికార్డుగా ఆ సంస్థ ప్రకటించింది. ఇలా వచ్చిపడే సందేశాలతో చాలామంది ఫోన్లు స్తంభించిపోతున్నాయి. వాటిని చదివి ప్రతిస్పందించడం కష్టంగా మారింది. అమెరికాలో నిత్యం ప్రతి పది మందిలో ఒకరి ఫోన్ మెమరీ సందేశాలతో నిండిపోతుండగా మనదేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నట్లు వెస్టర్న్ డిజిటల్ కార్పొరేషన్ వెల్లడించింది. ఈ సమస్యకి పరిష్కారంపై అధ్యయనం చేసిన గూగుల్ 'ఫైల్స్ గో' అనే కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ సగటున ఒక్కో యూజర్‌కు ఒక గిగాబైట్ వరకూ డేటాను క్లియర్ చేసిందని గూగుల్ ప్రకటించింది. ఆఫ్‌లైన్‌లోనూ సేవలు వినియోగించుకునే అవకాశం ఉండడం ఈ యాప్ ప్రత్యేకత.

'కానిస్టేబుల్' మెయిన్ పరీక్షకు 95,208 మందికి అర్హత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రిలిమినరీ రాతపరీక్షలో 95,208 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. గత నెల 22న నిర్వహించిన పరీక్షల ఫలితాలను ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆదివారం ప్రకటించింది. మొత్తం 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. 35 ప్రాంతాల్లోని 997 కేంద్రాల్లో నిర్వహించిన ప్రిలిమినరీ రాతపరీక్షకు 4,59,182 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 95,208 మంది అర్హత సాధించారు. పరీక్ష రాసిన 3,63,432 మంది పురుషుల్లో 77,876 మంది క్వాలిఫైకాగా.. 95,750 మంది మహిళల్లో 17,332 మంది క్వాలిఫై అయ్యారు. అర్హత సాధించిన వారి వివరాలు slprb. ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచారు. ప్రిలిమినరీ రాతపరీక్ష జవాబు పత్రాల కీ గతనెల 22న సాయంత్రం విడుదల చేశారు. దానిపై వచ్చిన 2,261 అభ్యంతరాలను పరిశీలించిన సబ్జెక్ట్ నిపుణులు.. ఆ కీలోని మూడు ప్రశ్నలకు జవాబులు మార్చి తుది కీ విడుదల చేశారు. స్కాన్‌చేసిన ఓఎంఆర్ షీట్లను మూడురోజులపాటు డౌన్‌లోడ్ చేసుకునేలా అందుబాటులో ఉంచారు. ఈ నెల 7వ తేదీ (మంగళవారం) సాయంత్రం 5 గంటల వరకు వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తదుపరి సమాచారం కోసం ఈ వెబ్‌సైట్‌ను తరచు పరిశీలించాలని సూచించారు. మెయిన్ పరీక్షకు దరఖాస్తులు ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయి. మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ నంబరు 9441450639కి కాల్ చేయవచ్చు. 9100203323 నంబరులో సంప్రదించవచ్చు. mail-slprb@ap.gov.inకి మెయిల్ చేయవచ్చు.

కటాఫ్ మార్కుల వివరాలు

200 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్షలో కటాఫ్ ఓసీలకు 40 శాతం (200కు 80 మార్కులు), బీసీలకు 35 శాతం (200కు 70 మార్కులు), ఎస్సీ, ఎస్టీ, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు 30 శాతం (200కు 60 మార్కులు)గా నిర్ణయించారు.

కులాలవారీగా పరీక్ష రాసిన, క్వాలిఫై అయిన పురుషులు, మహిళల సంఖ్య

కులం	పురుషులు		మహిళలు	
	పరీక్ష రాసినవారు	క్వాలిఫై అయినవారు	పరీక్ష రాసినవారు	క్వాలిఫై అయినవారు
ఓసీ	38,920	3,008	7,565	453
బీసీ-ఏ	59,501	9,549	14,219	1,591
బీసీ-బీ	44,863	7,779	11,152	1,505
బీసీ-సీ	1,005	178	295	39
బీసీ-డీ	79,331	17,498	21,209	3,347
బీసీ-ఈ	15,961	2,036	2,578	310
ఎస్సీ	92,603	28,435	28,343	7,852
ఎస్టీ	23,400	7,166	8,397	1,925
ఏజెవో-ఎస్టీ	5,081	1,120	1,967	304
ఎక్స్‌సర్వీస్‌మెన్	2,767	1,107	25	6
మొత్తం	3,63,432	77,876	95,750	17,332

ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న కాకర్ల వెంకటరామిరెడ్డి

- పదోన్నతులు, జీతాల పెంపు, వేతనాల విడుదలలో ముందడుగు
- ప్రభుత్వంపై బురదజల్లే ఎల్లో మీడియా వైరస్‌ను తరిమి కొడదాం
- ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి

నంద్యాల (అర్బన్): ఉద్యోగుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నారని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఏపీజీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం నంద్యాలలో శ్రీనివాస సెంటర్ నుంచి టెక్కె మార్కెట్ యార్డు వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు దాదాపు 4 వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టెక్కె మార్కెట్ యార్డులో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 76 ఉద్యోగ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడేళ్లలో 3,798 మంది వీఆర్‌ఏలకు ప్రభుత్వం వీఆర్‌ఓలుగా పదోన్నతులు కల్పించిందన్నారు. వీఆర్‌ఓలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతుల విషయం, ఇతరత్రా ఉద్యోగుల సమస్యలన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. 25 ఏళ్లుగా ప్రమోషన్లకు నోచుకోని 230 మంది ఎంపీడీవోలకు పదోన్నతులు.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1వ తేదీనే ఆప్కాస్ ద్వారా వేతనాలు.. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా 1.30 లక్షల మందికి శాశ్వత ఉద్యోగాలు.. త్వరలో ఇంకో 14 వేల పోస్టుల భర్తీ.. ఇలా ఎన్నో విషయాల్లో ప్రభుత్వం ముందుకు అడుగులు వేసిందని చెప్పారు.

రాధాకృష్ణా.. మీ ముత్తాతలు దిగిరావాలి

సెక్రటేరియేట్ ఎన్నికల్లో నేను ఓడిపోతానని 'ఆంధ్రజ్యోతి'లో రాధాకృష్ణ ఎడిటోరియల్ రాశారు. సంపూర్ణ మెజార్టీతో గెలిస్తే.. జగన్ బంటు ఎలా గెలిచారని మరో కథనం రాసి రాక్షసానందం పొందారు. జగన్ బంటునే ఓడించలేని రాధాకృష్ణ.. జగన్‌ను ఓడించగలరా? చెత్త మాటలు.. చెత్త రాతలు. మీ తాత ముత్తాతలు దిగి వచ్చినా ఈ ప్రభుత్వాన్ని ఓడించలేరు. ఈ ఎల్లో మీడియా వైరస్‌ను ప్రభుత్వ ఉద్యోగులు తరిమి కొట్టాలి. అవసరమైనప్పుడు ఉద్యోగులంతా ప్రభుత్వానికి అండగా ఉండాలి.

26 లోపు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

కర్నూలు (సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ఈ నెల 26వ తేదీలోపు పరిష్కరించాలని, లేదంటే కలిసి వచ్చే ఉద్యోగ సంఘాల జేఏసీలతో ఉద్యమానికి వెళ్తామని ఏపీ జేఏసీ అమరావతి (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సేవా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ) చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లిఖిత పూర్వకంగా విన్నవిస్తామని, 26వ తేదీలోపు వాటిని పరిష్కరించకపోతే ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఆదివారం కర్నూలులో ఏపీ జేఏసీ అమరావతి మూడో రాష్ట్ర మహాసభల్లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేకపోవడంతో పాటు, సీఎం ఇచ్చిన హామీ మేరకు 11వ పీఆర్సీ బకాయిలను విడుదల చేయడం లేదన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తోందని ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల వ్యవహారాలు) ఎన్.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. పీఆర్సీ, డీఏ బకాయిల సమస్యలు త్వరలోనే కొలిక్కి వస్తాయన్నారు. అంతకు ముందు ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌తో పాటు 21 పదవులకు ఎన్నికైన వారు ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ జేఏసీ అమరావతికి ప్రభుత్వ సలహాదారుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో సలహా మండలి ఏర్పాటు చేశారు.

రాజకీయాలనూ మహిళలు శాసించగలగాలి

'జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్' సదస్సులో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

సాక్షి, విశాఖపట్నం: రాజకీయాలను మహిళలు శాసించగలగాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పిలుపునిచ్చారు. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో విశాఖలో 'షీ ఈజ్ ఏ ఛేంజ్ మేకర్' పేరిట ఆదివారం నిర్వహించిన 'జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్' రెండో రోజు సదస్సులో మాట్లాడుతూ.. మహిళలు రాజకీయాల్లో రాణించడమంటే సప్తసముద్రాలు ఈదడం వంటిదన్నారు. అయితే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ కారణంగా రాజకీయాల్లో మహిళలు రాణించడం సులువైందన్నారు. సరైన వేదిక.. సరైన ప్రోత్సాహం లేకపోతే ఇంటా, బయటా రెండింటా మహిళలు రాణించడం అత్యంత కష్టమైన పని అన్నారు.

'పవన్‌కి చెప్పాల్సినవి పొరపాటున నాకు చెప్పినట్లున్నారు'



సాక్షి, విశాఖపట్నం: ''కాపుల భవిష్యత్తు విషయంలో చంద్రబాబుతో జత కడుతున్న పవన్ కల్యాణ్‌కి రాయల్సిన, చెప్పాల్సిన విషయాలు పొరపాటున నాకు రాసినట్లుగా ఉన్నారు..మీకు ఆయురారోగ్యాలతో పాటు.. మీరు మానసికంగా ధృడంగా ఉండాలని దేవుని ప్రార్థిస్తున్నాను'' అని మాజీ ఎంపీ హరిరామ జోగయ్యకి మంత్రి అమర్‌నాథ్ ఆదివారం లేఖ రాశారు. ఇటీవల జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలకు గానూ మాజీ ఎంపీ హరిరామజోగయ్య మంత్రికి లేఖ రాశారు. దానికి బదులుగా మంత్రి మాజీ ఎంపీకి ఆదివారం లేఖ రాశారు.

అంగన్‌వాడీల్లో స్మార్ట్ సేవలు

- గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ఫోకస్
- పౌష్టికాహారం పంపిణీలో మరింత పారదర్శకత
- ప్రత్యేక యాప్‌లో సేవలన్నీ నిక్షిప్తం
- రాష్ట్రస్థాయి అధికారులు నేరుగా పర్యవేక్షణ



దర్మానగర్‌లో గుర్తింపు కార్డులు చూపిస్తున్న గర్భిణులు, బాలింతలు

సంక్షిప్త సమాచారం

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	04
జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	776
సేవలందుకుంటున్న గర్భిణులు	7,779
బాలింతలు	7,621
6 నెలల నుంచి 3 ఏళ్ల వరకు పిల్లలు	50,796
3–6 సంవత్సరాల పిల్లలు	10,960
అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలు	221

విశాఖ విద్య: మాతా–శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు విశేష సేవలందిస్తున్నాయి. ఈ కేంద్రాలు మరింత పారదర్శకమైన సేవలందించేలా ప్రభుత్వం తాజాగా చేసిన ప్రయత్నం సత్ఫలితాలనిస్తోంది. జిల్లాలోని 776 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 20 మంది సూపర్ వైజర్లకు ఇటీవల స్మార్ట్‌ఫోన్లు అందజేసింది. కేంద్రాల్లో అందించే అన్ని రకాల సేవలను వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో నమోదు చేసేలా వీటిని వినియోగిస్తున్నారు. సూపర్‌వైజర్లు మొదలుకొని, స్త్రీ శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ స్థాయి అధికారుల వరకు యాప్ ద్వారా ప్రతి రోజూ కేంద్రాలను పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు. చిన్నారులకు రుచికరమైన పౌష్టికాహారం అందించడంతో పాటు లబ్ధిదారులకు ప్రతి నెలా ఇంటికి ఇచ్చే రేషన్(టీహెచ్‌ఆర్) సరకుల్లో నాణ్యతకు పెద్ద పీట వేస్తూ.. త్వరలోనే మార్క్‌ఫెడ్ ద్వారా సరకులు సరఫరా చేయనున్నారు.

'సంపూర్ణ పోషణ'తో ఆరోగ్యమస్తు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీల నిర్వహణపై దృష్టి సారించింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసమని రుచికరమైన పౌష్టికాహారం అందిస్తోంది. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరిట గర్భిణులు, బాలింతలకు ప్రతి రోజూ మధ్యాహ్నం భోజనం, ఒక గుడ్డు, 200 మిల్లీ లీటర్ల పాలు ఇస్తున్నారు. అదే విధంగా టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్) కింద నెలకు పోషణ కిట్(కేజీ రాగిపిండి, కేజీ సజ్జ పిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాములు ఎండి ఖర్జూరం, చెక్కీలు) అందజేస్తున్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు 2.5 కిలోల బాలామృతం ప్యాకెట్, 25 గుడ్లు, 2.5 లీటర్ల పాలు ఇస్తున్నారు. సచివాలయ ఏఎన్‌ఎంలు రెగ్యులర్‌గా కేంద్రాలను సందర్శించి ఆరోగ్యపరమైన సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారు.

అందరికీ పౌష్టికాహారం అందేలా..

విశాఖ పట్నం జిల్లాలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు కలిపి 84,032 మంది లబ్ధిదారులు నమోదుకాగా, ఇందులో 77,156 మంది సేవలు పొందుతున్నారు. ఈ లెక్కన జిల్లాలో 91.80 శాతం మంది కేంద్రాల్లో సేవలు అందుకుంటున్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో నూరుశాతం లక్ష్యం సాధించేలా అధికారులు ఫోకస్ పెట్టారు.

స్మార్ట్‌ఫోన్లతో సకాలంలో సమాచారం



కేంద్రాల కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు స్మార్టుఫోన్లు అందించాం. కేంద్రాల్లో నమోదైన వారందరికీ పౌష్టికాహారం అందించాలని కార్యకర్తలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. నూరుశాతం లక్ష్యం సాధించేందుకు కృషి చేస్తున్నాం. కేంద్రాలను తరచూ తనిఖీ చేస్తున్నాం. మార్క్‌ఫెడ్ ద్వారా సరకుల సరఫరాపై ఏర్పాట్లు జరుగుతున్నాయి.

–డి.వెంకటేశ్వరి, ప్రాజెక్టు అధికారి, విశాఖ జిల్లా

గతంలో కంటే సేవలు పెరిగాయి



కేంద్రాల్లో గతంలో కన్నా సేవలు బాగా పెరిగాయి. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్ ద్వారా ఏ రోజుకారోజు వివరాలను నమోదు చేస్తున్నాం. గర్భిణులు, బాలింతలకు ఇచ్చే సరకులు కూడా సకాలంలోనే కేంద్రాలకు వస్తున్నాయి. ఆట వస్తువులు ఇటీవలే వచ్చాయి. ఇవి ప్రీ స్కూల్ పిల్లలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

–కె.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, ఇందిరానగర్

కార్గో రవాణాపై నిఘా!

- అడ్డగోలు సరకు రవాణాకు అడ్డుకట్ట
- ఇటీవల రేషన్ బియ్యంతో పట్టుబడ్డ డీజీటీ
- అప్రమత్తమైన ఆర్టీసీ అధికారులు
- బుకింగ్ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, సిబ్బందికి హెచ్చరిక



ఆర్టీసీ లాజిస్టిక్స్ కంటైనర్

సాక్షి, విశాఖపట్నం: కార్గో రవాణాలో అక్రమాలకు ఆస్కారం లేకుండా ఆర్టీసీ పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో ఆర్టీసీ కార్గో బస్సులో రేషన్ బియ్యం రవాణా చేస్తూ పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇకపై అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి నిఘా పెట్టనుంది. అంతగా తనిఖీల బెడద ఉండదన్న ఉద్దేశంతో అక్రమార్కులు ఆర్టీసీ కార్గో బస్సుల్లో నిషేధిత, అక్రమ సరకు రవాణాను ఎంచుకుంటున్నారు. కాంట్రాక్టర్లు, ఏటీబీ (ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్) ఏజెంట్లకు కూడా సరకు రవాణా బుకింగ్ సదుపాయాన్ని ఆర్టీసీ కల్పించింది. దీనిని కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారు. ఒక సరకు పేరు చెప్పి మరొక సరకును రవాణా చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో పట్టుబడిన డీజీటీ వాహనంలో నూకలు పేరు చెప్పి రేషన్ బియ్యాన్ని రవాణా చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత డీజీటీ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్, కంట్రాక్టరు ఉన్నట్టు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేశారు. ఆర్టీసీ కార్గోలో సిమెంట్, హార్డ్‌వేర్, గృహావసర సరకులు, గోధుమ పిండి, దుస్తులు, మందులు, నూకలు వంటివి రవాణా జరుగుతోంది.

కొందరు అడ్డదారులు తొక్కడంతో..

ఇప్పటికే ఆర్టీసీ కార్గో సేవలకు మంచి ఆదరణ లభిస్తోంది. ఫలితంగా ఆదాయం బాగానే సమకూరుతోంది. దీంతో ఈ కార్గో వ్యవస్థను మరింత విస్తృతం చేయాలన్న యోచనలో ఉంది. ఇలాంటి తరుణంలో సరకు రవాణాలో కొందరు అడ్డదారులు తొక్కడం ఆర్టీసీ ఉన్నతాధికారులను కలవరానికి గురి చేస్తోంది. దీనికి అడ్డుకట్ట వేయకపోతే ఈ కార్గో వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భావిస్తోంది. అందుకే ఆర్టీసీ లాజిస్టిక్స్ కంటైనర్లు/డీజీటీ (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు)ల్లో సరకు బుకింగ్, రవాణాలపై గట్టి నిఘా పెట్టాలన్న నిర్ణయానికొచ్చింది. వీటిలో రేషన్ బియ్యం, తలవెంట్రుకలు, చేపలు, మద్యం తదితర వాటితో పాటు నిషేధిత సరకులు/వస్తువులను అనుమతించకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. దీనిపై సంబంధిత ఏటీబీ ఏజెంట్లు, కాంట్రాక్టర్లు, ఆర్టీసీ సిబ్బందికి ముందుగా సమావేశాల ద్వారా అవగాహన కల్పించడం, హెచ్చరికలు జారీ చేయడం వంటివి చేస్తున్నారు. ఇలాంటి అక్రమ రవాణాలో భాగస్వామ్యం ఉన్న వారిని ఉద్యోగాల నుంచి తొలగింపు వంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటామని, బాధ్యులైన ఏటీబీ ఏజెంట్లు, కాంట్రాక్టర్ల ఏజెన్సీలను రద్దు చేయడమే కాకుండా వారిపై కేసులు నమోదు చేస్తామని ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ 'సాక్షి'తో చెప్పారు.

మధురవాడ–హైదరాబాద్ బస్సు రద్దు

మరోవైపు గంజాయి అక్రమ రవాణా బెడద కూడా ఆర్టీసీకి ఉంది. మధురవాడ నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్ వెళ్లే బస్సులో గంజాయి రవాణా చేస్తున్నట్టు వెలుగు చూసింది. నర్సీపట్నం, చింతపల్లి, సీలేరు, చింతూరు, వీఆర్‌పురం, నేరెళ్ల, ఎటపాక, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాల మీదుగా ఈ బస్సు ప్రయాణిస్తుంది. అక్రమార్కులు ఈ బస్సును గంజాయి రవాణాకు అనువుగా మలుచుకున్నారు. పలుమార్లు దీనికి అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నించినా వీలు కాలేదు. దీంతో ఆర్టీసీ అధికారులు ఇటీవల ఆ బస్సు సర్వీసును రద్దు చేశారు.

కంపెనీ సెక్రటరీ..కార్పొరేట్ కింగ్..!

- కోర్సు చేస్తే ఉపాధి అవకాశాలు బోలెడు
- ఏయూ వేదికగా విద్యార్థులకు సేవలు
- నాలుగేళ్ల కోర్సులో మెరుగైన అవకాశాలు
- ఎప్పుడైనా కోర్సులో చేసే అవకాశం
- ఏడాదికి రెండు పర్యాయాలు పరీక్షలు
- సీఎస్ చేస్తే భవిష్యత్ ఎంతో ఉజ్వలం



ఏయూలో ఐసీఎస్ఐ కార్యక్రమాలను తిలకిస్తున్న రిజిస్ట్రార్ (ఫైల్‌ఫోటో)

కంపెనీ సెక్రటరీనా (సీఎస్).. అయితే మా సంస్థలో అవకాశం ఉంది.. వెంటనే వచ్చి చేరండి! ఇవీ కార్పొరేట్ కంపెనీల నుంచి సీఎస్‌లకు వస్తున్న ఆఫర్స్!! వీటిని బట్టి సీఎస్‌లకు మార్కెట్‌లో ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోచ్చు. దాంతో ఇటీవల కాలంలో యువత.. సంస్థల నిర్వహణా నైపుణ్యాలను అందించే కంపెనీ సెక్రటరీ (సీఎస్) కోర్సు వైపు ఆకర్షితులవుతున్నారు. ఈ నేపథ్యంలో.. కంపెనీ సెక్రటరీ కోర్సు తీరుతెన్నులు, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం.

ఏయూక్యాంపస్ : యువతకు అత్యంత భద్రమైన, మహోజ్వల భవిష్యత్‌ను అందించే కోర్సుగా కంపెనీ సెక్రటరీ నిలుస్తోంది. ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) తన సేవలను అందిస్తోంది. ఏడాదిలో ఎప్పుడైనా ప్రవేశాలు పొందే అవకాశం ఈ కోర్సుకు ఉన్న ప్రత్యేకత. ప్రవేశాల నుంచి పరీక్షల నిర్వహించి, సర్టిఫికెట్ పొందే వరకు విద్యార్థులకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించడానికి ఐసీఎస్ఐ ప్రాంతీయ కేంద్రం ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగంలో ఏర్పాటైంది. కంపెనీ సెక్రటరీలుగా పనిచేస్తున్న నిపుణులు బ్లెండెడ్ విధానంలో విద్యార్థులను శిక్షణ అందిస్తోంది.

ఏడాదంతా ప్రవేశాలు

కంపెనీ సెక్రటరీ కోర్సులో ఏడాది పొడవునా ప్రవేశాలు కల్పించడం విశేషం. విద్యార్థి ఎప్పుడైనా కోర్సులో చేరే వెసులుబాటు దీనికి ఉంటుంది. పరీక్షలు మాత్రం ఏడాదిలో రెండు పర్యాయాలు నిర్వహిస్తారు. కోర్సులో రెండు దశలు ఉంటాయి. మొదటి దశ ఫౌండేషన్ కోర్సుగా పిలుస్తారు. కంపెనీ సెక్రటరీ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ టెస్ట్(సీఎస్ఈఈటీ)గా వ్యవహరించే ఈ పరీక్షకు ఇంటర్ విద్యార్హత. రెండో దశ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాంగా వ్యవహరిస్తారు. దీనికి డిగ్రీ, బీటెక్, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన వారు అర్హులు. డిగ్రీ విద్యార్హత కలిగిన వారు నేరుగా ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాంలో ప్రవేశం పొందే అవకాశం ఉంది.

నాలుగేళ్ల కష్టం....అందమైన భవిష్యత్తుకు మార్గం


కంపెనీ సెక్రటరీ కోర్సును కేవలం నాలుగేళ్లలో పూర్తి చేసే అవకాశం ఉంది. కోర్సు పూర్తిచేసిన వారికి అపారమైన అవకాశాలు లభిస్తున్నాయి. రూ.10 కోట్ల కంటే ఎక్కువ అధీకృత మూలధనం కలిగిన ప్రతి సంస్థ కంపెనీ సెక్రటరీని కలిగి ఉండాలి. కోర్సు పూర్తి చేసిన వారు జీఎస్టీ ప్రొఫెషనల్‌గా, రిజిస్టర్డ్ వాల్యూవర్, సర్టిఫికేషన్ సర్వీసెస్, కార్పొరేట్ రిస్క్ మేనేజర్, చీఫ్ గవర్నెన్స్ ఆఫీసర్, స్ట్రాటజిక్ మేనేజర్, ఇంటర్నల్ ఆడిటర్, కాంప్లియెన్స్ ఆఫీసర్, అడ్వైజర్ టు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ వంటి ఉన్నత పదవులను పొందే అవకాశం ఉంటుంది. వీరు చేసే విధులకు కాలపరిమితి, పదవీ విరమణ వంటివి ఉండవు. వీరు తమ వృత్తిని జీవితాంతం కొనసాగించే అరుదైన అవకాశం ఉంటుంది.

భారీ వేతనాలు

కోర్సు పూర్తి చేసిన వారు ఆరంభంలో వారి జీతం రూ.40 వేల వేతనంతో ఆరంభిస్తారు. బహుళజాతి సంస్థల్లో పనిచేసే వారు నెలకు వార్షిక వేతనంగా రూ 10–25 లక్షల వరకు ఆర్జిస్తారు. పదేళ్ల అనుభవం సాధిస్తే రూ.25 నుంచి రూ.40 లక్షల వరకు వార్షిక వేతనం అందుకునే అవకాశం ఉంటుంది. 18 ఏళ్లు కలిగిన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చును. కోర్సు పూర్తి చేయడానికి నాలుగేళ్లలో గరిష్టంగా రూ.35 వేలు వరకు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రవేశాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు www.icsi.edu నుంచి సమగ్ర సమాచారాన్ని పొందొచ్చు.

1978 నుంచి సేవలు

విశాఖ ప్రాంతీయ కేంద్రం 1978 నుంచి తన సేవలను అందిస్తోంది. ప్రతి ఏడాది 400 మంది వరకు విశాఖ ప్రాంతీయ కేంద్రం నుంచి ప్రవేశాలు పొందుతున్నారు. విద్యార్థులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు, సెమినార్లు కేంద్రం నుంచి నిర్వహిస్తున్నారు. ఉద్యోగం చేస్తూ కూడా చదువుకునే అవకాశం ఈ కోర్సుకు ఉంది. ప్రవేశాలు ఇతర సమాచారం కోసం విద్యార్థులు కార్యాలయంలో ఈ నంబర్‌లో 0891–2533516 సంప్రదించవచ్చును.



అహంకారి తనను తాను పరిపూర్ణుడిగా భావిస్తాడు. అహంకారంలోని ఈ ప్రధాన దుర్గుణమే మనిషిలో పరివర్తన కలుగకుండా అడ్డుపడుతుంది.
- లియో టాల్‌స్టాయ్

సాక్షి
సోమవారం, ఫిబ్రవరి, 6

సకల జన సమ్మతము

ఒక సాధారణ జీకే ప్రశ్నతో దీన్ని మొదలుపెట్టవచ్చు. తెలుగులో తొలి సంకలన కావ్యం ఏది? 'సకల నీతి సమ్మతము' అన్నది జవాబు. దీన్ని తెలుగులో తొలి నీతిశాస్త్ర గ్రంథంగానూ చెబుతారు. దీని సంకలనకర్త మడికి సింగన. తెలుగులో ఇలాంటి సంకలన గ్రంథాలకు శ్రీకారం చుట్టింది ఆయనే. సింగనది ప్రధానంగా రాజనీతి దృష్టి. తనకు పూర్వులైన ఆంధ్రకవుల గ్రంథాల నుండి అందుకు సంబంధించిన పద్యాలను మాల కట్టాడు. పంచతంత్రి (మనకు తెలిసిన పంచతంత్రం కాదు), కామందకము, ముద్రామాత్యము, నీతిభూషణము, బద్దెన నీతి, కుమార సంభవము, భారతము, రామాయణము, మార్కండేయ పురాణము, విదురనీతి, చారుచర్య, పురుషార్థ సారము, పద్మ పురాణము లాంటి మిక్కిలి కావ్యాలు ఆయనకు ఆధారం. ఆ పద్యాలను తిరిగి నీతిశాస్త్ర ప్రశంస, ప్రజా పాలనము, రాజాదాయవ్యయ ప్రకారము, రాజునకు గొఱగాని గుణములు, కరణికపు నీతులు, పురోహిత నీతి, రాయబార ప్రకారము, చారుల నీతులు, అష్టాదశ వ్యసనములు అంటూ మూడు ఆశ్వాసములుగా విభజించాడు. పద్దు లెక్కలు ఎలా వేయాలో, ఋణ పత్రాలు ఎలా రాయాలో కూడా ఇందులో ఉంటుంది. ఆయన గొప్పతనం పద్యాలను ఏర్చడంలోనే కాదు, కూర్చడంలోనూ ఉంది. ఆయా వర్గాల పద్యాలకు అతుకులుగా తన సొంత పద్యాలను రాశాడు. అందుకనో, అంతకుమునుపు ఈ సంకలన ప్రక్రియ లేనందునో తన కావ్యాన్ని ప్రబంధమనే చెప్పుకొన్నాడు. కానంతమాత్రాన దీని విలువ ఏమీ తగ్గలేదు. తరువాతి కాలంలో వచ్చిన సంకలన గ్రంథాలకు ఇది ఒక స్ఫూర్తిగా నిలిచింది.

ఇలాంటి ఉత్తమ గ్రంథాన్ని మానవల్లి రామకృష్ణ కవి 1923లో సంపాదించి ప్రకటించారు. ఆ ప్రచురణకు ఇది శతాబ్ది సంవత్సరం. విస్మృత కవుల కృతులలో ఒకటిగా మానవల్లి దీన్ని వెలువరించారు. 'ఆంధ్రపత్రికా ముద్రాక్షర శాల'లో ముద్రితమైంది. తిరిగి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ 1979లో దీన్ని 'విద్యారత్న' నిడుదవోలు వేంకటరావు, డాక్టర్ పోణంగి శ్రీరామ అప్పారావు సంపాదకులుగా ప్రచురించింది. తెలంగాణ సాహిత్య అకాడెమీ కూడా ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా ముద్రించింది.

మడికి సింగన క్రీ.శ.1420 ప్రాంతపువాడు. 'ఓరుగల్లున కుత్తరమున నుండు రామగిరి పట్టణమున కధీశ్వరుండగు కందన మంత్రి కాశ్రితుడై బహు గ్రంథముల రచించె'ని మానవల్లి రామకృష్ణ కవి రాశారు. ఇప్పటి వ్యవహారంలో చెప్పాలంటే తెలంగాణలోని 'పెద్దపల్లి జిల్లా రామగిరి నివాసి'. పద్మ పురాణోత్తర ఖండము, భాగవతము దశమ స్కంధము(ద్విపద), జ్ఞాన వాసిష్ఠ రామాయణము ఆయన లభ్య రచనలు. ఆయన పేరు నిలిచి ఉన్నది మాత్రం సకల నీతి సమ్మత సంకలనకర్తగానే! 'అల్లకల్లోలమైన దుగ్ధనిధి ద్రచ్చి / దేవామృతము తేటదేర్చుపగిది/ గంధకారుడు మున్నుగల వస్తువులు జోక గూర్చి సుగంధంబు గూడినట్లు/ అడవి పువ్వుల తేనెలన్నియు మధుపాళి యిట్టలంబుగ జున్ను వెట్టుభంగి/ దననేర్పు మెఱసి వర్తకుడు ముత్తెములీడు గూర్చి హారంబు తాగ్రుచ్చు కరణి' రీతిలో ఈ గ్రంథం కూర్చానని సింగన చెప్పుకొన్నాడు. రాజసభలలో పద్యాలను గమకముతో, అంటే రసోచిత స్థాయులతో చదివే వారి వాచకం ఎట్లుండాలో– 'వెనుకకు బోక హాయనక వేసట నొందక బంతి బంతిలో బెనపక... యక్షరాక్షరము కందువు దప్పక యేకచిత్తుడై యనుపమ భక్తితో జదువునాతని వాచకుడంద్రు సజ్జనుల్' పద్యం చెబుతుంది. 'రవికి మఱుగైన గొందిని దివియ' ప్రకాశింపజేసినట్టుగా, అధికుడు తెలుపని యుక్తివిశేషాన్ని 'చిఱుతవాడు' చెప్పగలండంటుంది ఇంకొక పద్యం. 'సరస కవిత రుచి యెఱుగని పురుషుల బశువులని నిక్కముగ నెఱుగు'మంటుంది మరొకటి. 'కుక్క తోక బట్టుకొని మహాంబుధి దాట'డం, 'తల్లి సచ్చినను జూదరి లేచిపోవండు' లాంటి వాడుకలు, జాతీయాలు ఇందులో కనిపిస్తాయి.

వాఙ్మయ పరిశోధన మనకు 15వ శతాబ్దిలోనే, అంటే మడికి సింగనతోనే మొదలైందంటారు పెద్దలు. అంతకుముందున్న కావ్యాలను చదివి, వాటిని క్రోడీకరించి, ఒక్కచోట అందుబాటులో ఉంచారు కదా! ''ఆంధ్ర సాహిత్య పరిశోధనా రంగమున సింగన ప్రథముడు; అతని కృతి తెలుగున ప్రథమ పరిశోధనా గ్రంథము'' అంటారు నిడుదవోలు వేంకటరావు. ''అయితే, ప్రస్తుత కాలము వలె, ఆ కాలమున పరిశోధనకు పట్ట ప్రదానము లేదు. అంతే భేదము.'' మనం సంబరపడటానికి ఇంకొక విషయం కూడా ఉన్నది. అంతకుముందు ఇంత నిధి ఉన్నదని మరోమారు రుజువవుతోంది కదా!

సకల నీతి సమ్మతమును వెలికి తెచ్చిన మానవల్లి రామకృష్ణ కవి(1866–1957) మద్రాసులో జన్మించిన బహుభాషా పండితుడు. పదహారేళ్లకే 'కవి' బిరుదును పొందినవాడు. తెలుగు 'కుమార సంభవం' కావ్యాన్ని వెలికి తీసి, నన్నెచోడుని పేరును లోకానికి చాటిన మహానుభావుడు. అనంతర గొప్ప పరిశోధకులైన వేటూరి ప్రభాకర శాస్త్రి, తిరుమల రామచంద్ర వంటివారికి మార్గదర్శి. తాళపత్ర గ్రంథాల కోసం ఆయన ఊరూరా తిరిగేవారు. వాటిని ఇవ్వడానికి ఆ యజమానులు ఒప్పుకోకపోతే అక్కడే చదివి ఏకసంథాగ్రాహిలా బసకు వచ్చి అక్షరం పొల్లుపోకుండా రాసుకునేవారట. 'నైజాము రాజ్యమున... అమరచింత రాజాస్థానామున' ఆయన 'సకల నీతి సమ్మతము' లిఖిత ప్రతిని చూశారు. మానవల్లి తన అవసాన దశలో కఠిన దారిద్ర్యాన్ని అనుభవించి, వీధుల వెంట భిక్షాటన చేస్తూ బతికాడంటారు. కానీ ఆయనే తెలుగు సాహిత్య లోకానికి కావ్య సిరులను భిక్షగా వేశారని చెప్పాలి. ఆయన తన పేరును 'మా– రామకృష్ణ కవి' అని పూర్వపు తెలుగు పద్ధతిలో రాసుకునేవారు. అలా ఆయన 'మా రామకృష్ణ కవి' అవుతారు, మన రామకృష్ణ కవి అవుతారు. మన మడికి సింగన! మన రామకృష్ణ కవి!!

తోడేళ్ల మందతో తస్మాత్ జాగ్రత్త!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

వాడి పేరు మారీచుడైతేనేమి.. సుబాహుడైతే నేమి? ఆవిడ పేరు తాటకైతేనేమి... శూర్పణఖ అయితేనేమి? అందరూ దైత్యులే! రావణభృత్యులే! అతడు రామోజీ అయితేనేమి... చంద్ర బాబు అయితేనేమి? ఆ గొట్టాలు ఏబీఎన్ అయి తేమీ, టీవీ5 అయితేమీ? ఈ వ్యవస్థలో మొలకెత్తిన విషపు విత్తులే! పెత్తందారీ వ్యవస్థ తొత్తులే! తోడేళ్ల గుంపును అదుపులో పెట్టుకొని వాటి వికృతమైన, భయంకరమైన అరుపులతో సమాజంపై పెత్తనం చేయడానికి అలవాటుపడిన కూటమి ఇది.

లోక కల్యాణార్థం అలనాటి రుషులు తలపెట్టిన యజ్ఞయాగాదులను రాకాసి మూకలు ఏనాడూ సహించలేదు. యజ్ఞవాటికలపై నెత్తురు గుమ్మరించి మాంసం ముద్దలను విసిరి భగ్నం చేసేవారని శాస్త్రాలు చెబుతున్నాయి. ఎందుకంటే మనుషుల సుఖసంతోషాలు రాక్షసగణ ప్రయోజనాలకు వ్యతిరేకం కనుక. ఇప్పుడూ అదే జరుగు తున్నది. అడవి లోని తోడేళ్లు మనిషిని పెంచుకుంటే వాడు మోగ్లీ (జంగిల్‌బుక్) అవుతాడు. కానీ పెత్తందార్లు తోడేళ్లను తయారు చేసుకొని పోషిస్తే అవి రాక్షసత్వం సంతరించుకుంటాయి. మేఘనాథ, కుంభ కర్ణ, అతి కాయ, ప్రహస్త వంటి రావణ సేనాపతులవుతారు.


ఎంతోదూరం వెళ్లడం దేనికి? గడిచిన వారం పది రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నదేమిటి? తోడేళ్ల గుంపు మొరుగుతున్నదేమిటి? వచ్చేనెల మూడు నాలుగు తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ విశాఖలో జరగబోతున్నది. ఇందుకు సన్నాహకంగా ఢిల్లీలో జరిగిన భేటీకి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఏకంగా 48 దేశాల రాయబారులు, ప్రతినిధులూ ఈ సమావేశంలో పాల్గొనడం ఒక విశేషం. కోవిడ్ సంక్షోభాన్ని అధిగమించి, ప్రపంచవ్యాప్తంగా ముసురుకుంటున్న మాంద్యం పరిస్థి తులను ఎదిరించి తమ రాష్ట్రం 11.48 శాతం ఆర్థిక వృద్ధిని ఎలా నమోదు చేసిందో, దేశంలోనే అగ్రస్థానంలో ఎలా నిలబడిందో వివరిస్తూ ముఖ్యమంత్రి చేసిన ప్రసంగం ప్రతినిధులను ఆకట్టుకున్నది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరసగా తమ రాష్ట్రం ఎలా ముందువరసలో కొనసాగుతున్నదో కూడా ఆయన వివరించారు. రాజకీయ నాయకుడి మాటల్లోని నిజాయితీని అంచనా వేయడంలో వ్యాపార వేత్తల కంటే నిపుణులైన వారు ఎవరూ ఉండరు. అందుకే గతంలోనే ముఖ్యమంత్రి చిత్తశుద్ధిని బహిరంగంగా మెచ్చుకున్నవారిలో ప్రఖ్యాత పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా, టెక్ మహీంద్రా సీఈవో సీపీ గుర్నానీ, డిక్సన్ ప్రెసిడెంట్ పంకజ్ శర్మ, సెంచురీ ప్లైవుడ్ చైర్మన్ సజ్జన్ భజాంకా తదితరులున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న కియా, టోరే, క్యాడ్బరీస్, సెయింట్ గోబియాన్, అపాచీ - హిల్‌టాప్, ఎవర్టన్ టీ ఇండియా వగైరా కంపెనీల ప్రతినిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని కొనియాడారు. అసోచామ్ ప్రెసిడెంట్ సుమంత్ సిన్హా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు జగన్‌మోహన్ రెడ్డే పెద్ద ఆస్తిగా అభివర్ణించారు. భారత్ బయోటెక్ కో- ఫౌండర్ సుచిత్ర ఎల్లా కూడా సీఎంని ప్రశంసించారు.

మొన్నటి యూనియన్ బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించిన అనేక కార్యక్రమాలు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతుండటం ఒక విశేషం. చిరు ధాన్యాల ప్రోత్సాహానికి బడ్జెట్‌లో 'శ్రీఅన్న' పథకాన్ని ప్రకటించారు. ఈ తరహా మిల్లెట్ (చిరుధాన్యాలు) పాలసీ ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్నది. 'పీఎం మత్స్య సమృద్ధి యోజన' పథకానికి కూడా అడుగుజాడ ఆంధ్రప్రదేశ్‌దే. రాష్ట్రం ఇప్పటికే 26 ఆక్వా హబ్‌లు, 14 వేల అవుట్‌లెట్ల ఏర్పాటుకు అడుగులేస్తున్నది. ప్రతి పంచాయతీలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు లక్ష్యాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలో ప్రారంభమైంది. 30 స్కిల్ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లను ప్రతిపాదించారు. రాష్ట్రంలో 30 స్కిల్ హబ్స్, 26 స్కిల్ కాలేజీలు, రెండు యూనివర్సిటీల ఏర్పాటుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా 14,500 స్కూళ్లలో మౌలిక వసతులు కల్పించాలన్న బడ్జెట్ ప్రతిపాదనకు ఏపీ ప్రభుత్వం చేపట్టిన 'నాడు–నేడు' కార్య క్రమమే ప్రేరణ అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇది కదా విజినరీ లక్షణం. మరికొన్ని రోజుల్లో ఈ కార్యక్రమాలన్నీ తన ఆలోచనలేనని మన ఎల్లో విజినరీ ప్రకటించుకున్నా ఆశ్చర్య పడవలసిన అవసరం లేదు.

ఈ బడ్జెట్‌లో కేంద్రం ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రకటించింది. ఈ కార్యక్రమానికి కూడా స్ఫూర్తి ఆంధ్రప్రదేశే కావడం మరో విశేషం. ప్రభుత్వ అండదండలతో రాష్ట్రంలో ఏడు లక్షల మంది రైతులు ప్రకృతి సాగును అనుసరిస్తున్నారు. ప్రపంచ ప్రఖ్యాత ప్రేరణా నిపుణుడు నిక్ వుజిసిక్ గురించి చాలామందికి తెలిసి ఉండవచ్చు. కాళ్లూ చేతులూ లేకుండా పుట్టిన తనను లోకమంతా చిన్నచూపు చూసినా చలించకుండా తనను తాను ఒక అద్భుతమైన ఆయుధంగా మలుచుకున్న ధీరుడు. తన జీవిత కథను దీపంగా మలిచి ప్రపంచవ్యాప్తంగా యువతీ యువకుల మనసుల్లోని చీకట్లను పారద్రోలుతున్న వ్యక్తిత్వ నిపుణుడు. దేశాటనలో భాగంగా గుంటూరు జిల్లాలో ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణను చూసి ఆయన చకితుడయ్యారు. పాఠశాల నిర్వహణ మీద ప్రభుత్వాలు ఇంత శ్రద్ధ పెట్టడాన్ని తాను మరెక్కడా చూడలేదని ఆయన చెప్పారు. చెప్పడమేకాదు స్వయంగా సీఎంని కలిసి ఆయనకు అభినందనలు తెలియజేశారు.

రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింపజేసే ఇన్ని పరిణామాలు గడిచిన ఒక్క వారంలోనే చోటుచేసుకున్నప్పటికీ ఇవి మన ఎల్లో మీడియాకుగానీ, దాని వెనకనున్న తోడేళ్లకు గానీ ససేమిరా కనిపించవు. వాళ్లు చూడరు. లోకాన్ని చూడనివ్వరు. లోకం చూడకుండా ఉండటానికి వాళ్ల దగ్గర కొన్ని నైపుణ్యాలున్నాయి. మధుబాబు డిటెక్టివ్ నవలల్లోంచి, చందమామ భేతాళ కథల్లోంచి, పేదరాశి పెద్దమ్మ కథల్లోంచి కొన్ని ఘట్టాలను లేపేసి వాటికి తాజా రంగులద్ది వార్తలుగా ప్రచారంలో పెడతారు. ఈవారం కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి లభించిన మెచ్చుకోళ్లను పూర్వ పక్షం చేయడానికి కుళ్లిన కోడిగుడ్డు వాసన వెదజల్లే హైడ్రోజన్ సల్ఫైడ్ గ్యాస్‌తో వండి వార్చిన కొన్ని కథలను ఎల్లో మీడియా జనంలోకి వదిలింది.

ఎల్లో మీడియాకూ, సీబీఐ దర్యాప్తు సంస్థకూ మధ్యన



'ఈనాటి ఈ బంధమేనాటిదో... ఏనాడు పెనవేసి ముడివేసెనో' అనే అనుమానం ఎవరికైనా వస్తే తప్పుపట్టలేము. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని అప్పటి కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు, తెలుగుదేశం పార్టీ భాగస్వాములుగా చేరి జగన్‌మోహన్‌రెడ్డిపై రాజకీయ కేసులు బనాయించి సీబీఐ దర్యాప్తు వేయించిన దరిమిలా జరిగిన పరిణామాలు ఈ అనుమానాలకు కారణాలు. ఆనాడు దర్యాప్తు అధికారుల మనసులో మాటేమిటో ఎల్లో మీడి యాకు క్షణాల్లో తెలిసిపోయేది. ఎల్లో మీడియా ఏ కవిత్వం రాసినా దర్యాప్తు సంస్థకు అభ్యంతర రాలుండేవి కాదు. అంతటి దృఢమైన బంధం ఇప్పుడైతే ఉన్నదో లేదో తెలియదు కానీ, ఎల్లో మీడియా కవిత్వం మాత్రం ఆగడం లేదు.

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమ యంలోనే వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గుర య్యారు. ఈ విషయం వివేకానందరెడ్డి బావమరిది ఫోన్ చేసి చెబితే అవినాశ్‌రెడ్డికి తెలిసింది. జమ్మల మడుగు ప్రయాణంలో ఉన్న అవినాశ్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇది మీడియా ద్వారా అందరికీ తెలిసిన సమాచారం. అక్కడికి వెళ్లిన తర్వాత ఈ సమాచారం చెప్పడానికి సహజంగానే ఆయన ఫోన్లు చేసి ఉండవచ్చు. చనిపోయిన వివేకానందరెడ్డి స్వయాన జగన్ మోహన్‌రెడ్డి బాబాయ్ కనుక ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించడంలో విశేషమేమున్నది. ఆ ఫోన్‌ను ఇంట్లో అటెండరో, మరొకరో రిసీవ్ చేసుకుంటే వింతేమున్నది? ఇందులో కుట్రకోణం గానీ, కుంభకోణం గానీ ఎక్కడున్నది? అటువంటి లంబకోణం ఏదైనా వుంటే అప్పుడున్న తెలుగు దేశం ప్రభుత్వం ఎందుకని ఉచ్చు బిగించలేదు. మృతదేహం దగ్గర దొరికిన లేఖను దాచిపెట్టమని వివేకా అల్లుడు మృతుని పీఏని ఎందుకు ఆదేశించాడు? వెంటనే పోలీసులకు ఎందుకు ఇవ్వలేదు? ఇలా ఇవ్వకూడదనే సలహా ఆయనకు ఎవరు ఇచ్చారు? ఇక్కడ కదా దర్యాప్తు ప్రారంభం కావలసింది. హత్యలో తమ పార్టీవారి ప్రమేయం ఉన్నందువల్ల వారిని తప్పించడం మీదనే దృష్టిపెట్టి తెలుగుదేశం ప్రభుత్వం దర్యా ప్తును తాత్సారం చేసిందా? ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పెరుగుతున్న ప్రతిష్ఠతో కడుపు మండి కాకమ్మ కథలతో చెలరేగుతున్నారా? విచారణ కోసం, సమాచారం కోసం సీబీఐ నోటీసులు ఇస్తే ఎవరైనా వెళ్తారు. తమకు తెలిసిన సంగతులు చెప్తారు. దీన్ని ఆసరా చేసుకొని వీవీఐపీ కుటుంబం మీద బురద జల్లడానికి బరితెగిస్తారా?

వైసీపీ నాయకుడు కొడాలి నాని చేసిన డిమాండ్‌కు ప్రజాస్వామ్య ప్రేమికులందరూ మద్దతు పలకవలసి వస్తున్నది. కొన్ని సంవత్సరాల క్రితం తన సోదరుడైన చంద్రబాబు మీద విమర్శలు చేసిన తర్వాత నారా రామ్మూర్తి నాయుడు ప్రజల్లో కనిపించడం లేదట! రామ్మూర్తి నాయుడు ఒక దఫా శాసన సభ్యుడిగా కూడా పనిచేశారు. కనుక ఆయన ఉనికిని, బాగోగులను తెలుసుకోవలసిన అవసరం రాష్ట్ర ప్రజలకు ఉన్నది. అట్లాగే ఎన్టీఆర్ మరణంపై తనకు అనుమానాలున్నాయనీ, విచారణ జరిపించాలనీ ఆనాడే హరికృష్ణ కోరినట్టు కొడాలి నాని గుర్తు చేశారు. ఎన్టీఆర్ మరణం వల్ల ప్రధానంగా లబ్ధి జరిగింది చంద్రబాబుకే కనుక ఆయన విచారణకు అంగీకరించలేదని కూడా నాని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఎనిమిదేళ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తి, అగ్రశ్రేణి కళాకారుడైన ఎన్టీ రామారావు మృతిపై ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికైనా విచారణ జరగాల్సిందే. మకుటం లేని మహారాజులాగా వెలుగొందిన వ్యక్తి దయనీయ స్థితికి దిగ జారడానికి కారకులైన వ్యక్తులు ఎవరెవరున్నారో లెక్క తేలవలసిందే. ఆలస్యమైనా సరే న్యాయం జరగవలసిందే.

తప్పుడు ప్రచార దుర్గంధాన్ని వెదజల్లడంలో భాగంగా కొన్ని పాచిపోయిన పాతకాలపు ఎత్తుగడలను కూడా ఆశ్రయిస్తున్నారు. అందులో ఒకటి వైసీపీ నుంచి వలసలు ప్రారంభమయ్యాయనీ, చాలామంది బయటకు రాబోతున్నారనే ప్రచారం. సర్వేలు చెబుతున్నాయి తెలుగుదేశం గెలవబోతున్నదని మరో ప్రచారం. ఎల్లో మీడియాకు పాఠకులు విజ్ఞప్తి చేయ వలసిన విషయం ఒకటున్నది - '2019 ఎన్నికలకు ముందు మీరు అచ్చేసిన సర్వే ఫలితాలను ముందుగా ప్రకటించండి. ఆ తర్వాత కొత్త సర్వేల గురించి రాయాల'ని డిమాండ్ చేయాలి.

పార్లమెంట్ ఎన్నికలకు ఓ రెండేళ్ల ముందే బీజేపీ తన ఎన్నికల కసరత్తును ప్రారంభిస్తుంది. తమ పార్టీ ఇమేజ్ పెరిగినట్టు నిరూపించడానికి కొన్ని సర్వే సంస్థలను (ట్రాక్ రికార్డ్ సరిగా లేని) రంగంలోకి దించుతుంది. ఇప్పుడా కాంట్రాక్టు 'సీ వోటర్' అనే సంస్థకు దక్కింది. బీజేపీ బలం చెక్కు చెదరలేదని చెప్పడం కోసం ఆ సంస్థ ప్రధానితో సహా బీజేపీ ముఖ్యమంత్రులందరి రేటింగ్‌ను పెంచేసింది. ఆమేరకు నాన్-బీజేపీ ముఖ్యమంత్రుల రేటింగ్‌ను కొంచెం తగ్గించేసింది. ఇంకేముంది మన కోతికి కొబ్బరికాయ దొరికింది. జగన్ మోహన్‌రెడ్డి రేటింగ్ తగ్గిందనే ప్రచారాన్ని మొదలుపెట్టాయి. నూటికి నూరుపాళ్లు సక్సెస్ రేటు ఉన్న అత్యంత విశ్వస నీయమైన ఒక సర్వే సంస్థ సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఫలితాలు దాదాపు పునరావృతం కానున్నాయి. ప్రతి పక్షాల పొత్తుల వల్ల పాలక పార్టీకి నష్టం కంటే లాభమే ఎక్కువ జరుగుతుందని ఆ సంస్థ అభిప్రాయపడినట్టు సమాచారం.

బహుశా అందువల్లనే ప్రతిపక్ష తోడేళ్ల మందను ముఖ్యమంత్రి పెద్దగా ఖాతరు చేస్తున్నట్టు లేదు. ఆ ధీమాతోనే మొన్న ఒక సభలో సింహం–తోడేళ్ల ప్రస్తావన కూడా తెచ్చి ఉండొచ్చు. తన పార్టీ ఎమ్మెల్యేలను కూడా నిత్యం ప్రజల్లో ఉండాలనీ, అలా ఎవరైనా లేకపోతే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వడం కుదరదనే సందేశాన్ని ఇస్తున్నాడనీ ఎల్లో మీడియానే చాలాసార్లు రాసింది. టికెట్ లభించడం కష్టమని సెల్ఫ్ ఎసెస్‌మెంట్ ద్వారా నిర్ధారణకు వచ్చిన వాళ్లు కొందరు పక్క చూపులు చూడవచ్చు. అటువంటి వాళ్లను చేరదీసి టిక్కెట్ ఇస్తామనే హామీని తోడేళ్ల మంద ఇవ్వ వచ్చు. ఆ తోడేళ్లను నమ్మడానికి కొన్ని గొర్రెలు సిద్ధపడితే ఎవరేం చేయగలరు? చంద్రబాబు కోటి ఆశలు పెట్టుకున్న లోకేశ్‌బాబు పాదయాత్ర తుస్సుమన్నది. దాన్ని పైకి లేపడం తమ వల్ల కాదని ఎల్లో మీడియా పెద్దలు కూడా తేల్చేశారట. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమా లను మసకపరచడానికి రాక్షస యుద్ధానికి తోడేళ్ల మంద తెగించింది. 'అక్క ఆరాటం తప్ప బావ బతికేది లేద'నే సామెత ఉండనే ఉన్నది. ఎన్ని కోట్ల అరచేతుల్ని అడ్డం పెడితే సూర్యకాంతి ఆగుతుంది? ఎన్ని అబద్ధాలను పోగేసి కప్పినా నిప్పులాంటి నిజం దాగుతుందా?

vardhelli1959@gmail.com

తొలి తెలుగు టాకీకి పుట్టినరోజు చేద్దాం!

తొలి పూర్తి తెలుగు టాకీ సినిమా 'భక్త ప్రహ్లాద' విడుదలై నేటికి సరిగ్గా 91 ఏళ్లు నిండాయి. ఇది తెలుగు సినిమా పరిశ్రమలో ఒక చరిత్రాత్మక సంఘటన. అంతకు ముందు సగం తెలుగు, సగం తమిళంతో 1931 అక్టోబర్ 31న తొలి దక్షిణ భారతీయ భాషా టాకీ 'కాళిదాస్' వచ్చింది. ఆ పైన పూర్తిగా తెలుగు మాటలు, పాటలతో 'భక్త ప్రహ్లాద' 1932 ఫిబ్రవరి 6న విడుదలై సంచలనం సృష్టించింది. అందుకే ఫిబ్రవరి 6న మొదటి పూర్తి తెలుగు టాకీ ఆవిర్భావ సంబరాలు జరుపుకొంటారు. గతంలో ఈ సినిమా సెప్టెంబరు 15న విడుదల అయినట్టు ప్రచారం జరిగింది. కాని సీనియర్ జర్నలిస్టు డా।। రెంటాల జయదేవ ఎన్నో ఏళ్ళు ఊరూరా తిరిగి, శ్రమించి, ఎంతో పరిశోధించి, సాక్ష్యాలు సేకరించి, ఈ సినిమా 1932 జనవరి 21న బొంబాయిలో సెన్సార్ అయ్యి, ఫిబ్రవరి 6న అక్కడే తొలిసారి విడుదలైనట్లు ఆధారాలతో నిరూపించారు.



ఆ విధంగా 1932 ఫిబ్రవరి 6న బొంబాయి శ్రీకృష్ణా సినిమా థియేటర్‌లో విడుదలైన తర్వాత, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్ళి, విజయవంతంగా ఆడింది. 1932 ఏప్రిల్ 2న మద్రాసులోని 'నేషనల్ పిక్చర్ ప్యాలస్'లో విడుదల చేశారు. ఈ చిత్ర దర్శకుడు హెచ్‌ఎమ్ రెడ్డి. సురభి కళాకారులు సహా పలువురిని బొంబాయి తీసుకెళ్ళి అక్కడ స్టూడియోలో 20 రోజుల్లో షూటింగ్ పూర్తిచేశారు. ఆ రోజుల్లో చిత్ర నిర్మాణానికి సుమారు రూ. 20 వేలు ఖర్చయింది. ఈ సినిమా సహజంగానే అనేక రికార్డులు నమోదు చేసుకుంది. ఇందులో లీలావతిగా నటించిన 'సురభి' కమలాబాయి తొలి తెలుగు తెర 'కథానాయిక'. ఈ చిత్ర నిర్మాణానికి ప్రధాన కారకులు పూర్ణా మంగరాజు. ఆంధ్రాలో తొలి సినీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ 'క్వాలిటీ పిక్చర్స్' వ్యవస్థాపకుడు. ఈ చిత్ర గీత రచయిత 'చందాల కేశవదాసు'. ఆ విధంగా తొలి పూర్తి తెలుగు సినిమా తయారై సంచలనం సృష్టించింది. దురదృష్టవశాత్తూ ఈ ఫిల్మ్ ప్రింట్ ఇప్పుడు లభ్యం కావడం లేదు.

నిజానికి, టాకీలు రావడానికి చాలాకాలం ముందే మూకీల కాలం నుంచి మన సినీ పితామహులు రఘుపతి వెంకయ్య నాయుడు వంటివారెందరో మన గడ్డపై సినిమా నిలదొక్కుకొని, అభివృద్ధి చెందడానికి ఎంతో కృషి చేశారు. అప్పట్లోనే తన కుమారుడు ప్రకాశ్‌ని విదేశాలకు పంపి ప్రత్యేక సాంకేతిక శిక్షణ ఇప్పించి, సినిమాలు తీసి తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేశారు వెంకయ్య.

ఇటువంటి వారి గురించి ముందు తరాల వారికి తెలియజేసే కార్యక్రమాలను సినిమా పెద్దలు, ఫిల్మ్ ఛాంబర్ లాంటి సంస్థలు, పాలకులు నిర్వహించాలి. తెలుగు సినిమా ఆవిర్భావ దినాన్ని ఒక ఉత్సవంగా నిర్వహించి... భావి తరాలకు తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన విషయాలు తెలియజేయాల్సిన అవసరం ఉంది. అలాగే పాత చిత్రాలు అన్నీ సేకరించి ఒక సినీ మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఇటువంటిది దేశంలో పుణేలో ఉంది. ప్రపంచ ఉత్తమ చిత్రాలు ప్రదర్శిస్తున్న వైజాగ్ ఫిలిం సొసైటీ 'తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ దినోత్సవం' సందర్భంగా ఫిబ్రవరి 6 నుండి 8 వరకు క్లాసిక్ చిత్రాలు ప్రదర్శిస్తోంది. ఉచిత ఫిల్మ్ వర్క్‌షాప్ నిర్వహిస్తోంది.

– నరవ ప్రకాశరావు; గౌరవ కార్యదర్శి, వైజాగ్ ఫిలిం సొసైటీ

('భక్త ప్రహ్లాద' విడుదలై నేటికి 91 ఏళ్లు)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.1.17 వరకు తదుపరి విదియ, **నక్షత్రం:** ఆశ్లేష ప.2.30 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.3.43 నుండి 5.28 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.35 నుండి 1.22 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.38 వరకు, **అమృతఘడియలు:** ప.2.14 నుండి 3.43 వరకు

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం : 5.53
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

మరోసారి చంద్రయాత్రలు



అభిప్రాయం

కె.బి. గోపాలం

గడచిన సంవత్సరం నవంబర్ 16 ఉదయం యూఎస్‌లోని నాసా వారు ఆర్టెమిస్–1 రాకెట్‌ను ప్రయోగించారు. అది 26 నాళ్ల పాటు తన యాత్ర సాగించింది. మనుషులెవరూ లేని ఓరియాన్ అంతరిక్ష నౌక దాని మీద ఎగిరి, చంద్ర గోళం చుట్టూ రెండు ప్రదక్షిణాలు చేసి వచ్చింది. అందుకు అవసరమైన మూన్ రాకెట్‌ను కట్టడానికి 18 సంవత్సరాలు పట్టింది. 2012 మొదలు గడచిన సంవత్సరం వరకు దాని పేరున సుమారు 23 బిలియన్ డాలర్లు ఖర్చయినాయి. రాకెట్‌ను పంపిన ప్రతిసారీ మరో నాలుగు బిలియన్‌ల పైనే ఖర్చు ఉంటుంది.

'ఇంత ఖర్చు చేసి వదిలే ఈ రాకెట్ ఒక్కసారి మాత్రమే పని చేస్తుంది. ఇటువంటి రకాలను నమ్ముకుని ముందుకు సాగడం అంటే మామూలు విషయం కాదు. చంద్రుని మీదకు, అంగారక గ్రహానికి మనుషులను పంపే కార్యక్రమాలు మాముందున్నాయి మరి. అవి ఆగిపోకపోవచ్చు గానీ, అనుకున్నంత అనాయాసంగా జరగవు' అన్నారు నాసా ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం వారు. పాల్ మార్టిన్ ఐజీ ఈ సంగతిని ఏకంగా కాంగ్రెస్‌లో ప్రకటించారు.

అంతకు ముందు అపోలో అంతరిక్ష నౌకల ప్రయోగం కొరకు శాటర్న్–5 అనే రాకెట్‌లను వాడేవారు. వాటి వాడకం1967లో మొదలయింది. అదీ నవంబర్ నెలలోనే మొదలయింది. ఆ రాకెట్ కన్నా బలం గలది మరొకటి లేదని ఇప్పటి వరకు రికార్డ్ నిలిచి ఉంది. రాకెట్‌కు 34 లక్షల కిలోల తోపుడు శక్తి ఉండేది. అంతరిక్ష నౌకలను పంపాలంటే అంత తోపుడు అవసరం మరి. రాకెట్‌ను ప్రయోగించిన సందర్భంలో చాలా దూరంలో ఉన్న ప్రెస్ బూత్‌లో కిటికీలు దడదడ కొట్టుకున్నాయట. వాంట్ కంట్రోల్ సెంటర్‌లో పై కప్పు నుంచి పెళ్లలు ఊడిపడినాయట. అయిదేళ్ళపాటు తొమ్మిది శాటర్న్- 5లను ప్రయోగించి మనుషులను కూడా చంద్రగ్రహానికి పంపించారు. చరిత్ర సృష్టించారు.

ఇప్పుడిక అంతకన్నా పెద్ద స్పేస్ లాంచింగ్ సిస్టమ్ (ఎస్‌ఎల్‌ఎస్) వచ్చేసింది. ప్రయత్నపూర్వకంగా దాన్ని శాటర్న్–5 కన్నా బలం గలదిగా నిర్మించారు. మునుపటి వాటికన్నా పెద్ద క్రూ (బృందం) ఉండేది. కాప్స్యూల్స్ మరింత పెద్ద పేలోడ్‌లు



చంద్రగోళం మీదకు పంపే యత్నాలు సాగుతున్నాయి. వెళ్లిన అంతరిక్ష యాత్రికులు కొంతకాలం అక్కడే ఉండి పోతారు. అంతకుముందు పరిశీలన పేరున వెళ్లే వ్యోమగాములు రెండు మూడునాళ్ల తరువాత తిరిగి వస్తారు. భూమి నుంచి బయలు దేరితే చందమామ మీదకు చేరడానికి మూడు నాళ్ల ప్రయాణం. అక్కడే కొంతకాలం ఉండి, ప్రయోగాలు, పరిశీలనలు చేసి తిరిగి వచ్చారంటే, భూమిని విడిచి బతకడం కుదురుతుందని తేలిపోతుంది. అదంతా సవ్యంగా జరిగితే, అంగారక గ్రహ యాత్ర గురించి ప్రయత్నాలు జరుగుతాయి. అక్కడికి చేరడానికి ప్రయాణమే 8 మాసాలు. తిరిగి రాను మరో ఎనిమిది నెలలు.

'ఇది ఒక కొత్త తరం ప్రయత్నం' అంటారు ఎస్‌ఎల్‌ఎస్ ప్రోగ్రామ్ మేనేజర్ జాన్ హనీకట్. అందరికీ ఖర్చుల గురించి ఆలోచన కూడా మరొక పక్కన ఉండనే ఉంది. యాత్రలలో నాసా ఒకటే కాక ప్రైవేట్ కంపెనీలు కూడా పాల్గొని, ఖర్చులు తగ్గించే ప్రయత్నంలో ఉన్నాయంటే ఆశ్చర్యం కలగవచ్చు. అక్కడ దిగిన నౌకలను తిరిగి భూమికి క్షేమంగా చేర్చడం గురించి ఇటువంటి సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయి. రాకెట్‌లోని బూస్టర్‌ను తిరిగి వాడటం గురించి కూడా ప్రయత్నాలు, ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. శాటర్న్–5లో వాటిని ఒకసారి వాడి పడేసేవారు. ఎస్‌ఎల్‌ఎస్‌లో కూడా నాసా వాటిని తిరిగి తెచ్చే ఆలోచన చేయలేదు మరి. ముందే ఖర్చు గురించి అందరూ తలలు పట్టుకుని ఉన్నారంటే, ఇటువంటి ఆలోచనలు రాకపోవడం ఫలితమే. ఆ పనులను మరెవరో తలకెత్తుకుంటారు అంటే అద్భుతం. ఖర్చు ఎంతైనా రానున్న పదేళ్ళ వరకు ఎస్‌ఎల్‌ఎస్ వాడకం కొనసాగుతుందని నాసా ప్రకటించింది.

2030 నుంచి నాసాకు కొంత వెసులుబాటు అందుతుంది. అప్పుడిక స్పేస్ స్టేషన్ పని మానుకుంటుంది. అంటే ఏటా 4 బిలియన్ డాలర్ల ఖర్చు ఉండదు. ఆ మొత్తాన్ని కొత్త కార్యక్రమంలో వాడవచ్చు. కనుక అప్పటినుంచి చంద్రయాత్రలు, అంగారక యాత్రలు కనీసం ఆర్థికపరంగా సులభంగా జరుగుతాయి. మానవుడు చంద్రగోళంపై కాలు మోపి అర్ధశతాబ్ది దాటింది. ఇక ముందు మనిషి అంతరిక్షంలో మరింత ఎక్కువ కాలం గడపగలుగుతాడు. మానవ జాతి కేవలం భూమికి పరిమితమై ఉండనవసరం లేదన్న మాటే ఆసక్తికరంగా ఉంది.

వ్యాసకర్త అనువాదకుడు, రచయిత


అనకాపల్లి జిల్లా ఎస్.గజపతినగరంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు


ప్రకాశం జిల్లా కనిగిరి శంఖవరం ముస్లిం కాలనీలో వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్

గడప గడపకు మన ప్రభుత్వం


తూర్పు గోదావరి జిల్లా పందలపాకలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెరిగిన పాస్‌పోర్టు సేవలు

- కిక్కిరిసిపోతున్న విజయవాడ, విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రాలు
- రోజుకు విజయవాడలో 1,860, విశాఖలో 1,160 అపాయింట్‌మెంట్స్
- కోవిడ్ తర్వాత రెండుకేంద్రాల్లో పెరుగుతున్న దరఖాస్తులు
- 2020లో 1.92 లక్షలకుపైగా, 2022లో 4.97 లక్షలకుపైగా దరఖాస్తులు
- ఈ ఏడాది ఇప్పటికే అందిన దరఖాస్తులు 29,674
- పాస్‌పోర్టు మంజూరు గడువు కుదింపు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో పాస్‌పోర్టు సేవలు మెరుగయ్యాయి. గతంలో మాదిరిగా నెలల తరబడి నిరీక్షణకు చెక్ చెబుతూ ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రాలు (ఆర్‌పీవోలు) ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాయి. దరఖాస్తుల క్లియరెన్స్‌పై దృష్టి సారించాయి. కరోనా అనంతరం పరిస్థితులు మెరుగుపడుతుండటంతో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రోజురోజుకు దరఖాస్తులు పెరుగుతున్నాయి. విశాఖపట్నం, విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాలు కిక్కిరిసిపోతున్నాయి. ఉపాధి, ఉన్నతవిద్య, ఇతర అవసరాల కోసం విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. రోజులు, నెలల తరబడి కాళ్లరిగేలా తిరిగినా స్లాట్ దొరికే పరిస్థితి ఉండేది కాదు. కానీ విదేశీ వ్యవహారాలశాఖ తీసుకున్న కీలక నిర్ణయాలతో పాస్‌పోర్టు సేవలు సులువయ్యాయి. దళారుల ప్రమేయం లేకుండానే దరఖాస్తుదారుల చేతికి పాస్‌పోర్టు లభిస్తోంది. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నంలో ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రాలున్నాయి. తత్కాల్, సాధారణ అపాయింట్‌మెంట్లను పెంచి, కాలపరిమితిని తగ్గించడంతోపాటు శనివారం కూడా సేవలు అందిస్తుండటంతో పాస్‌పోర్టుల జారీప్రక్రియ కూడా వేగవంతం అయింది. మరోవైపు పోలీసులు వెరిఫికేషన్ ప్రక్రియ కూడా త్వరితగతిన పూర్తిచేస్తూ పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) ఇస్తున్నారు. ఈ సంస్కరణల కారణంగా పాస్‌పోర్టు కేంద్రాల్లో పనితీరు జోరందుకుంది.

వారం రోజుల్లో చేతికి..

కరోనా తర్వాత భారత్‌లో విదేశీ ప్రయాణాలు చేసేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో పాస్‌పోర్టు దరఖాస్తుల సంఖ్య అదే స్థాయిలో పెరుగుతోంది. పాత నిబంధనల ప్రకారం పాస్‌పోర్టు కోసం


విశాఖపట్నం రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం

నెలల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. అన్ని రకాల పత్రాలు సమర్పించాల్సి వచ్చేది. అవన్నీ ఒకేవిధంగా ఉండాలి. వాటిలో ఒక్క చిన్నతప్పు దొర్లినా.. కథ మళ్లీ మొదటికి వచ్చేది. ఒకవేళ అన్నీ ఉన్నా ఇచ్చిన సమాచారాన్ని నిజనిర్ధారణ చేసుకునేందుకు పోలీస్ విచారణ కోసం నెలల సమయం పట్టేది. ప్రజల సౌలభ్యం కోసం విదేశీ వ్యవహారాలశాఖ జారీచేసిన ఆదేశాల మేరకు దరఖాస్తుతోపాటు నాలుగు పత్రాలుంటే చాలు వారం రోజుల్లో పాస్‌పోర్ట్ చేతిలో ఉంటుంది. ఆధార్‌కార్డు (ఇందులో డేట్ ఆఫ్ బర్త్ ఉండాలి), ఎలక్ట్రానిక్ ఫొటో ఐడెంటిటీకార్డు, పాన్‌కార్డు ఉండాలి. వీటితోపాటు స్థానికత, క్రిమినల్ రికార్డు, ఇంటి చిరునామా వివరాలున్న లాయర్ అఫిడవిట్ ఉంటే చాలు. వీటిలో ఉన్న సమాచారం నిజమని నిర్ధారించుకున్న వెంటనే పాస్‌పోర్టు జారీచేసేస్తున్నారు.



పోస్టాఫీసుల్లో సేవలు

తపాలా కార్యాలయాల్లోను పాస్‌పోర్టు సేవలు అందుబాటులోకి వచ్చాయి. విజయవాడ ఆర్‌పీవో పరిధిలో రెండు పాస్‌పోర్టు సేవాకేంద్రాలతో పాటు 13 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవాకేంద్రాలను (పీవోపీఎస్‌కేలను) అందుబాటులోకి తీసుకొచ్చారు. విశాఖపట్నం ఆర్‌పీవో పరిధిలో రెండు పాస్‌పోర్టు సేవాకేంద్రాలతో పాటు ఏడు పీవోపీఎస్‌కేలున్నాయి. వీటన్నింటి ద్వారా రోజూ 3,020 మంది దరఖాస్తుదారులకు అపాయింట్‌మెంట్ ఇస్తున్నారు. ఈ పీవోపీఎస్‌కేల ద్వారానే పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) స్లాట్లు కూడా జారీ చేస్తుండటంతో పరిశీలన ప్రక్రియ మరింత సులభతరంగా మారింది.

ఏపీలో పాస్‌పోర్టు సేవలు ఇలా..

1. విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పరిధిలో..

పాస్‌పోర్టు సేవాకేంద్రాలు - 2
పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవాకేంద్రాలు - 7
రోజుకు అపాయింట్‌మెంట్స్ - 1,160

ప్రాసెస్ అవుతున్న అప్లికేషన్లు..

సంవత్సరం	దరఖాస్తుల సంఖ్య
2019	1,55,741
2020	72,553
2021	1,12,834
2022	1,91,372
2023 జనవరి 22 వరకు	11,649

2. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పరిధిలో..

పాస్‌పోర్టు సేవాకేంద్రాలు - 2
పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవాకేంద్రాలు - 13
రోజుకు అపాయింట్‌మెంట్స్ - 1,860

ప్రాసెస్ అవుతున్న అప్లికేషన్లు..

సంవత్సరం	దరఖాస్తుల సంఖ్య
2019	2,61,733
2020	1,19,687
2021	1,97,924
2022	3,06,333
2023 జనవరి 22 వరకు	18,025

పెరుగుతున్న దరఖాస్తులు

కోవిడ్ తర్వాత సేవలు మొదలైనప్పుడు ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రాలకు రోజుకు సగటున 250 మంది మాత్రమే దరఖాస్తుదారులు వచ్చేవారు. కరోనా ఆంక్షలు పూర్తిగా తొలగిపోవడం, పరిస్థితులు చక్కబడిన తర్వాత స్లాట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. విజయవాడ కార్యాలయంలో రోజుకు 1,860 వరకు అపాయింట్‌మెంట్స్ ఉండగా, విశాఖ కార్యాలయంలో 1,160 దరఖాస్తుల్ని పరిశీలిస్తున్నారు. శనివారం కూడా పాస్‌పోర్టు సేవలందిస్తుండటంతో తత్కాల్, సాధారణ పాస్‌పోర్టుల కోసం దరఖాస్తులు గణనీయంగా పెరుగుతున్నాయి.


పాస్‌పోర్టు దరఖాస్తుల పరిశీలనకు హాజరైన ప్రజలు

పారదర్శకంగా పాస్‌పోర్టు సేవలు



ఏపీలో రెండు ప్రాంతీయ పాస్‌పోర్టు కేంద్రాల్లో సేవలు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. కోవిడ్ తర్వాత దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. వీలైనంత త్వరగా వాటిని క్లియర్ చేస్తున్నాం. పాస్‌పోర్టు కోసం దళారుల్ని ఆశ్రయించవద్దని సూచిస్తున్నాం. పాస్‌పోర్టు సేవల పనిదినాలు కూడా తగ్గాయి. సాధారణ పాస్‌పోర్టు దరఖాస్తులకు 15, సాధారణ తత్కాల్ దరఖాస్తులకు ఎనిమిది రోజులకు పనిదినాలు కుదించాం. దరఖాస్తుదారులకు సమీప తేదీల్లో అపాయింట్‌మెంట్ ఉండేలా చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రెన్యువల్ కోసం చివరి తేదీ వరకు ఆలస్యం చేయటం సరికాదు. ఆరునెలల ముందుగానే దరఖాస్తు చేసుకుంటే.. పాత పాస్‌పోర్టు గడువు ముగిసేలోగా కొత్త పాస్‌పోర్టు మంజూరవుతుంది.

– విశ్వంజలి గైక్వాడ్, విశాఖ ఆర్‌పీవో

నూతన పరకామణి భవనంలో లెక్కింపు ప్రారంభం


నూతన పరకామణి భవనానికి తీసుకువెళ్తున్న హుండీలు

తిరుమల: శ్రీవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను నూతన పరకామణి భవనంలో ఆదివారం నుంచి లెక్కించడం ప్రారంభించినట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. నూతన పరకామణి భవనంలో ఆయన పూజలు నిర్వహించి మీడియాతో మాట్లాడారు. బెంగళూరుకు చెందిన దాత మురళీకృష్ణ సహకారంతో నూతన పరకామణి భవనాన్ని అత్యాధునిక భద్రతతో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తిరుమల పెద్దజీయర్ స్వామి వారి ఆశీస్సులతో ఆదివారం ఉదయం 5.30 గంటలకు శ్రీవారి ఆలయం నుంచి 12 హుండీలను చిన్న లిఫ్ట్ సహాయంతో లారీలో తరలించినట్లు చెప్పారు. ఇకపై రోజూ అన్ని హుండీలు నూతన పరకామణి భవనానికి చేరుకుంటాయన్నారు. త్వరలో ఆలయంలోని పరకామణి మండపాన్ని భక్తులు కూర్చునేందుకు వీలుగా తీర్చిదిద్దుతామన్నారు.

సర్వ దర్శనానికి 30 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూలైన్ గోకులం గెస్ట్‌హౌస్ వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 72,226 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.74 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో, దర్శనం టికెట్లు లేనివారికి 30 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

భక్తజన సంద్రంగా 'అంతర్వేది'


అంతర్వేది వద్ద సముద్ర తీరంలో భక్తజన సందోహం

సఖినేటిపల్లి: మాఘమాసం.. అందునా పౌర్ణమి.. అటుపై ఆదివారం.. మరోపక్క శ్రీలక్ష్మీ నృసింహస్వామివారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు కావడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది పుణ్యక్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. కల్యాణోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజున మాఘ పౌర్ణమి నాడు అసంఖ్యాకంగా భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలాచరించారు. ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి ఆధ్వర్యంలో పేరూరు ఉద్ధండ పండితులు స్వామి వారిని శిరస్సుపై ధరించి సముద్ర స్నానం చేయించారు. తొలుత ఆలయం నుంచి ఉత్సవమూర్తులను గరుడ పుష్పక వాహనం పైన, సుదర్శన చక్రధారుడైన నృసింహస్వామి (చక్ర పెరుమాళ్ స్వామి)ని పల్లకీలో ఊరేగిస్తూ సాగర తీరానికి తోడ్కొని వచ్చారు. దేవస్థానం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరిలో స్వామి, అమ్మవార్లను ఆశీనుల్ని చేశారు. సుదర్శన చక్రధారుడైన నృసింహస్వామిని పంచామృతాలు, కొబ్బరి నీళ్లతో అభిషేకించారు. సముద్ర స్నానం అనంతరం స్వామివారిని అర్చకులు ఊరేగింపుగా వసంత మండపానికి తీసుకువెళ్లారు. స్వామివారు అక్కడ కొద్దిసేపు సేద తీరారు. ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పాల్గొన్నారు.

సీజేఐని దేశానికి అందించిన ఘనత ఏఎన్‌యూది

- ఏఎన్‌యూ పూర్వ విద్యార్థుల సమావేశంలో వక్తలు



ప్రసంగిస్తున్న జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్

ఏఎన్‌యూ: సుప్రీంకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిని అందించిన ఘనత ఆచార్య నాగార్జున యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగానిదని లా విభాగ అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఏఎన్‌యూలో ఆదివారం ఏఎన్‌యూ న్యాయశాస్త్ర పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఎన్‌యూ పూర్వ విద్యార్థి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. దేశానికి, ప్రజలకు విలువైన సేవలందించే అవకాశం న్యాయ శాస్త్ర విద్యార్థులకు దక్కిందన్నారు. అధ్యాపకుల బోధనలు, సూచనల వల్లే తాను ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఏఎన్‌యూలో లా కోర్సును ఎత్తివేయడం విచారకరమన్నారు. మళ్లీ లా కోర్సును ప్రారంభించేందుకు కృషి చేద్దామని సూచించారు. లా విభాగ పూర్వ పరిశోధకుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రాధాకృష్ణ కృపాసాగర్ మాట్లాడుతూ.. అపార అనుభవమున్న అధ్యాపకులు ఏఎన్‌యూ లా విభాగంలో ఉన్నారని చెప్పారు. ఏఎన్‌యూ మాజీ వీసీ వైఆర్ హరగోపాల్‌రెడ్డి, డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ రిజిస్ట్రార్ ఎ.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. జాతీయ లా విద్యాసంస్థల కంటే ఉన్నతంగా ఏఎన్‌యూలోని న్యాయశాస్త్ర విభాగం.. విద్య, పరిశోధనలను అందించిందని చెప్పారు. డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ వి.సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. లా విభాగం రెండో బ్యాచ్ విద్యార్థి అయిన తాను ఇక్కడ ఎంతో నేర్చుకున్నానని, వీసీ స్థాయికి ఎదగడానికి అధ్యాపకుల బోధనలు ఎంతగానో దోహదం చేశాయన్నారు. కార్యక్రమంలో లా విభాగ విశ్రాంత అధ్యాపకులు ఎస్.రంగయ్య, భాస్కరరావు, జయశ్రీ, రాయప్ప, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, హైకోర్టు పీపీ నాగిరెడ్డి, ఏపీ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ గోచిపాత శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. 20 మందికిపైగా న్యాయమూర్తులు, 400 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


తిరుమలలో ఆదివారం రాత్రి పౌర్ణమి గరుడ సేవ జరిగింది. శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు.

– తిరుమల

ఒంగోలు ఆవుకు పుంగనూరు గిత్త


కోడె దూడతో ఒంగోలు జాతి ఆవు

ఒంగోలు జాతి ఆవు పుంగనూరు జాతి గిత్తకు జన్మనిచ్చింది. బాపట్ల జిల్లా అమృతలూరులో ఈ విశేషం చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు మల్లెపెద్ది రామకృష్ణ ఒంగోలు జాతి ఆవులను పెంచుతుంటారు. ఆయనకు అతి తక్కువ ఎత్తు ఉండే పుంగనూరు ఆవులను సైతం పెంచాలనే కోరిక ఉండేది. మార్కెట్‌లో కొనాలంటే రూ.4 లక్షల వరకు ధర ఉండటంతో తనవద్ద గల ఒంగోలు జాతి ఆవుకు పుంగనూరు జాతి ఆవు వీర్యంతో క్రాస్ చేయించాలని భావించారు. ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మేలుజాతి ఆవులు, గేదెల వీర్యాన్ని ప్రభుత్వం అందుబాటులో ఉంచడంతో తన ఆవుకు పుంగనూరు బ్రీడ్‌తో క్రాస్ చేయించారు. దీంతో ఒంగోలు జాతి ఆవుకు పుంగనూరు గిత్త (కోడె దూడ) జన్మించింది. సాధారణంగా పశువుల్ని సంకరం చేయిస్తే రెండు జాతుల లక్షణాలు వస్తాయి. కానీ.. రామకృష్ణకు చెందిన ఆవుకు 95 శాతం పుంగనూరు జాతి లక్షణాలతోనే కోడె దూడ జన్మించటం విశేషం. పుట్టిన గిత్త కేవలం 17 అంగుళాల ఎత్తు మాత్రమే ఉండగా.. మరో నాలుగైదు అంగుళాలకు మించి పెరగదంటున్నారు.

– అమృతలూరు (తెనాలి)

అధికారం కోసం చంద్రబాబు కుట్రలు


- బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: అమరావతి పేరుతో చేసిన తన అవినీతిని కప్పి పుచ్చుకునేందుకే అధికారం కోసం ప్రతిపక్షాలతో కలిసి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో 3 రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 861వ రోజుకు చేరాయి. పలువురు ప్రసంగిస్తూ.. ధనార్జనే ధ్యేయంగా గత ప్రభుత్వ హయాంలో తప్పుల మీద తప్పులు చేసిన చంద్రబాబు అమరావతి పేరుతో ప్రజాధనాన్ని భారీగా దోపిడీ చేశాడని మండిపడ్డారు. కులోన్మాదంతో ఓ ప్రాంతం, ఓ సామాజిక వర్గం అభివృద్ధి కోసం బాబు చేసిన తప్పిదాలు నేడు రాష్ట్రానికి శాపంగా మారాయన్నారు. సమితి నాయకులు నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

యువగళం మనకోసం
వాట్సాప్ గ్రూపులో ఘరానా మోసం

- లోను ఇస్తానంటూ అడ్మిన్ మనోహర్ చౌదరి మెసేజ్
- లోన్ కావాలన్న ఓ వ్యక్తికి పంగనామాలు
- రూ.1.43 లక్షలను కాజేసిన తమ్ముడు
- దర్యాప్తు చేస్తున్న తిరుపతి జిల్లా పోలీసులు

చంద్రగిరి (తిరుపతి జిల్లా): యువగళం పేరుతో ఓ వైపు నారా లోకేశ్ పాదయాత్ర చేస్తుంటే.. ఆయన అనుచరులు అదే పేరుతో వాట్సాప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి మోసాలకు తెగబడుతున్నారు. అలాంటి గ్రూప్‌లో మోసపోయిన ఓ వ్యక్తి పోలీసులను ఆశ్రయించిన ఘటన తిరుపతి జిల్లాలో జరిగింది. చంద్రగిరి మండల పరిధిలోని పనపాకం పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి యువగళం మనకోసం వాట్సాప్ గ్రూపులో సభ్యుడిగా ఉన్నాడు. గ్రూప్ సభ్యులకు రూ. 2 లక్షల వరకూ లోన్ ఇస్తానంటూ గత నెల 29న కాకినాడకు చెందిన అడ్మిన్ మనోహర్ చౌదరి గ్రూపులో మెసేజ్ పెట్టాడు. దీంతో బాధితుడు తనకు లోను కావాలంటూ మెసేజ్ చేశాడు. 30వ తేదీన మనోహర్ చౌదరి బాధితుడికి ఫోన్ చేసి లోన్ ప్రాసెసింగ్ ఫీజు రూ. 3,800 చెల్లించాలని కోరడంతో బాధితుడు గూగుల్ పే ద్వారా చెల్లించాడు. తనకు రూ. 15 వేలు పంపిస్తే లోను మంజూరు చేస్తానని మనోహర్ చౌదరి మరోసారి చెప్పగా బాధితుడు మళ్లీ గూగుల్ పే ద్వారా చెల్లించాడు. ఇలా మాయమాటలు చెప్పి బాధితుడి వద్ద నుంచి మనోహర్ చౌదరి మొత్తం రూ. 1.43 లక్షలు కాజేశాడు. ఇంత చెల్లించినా ఇంకో రూ. 15 వేలు పంపమని చెప్పడంతో బాధితుడు ఎదురుతిరగగా.. మనోహర్ చౌదరి బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితుడు చంద్రగిరి పోలీసులను ఆశ్రయించాడు. తక్షణమే స్పందించిన పోలీసులు మనోహర్ చౌదరికి చెందిన 2 బ్యాంక్ ఖాతాలను సీజ్ చేశారు. మోసగాడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టీడీపీ అంటే తనకు అభిమానమని, తనకు వచ్చిన లింక్ ద్వారా యువగళం మనకోసం గ్రూపులో సభ్యుడిగా చేరానని బాధితుడు తెలిపాడు. గ్రూప్ అడ్మిన్ మనోహర్ చౌదరి తనను మోసం చేయడమే కాకుండా.. తననే జైల్లో పెట్టిస్తానని బెదిరించాడని వాపోయాడు.



ఫోన్ పే ద్వారా రూ.30 వేలను తీసుకున్న టీడీపీ నేత మనోహర్ చౌదరి

హనీ గ్రూప్‌నకు బెస్ట్ ఎంప్లాయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డ్

- గవర్నర్ చేతులమీదుగా అందుకున్న సంస్థ చైర్మన్ ముక్క ఓబుల్‌రెడ్డి



విజయవాడ: గ్లోబల్ ఇండియా బిజినెస్ ఫోరమ్ గవర్నర్ అవార్డ్స్ ఫర్ బిజినెస్ ఎక్సలెన్స్ 2023 కి సంబంధించి బెస్ట్ ఎంప్లాయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డును ప్రముఖ రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగ సంస్థ హనీ గ్రూప్ దక్కించుకుంది. విజయవాడలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా సంస్థ చైర్మన్ ముక్క ఓబుల్ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. 2016లో స్థాపించిన ఈ సంస్థలో ప్రస్తుతం 500 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఉద్యోగులకు మెరుగైన పనివాతావరణం కల్పించడంతోపాటు వారి ఎదుగుదలకు దోహదపడినందుకుగానూ హనీ గ్రూప్‌నకు ఈ అవార్డు లభించింది. హనీగ్రూపు విజయానికి ఉద్యోగులు, కస్టమర్లు, శ్రేయోభిలాషులు కారణమని సంస్థచైర్మన్ ఓబుల్ రెడ్డి అన్నారు. అవార్డు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని, ఈ అద్భుతమైన ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఉద్యోగులు గర్వపడేలా చేస్తామని ఆయన చెప్పారు.

కాలేజీ యాజమాన్యం వేధించి చంపేసింది..

- బీటెక్ విద్యార్థి మృతిపై కుటుంబసభ్యుల ఆందోళన
- నారాయణ ఇంజినీరింగ్ కళాశాల వద్ద బైఠాయింపు
- ఫీజులపై వేధింపులే మృతికి కారణమంటూ ఆవేదన
- హాస్టల్ ఫర్నిచర్ ధ్వంసం

గూడూరు: 'మా బిడ్డ సౌమ్యుడు. ఆత్మహత్యకు పాల్పడేంత పిరికివాడు కాదు. ఫీజుల విషయంలోనే యాజమాన్యం వేధించి చంపేసింది..' అంటూ తిరుపతి జిల్లా గూడూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం అనుమానాస్పదంగా మృతిచెందిన విద్యార్థి ధరణేశ్వర్‌రెడ్డి (21) బంధువులు, తల్లిదండ్రులు ఆరోపించారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలం నారేపల్లి గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి వెంకటకృష్ణారెడ్డి, గంగమ్మ కుమారుడు ధరణేశ్వర్‌రెడ్డి శనివారం అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. మృతుడి తల్లిదండ్రులు, బంధువులు ఆదివారం కళాశాల వద్దకు చేరుకున్నారు. తమ బిడ్డను కళాశాల యాజమాన్యమే చంపేసిందంటూ కళాశాల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మృతుడి తల్లిదండ్రులు, బంధువుల రోదన అందరినీ కలచివేసింది. కళాశాల యాజమాన్యమే తమ బిడ్డను పొట్టనబెట్టుకుందంటూ విలపించారు. తాము గూడూరు వచ్చేవరకు కూడా ఆగకుండానే మృతదేహాన్ని హాస్టల్ గది నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లారంటూ కన్నీరుమున్నీరయ్యారు. తమ బిడ్డను చంపేసి, కుటుంబకలహాల కారణంగానే అంటూ కట్టుకథ అల్లి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల విషయంలో యాజమాన్యం వేధించిందని, తమవద్ద సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారాలున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా మృతుడి బంధువులు సమీపంలోనే ఉన్న హాస్టల్లోకి చొరబడి అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. 1వ పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది వారిని అడ్డుకున్నారు. విచారించి న్యాయం చేస్తామని సర్దిచెప్పారు. నారాయణ విద్యాసంస్థల్లో బలైన ఎందరో విద్యార్థుల్లో తమ బిడ్డ కూడా ఒకడయ్యాడని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు పేర్కొన్నారు. తమకు పోలీసులపై నమ్మకం ఉందన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.


ధ్వంసం చేస్తున్నవారిని అడ్డుకుంటున్న పోలీసులు

నారాయణ కళాశాల యాజమాన్యంపై కేసు

గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థి ఓబులరెడ్డి ధరణేశ్వర్‌రెడ్డిది అనుమానాస్పద మృతి అని ఆదివారం విద్యార్థి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి విలేకరులకు చెప్పారు. కళాశాల హాస్టల్లో ఉరేసుకుని చనిపోయిన విద్యార్థి. ధరణేశ్వర్‌రెడ్డి చాలా సౌమ్యుడని, చదువులో ఉత్తమ ప్రతిభ కనపరుస్తున్నాడని, విద్యార్థి మృతికి కళాశాల యాజమాన్యమే బాధ్యత వహించాలని తల్లిదండ్రులు గూడూరు 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విద్యార్థి మృతికి కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4 శాతం డీఏ పెంపు?

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కరవు భత్యం(డీఏ) 4 శాతం మేర పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే డీఏ పర్సంటేజీ ప్రస్తుతమున్న 38% నుంచి 42%కి చేరుకుంటుంది. కార్మిక శాఖ నెలవారీగా విడుదల చేసే పారిశ్రామిక సిబ్బంది వినియోగ ధరల సూచీ(సీపీఐ–ఐడబ్ల్యూ) ప్రాతిపదికగా తీసుకుని కేంద్రం ఉద్యోగులు, పింఛనుదారుల డీఏను ఖరారు చేస్తుంటుంది. ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ శివ గోపాల్ మిశ్రా తాజా వార్తలపై స్పందిస్తూ..'డిసెంబర్ 2022 సీపీఐ–ఐడబ్ల్యూ జనవరి 31, 2023న విడుదలైంది. దీని ప్రకారంగా డీఏ పెంపు 4% ఉంటుంది. అప్పుడు 42%కి చేరుకుంటుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రతిపాదనలను తయారు చేసి కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం పంపుతుంది'అని ఆయన అన్నారు. ఒకవేళ ఈ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపితే డీఏ ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి అమలవుతుంది. ప్రస్తుతం ఒక కోటి మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు 38% డీఏను పొందుతున్నారు. సెప్టెంబర్ 28, 2022ను రివిజన్ డీఏ 2022 జూలై నుంచి అమల్లోకి వచ్చింది.

నేడు ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ప్రమాణం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తులుగా నియమితులైన ఐదుగురు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజస్తాన్, పాట్నా, మణిపూర్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు జస్టిస్ మనోజ్ మిశ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన సంగతి తెలిసిందే.

నేడు కర్ణాటకకు మోదీ

బెంగళూరు: ప్రధాని మోదీ సోమవారం కర్ణాటకలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. బెంగళూరులో ఇండియా ఎనర్జీ వీక్ 2023ను ప్రారంభిస్తారు. పెట్రోల్‌లో 20% ఇథనాల్‌ను కలిపిన 'ఈ20 ఫ్యూయెల్' 84 రిటైల్ అవుట్‌లెట్లను ప్రారంభిస్తారు. గ్రీన్ మొబిలిటీ ర్యాలీని ప్రారంభిస్తారు. వీటిని వివిధ చమురు సంస్థలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏర్పాటు చేశాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు తుమకూరులోని హెచ్ఏఎల్ ఫ్యాక్టరీని జాతికి అంకితం చేస్తారు. ఇది ఆసియాలోనే అతిపెద్ద హెలికాప్టర్ ఉత్పత్తి కర్మాగారం. మరికొన్ని అభివృద్ధి పనులకూ ప్రధాని శంకుస్థాపన చేస్తారు.

అంతరిక్షంలో బంగారం!

వాషింగ్టన్: మన పాలపుంతలో గ్రహాలతోపాటు కోట్ల సంఖ్యలో నక్షత్రాలు ఉన్నాయి. సమీపంలోని రెండు నక్షత్రాలు పరస్పరం ఢీకొని శక్తివంతమైన కొత్త నక్షత్రంగా ఏర్పడుతుంటాయి. ఇలాంటి పరిణామాన్ని కిలోనోవా అంటారు. మనం ఉంటున్న నక్షత్ర మండలంలో మరో అరుదైన కిలోనోవాకు అంకురార్పణ జరిగినట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు. భూగోళం నుంచి 11,000 కాంతి సంవత్సరాల దూరంలో రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఒకదానికొకటి ఢీకొట్టబోతున్నట్లు తేల్చారు. తొలుత నాసాకు చెందిన నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ శాస్త్రవేత్తలు గమనించారు. అనంతరం చిలీలో అమెరికన్ అబ్జర్వేటరీలో ఉన్న స్మార్ట్ 1.5 మీటర్ టెలిస్కోప్ సాయంతో కిలోనోవా పరిణామాన్ని నిర్ధారించారు. అధ్యయనం ఫలితాలను నేచర్ జర్నల్‌లో ప్రచురించారు. త్వరలో సంభవించబోయే కిలోనోవా కోసం శాస్త్రవేత్తలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రెండు నక్షత్రాలు కలిసిపోయినప్పుడు భారీ పేలుడు సంభవిస్తుందని, ఇందులో బంగారం లాంటి లోహాలు ఉత్పత్తి అవుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా నక్షత్రాలు, గ్రహాల పుట్టుకతోపాటు అంతరిక్ష రహస్యాలను ఛేదించేందుకు ఈ కిలోనోవా దోహదపడుతుందని భావిస్తున్నారు. విశ్వంలో ఇప్పటిదాకా 10 కిలోనోవాలో సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. ఒక భారీ నక్షత్రం జీవితకాలం కనీసం 10 లక్షల సంవత్సరాలు ఉంటుందని, ఆ తర్వాత అందులో పేలుడు జరిగి, న్యూట్రాన్ స్టార్ ఉద్భవిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వివరించారు.




గాల్లో గూఢచారులు

కాక రేపుతున్న నిఘా బెలూన్లు • శతాబ్దాలుగా కొనసాగుతున్న వాడకం

ఓ బెలూన్ కొద్ది రోజులుగా అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. అమెరికా గగనతలంపై 60 వేల అడుగుల ఎత్తున ఎగురుతూ కన్పించిన ఈ చైనా బెలూన్ కచ్చితంగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను భారీగా పెంచేసింది. అది కచ్చితంగా నిఘా బాపతేనని అమెరికా, వాతావరణ పరిశోధనలు చేస్తూ దారి తప్పిందని చైనా వాదిస్తున్నాయి. సైనిక రంగంలో నిఘా బెలూన్ల వాడకం ఈ ఉదంతంతో మరోసారి తెరపైకి వచ్చింది...

– సాక్షి, నేషనల్ డెస్క్



ఈ కాలంలోనూ అవసరముందా?

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతూ ఉపగ్రహాలు, డ్రోన్లు అందుబాటులోకి వచ్చాక ఈ నిఘా బెలూన్లతో పనేమిటన్న సందేహాలు సహజం. కానీ ఇప్పటికీ మిలటరీలో ఈ బెలూన్లకు ఎంతో ప్రాధాన్యముంది. ఉపగ్రహాలతో పోలిస్తే వీటిని చాలా చౌకలో తయారు చేయొచ్చు. నిర్దిష్ట గగనతలాలకు పంపడమూ ఎంతో సులభం. గాలివాటానికి అనుగుణంగా బెలూన్ల దిశను మార్చవచ్చు. అత్యంత ఎత్తులో ప్రయాణించే ఈ బెలూన్లు సేకరించే సమాచారం, ఫొటోలు చాలా నాణ్యతతో ఉంటాయి. లక్షిత గగనతలాల్లో రోజుల తరబడి ప్రయాణించే సత్తా వీటికుంది.

చైనా ప్రయోగం వెనక...

అమెరికా, చైనా మధ్య తరచూ ఉద్రిక్తతలు నెలకొంటూనే ఉన్నాయి. తైవాన్ నుంచి దక్షిణ చైనా సముద్రం వరకు, చైనాలో మానవహక్కుల నుంచి హాంగ్‌కాంగ్‌లో ప్రజాస్వామ్యం నిర్వీర్యం చేసే చర్యల దాకా తరచూ ఘర్షణాత్మక వాతావరణం నెలకొంటూనే ఉంది. కొంతకాలం క్రితం అప్పటి అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ తైవాన్ సందర్శన నాటి నుంచీ విభేదాలు మరింత ముదిరాయి. చైనా 34 యుద్ధ విమానాలను,, 9 యుద్ధ నౌకలను దక్షిణ చైనా సముద్రంలో మోహరించింది. ప్రతిగా తైవాన్ కూడా యుద్ధ విమానాల్ని సన్నద్ధం చేయడం, తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తామని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రకటించడం ఉద్రిక్తతల్ని పెంచింది. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ చైనా పర్యటనకు కొద్ది రోజుల ముందే చైనా నిఘా బెలూన్ ఇలా అమెరికా గగనతలంలోకి ప్రవేశించి కలకలం రేపింది. తద్వారా అగ్రరాజ్యానికి చైనా ఓ రకంగా హెచ్చరికలు పంపిందని భావిస్తున్నారు.

ఎప్పట్నుంచి వాడుకలో ఉన్నాయి?

• ఈ బెలూన్లను ఫ్రెంచి విప్లవం కాలం నుంచే వాడుతున్నారు. యుద్ధ భూమిలో ఆస్ట్రియా, డచ్ సైనిక దళాల కదలికలు తెలుసుకునేందుకు 1794లో ఫ్రాన్స్ వీటిని తొలిసారి వాడింది.

• గాల్లో చాలా ఎత్తున ఎగిరే ఈ బెలూన్ల ద్వారా సమాచార సేకరణ తేలిక కావడంతో అమెరికా అంతర్యుద్ధం, మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో వీటి వాడకం పెరిగింది.

• రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఒక అడుగు ముందుకేసి ప్రత్యర్థులపై ఈ బెలూన్లతో బాంబు దాడులకు దిగిన సందర్భాలూ ఉన్నాయి! జపాన్ సైన్యం ప్రయోగించిన బెలూన్ బాంబు అమెరికాలో ఒరెగాన్ వుడ్‌ల్యాండ్‌లో పడి ముగ్గురు పౌరులు మరణించారు.

• రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రాజెక్ట్ జెనెట్రిక్స్ పేరుతో అమెరికా ఈ బెలూన్లపై విస్తృతంగా ప్రయోగాలు చేసింది. 1950లో వీటి సాయంతో సోవియట్ భూభాగాన్ని ఫొటోలు తీసింది.

• అమెరికా ఆర్మీ ప్రాజెక్టు మొగల్ పేరుతో బెలూన్లకు మైక్రోఫోన్లను అమర్చి సోవియట్ యూనియన్ అణు పరీక్షలకు సంబంధించిన శబ్దాలను రికార్డు చేసింది.

ఏమిటీ నిఘా బెలూన్లు?

నిఘా బెలూన్లను అత్యంత తేలికైన హీలియం వాయువుతో నింపుతారు. కెమెరాలు, రాడార్లు, సెన్సార్లు, కమ్యూనికేషన్ పరికరాలు అమరుస్తారు. అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలు సుదూర ప్రాంతాల్లోని సమాచారాన్ని కూడా అత్యంత స్పష్టతతో సేకరించగలవు. ప్రయాణికుల విమానాలు 40 వేల అడుగుల ఎత్తు దాటవు. ఈ స్పై బెలూన్లు భూమికి 60 వేల నుంచి, లక్షా 50 వేల అడుగుల ఎత్తులో రోజుల తరబడి ప్రయాణించే సామర్థ్యం కలిగినవి.

చైనా బెలూన్ పేల్చివేత

అట్లాంటిక్ సముద్రంలో కూల్చేసిన అమెరికా • గట్టిగా బదులిస్తామన్న చైనా

వాషింగ్టన్/బీజింగ్: అమెరికా గగనతలం మీదుగా ఎగురుతూ కొద్ది రోజులుగా కలకలం రేపుతున్న అనుమానాస్పద చైనా నిఘా బెలూన్‌ను అగ్రరాజ్యం కూల్చివేసింది. అట్లాంటిక్ సముద్రంపైకి వచ్చేదాకా వేచి చూసి అత్యాధునిక ఎఫ్–22 యుద్ధ విమానంతో దాన్ని పేల్చేసింది. అమెరికా అణుక్షిపణుల్ని భద్రపరిచిన మోంటానా స్థావరంపై ఈ చైనా బెలూన్ ఎగురుతూ కన్పించడం, అది ఇరు దేశాల మధ్య చిచ్చు రేపడం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశాల మేరకు దక్షిణ కరోలినాకు ఆరు మైళ్ల దూరంలో అట్లాంటిక్ సముద్ర జలాల్లో దాన్ని కూల్చివేశామని రక్షణ శాఖ ప్రకటించింది. దీని వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. దక్షిణ కరోలినా మిర్టిల్ బీచ్ సమీపంలో సముద్ర జలాల్లో 11కి.మీ. మేరకు పడిపోయిన బెలూన్, దాని విడి భాగాల కోసం రెండు నేవీ నౌకలు, ఇతర భారీ నౌకల సాయంతో అన్వేషిస్తున్నారు. బెలూన్ని కూల్చివేసే మిషన్‌ను బైడెన్ స్వయంగా పర్యవేక్షించారు. "దాన్ని పేల్చివేసినప్పుడు ఎలాంటి నష్టం జరగకూడదని ఒత్తిడి ఎదుర్కొన్నాను. సైనిక సిబ్బంది విజయవంతంగా పని పూర్తి చేశారు. వారికి అభినందనలు" అన్నారు.

నిబంధనల ఉల్లంఘన: చైనా

అమెరికా తమ బెలూన్‌ను కూల్చివేయడంపై చైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అమెరికా చేసిన పనికి తగిన సమయంలో దీటుగా బదులిస్తామని చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదలలో పేర్కొంది. అది పౌర వినియోగం కోసం ప్రయోగించిన బెలూన్ మాత్రమేనని పునరుద్ఘాటించింది. వాతావరణ పరిస్థితులను అంచనా వేయడానికి ప్రయోగించిన బెలూన్‌ను అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా కూల్చేసినందుకు తమ నుంచి త్వరలోనే గట్టి ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించింది.

ఇలా కూల్చేశారు...



- దాదాపు మూడు స్కూలు బస్సుల పరిమాణంలో ఉన్న ఈ బెలూన్ తొలిసారిగా జనవరి 28న అమెరికా గగనతలంలోకి ప్రవేశించింది.
- దాదాపు 60 వేల అడుగుల ఎత్తులో ఎగురుతూ అమెరికా నిఘా కంటికి చిక్కింది. వెంటనే కెనడా వైపుగా వెళ్లి 30వ తేదీన తిరిగి అమెరికాలోకి ప్రవేశించింది.
- అణ్వాయుధ క్షిపణి ప్రయోగశాల తదితరాలున్న మొంటానాపై కూడా తిరుగుతుండటంతో కలకలం రేగింది.
- బెలూన్ కూల్చివేతకు మల్టిపుల్ ఫైటర్, రీఫ్యూయలింగ్ యుద్ధ విమానాలను రంగంలోకి దించారు. వర్జీనియాలోని లాంగ్లీ ఎయిర్ ఫోర్స్ బేస్ నుంచి దూసుకెళ్లిన ఎఫ్22 ఫైటర్ జెట్ పని పూర్తి చేసింది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక ఏఐఎం–9ఎక్స్ సూపర్‌సానిక్ ఎయిర్ టు ఎయిర్ క్షిపణిని ప్రయోగించింది. వేడిని అనుసరిస్తూ దూసుకెళ్లే ఆ క్షిపణి పూర్తి కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించింది.
- ముందుజాగ్రత్తగా సమీప విల్మింగ్టన్, మిర్టిల్ బీచ్, చార్లెస్టన్ ప్రాంతీయ విమానాశ్రయాల నుంచి విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపేశారు.
- బెలూన్‌కు అమర్చిన నిఘా పరికరాలను అమెరికా సేకరించి పరిశీలించనుంది. సముద్రంలో 47 అడుగుల లోతుకు పడిపోయిన సెన్సర్లు తదితర విడి భాగాల కోసం నేవీ డిస్ట్రాయర్ యూఎస్ఎస్ ఆస్కార్ ఆస్టిన్, డాక్ లాండింగ్ షిప్ యూఎస్ఎస్ కార్టర్ హాల్ వంటివాటితో పాటు నేవీ డైవర్లు గాలిస్తున్నారు.



ఆదివారం రాష్ట్రపతిభవన్ ప్రాంగణంలోని అమృత్ ఉద్యాన్ గార్డెన్‌ను సందర్శించిన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలిసి ఫొటో దిగిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, ఇతర న్యాయమూర్తులు, వారి సతీమణులు

మన ఓటర్లు 94.5 కోట్లు



న్యూఢిల్లీ: మన దేశంలో ఓటర్ల సంఖ్య ఏడాదికేడాది పెరిగిపోతోంది. 1951 నుంచి ఇప్పటి వరకు చూస్తే ఓటర్ల సంఖ్య ఆరు రెట్లు పెరిగింది. ఈ ఏడాది జనవరి 1 నాటికి మన దేశంలో రిజిస్టర్ ఓటర్లు 94.50 కోట్లు అని కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అయితే ఈ ఓటర్లలో దాదాపుగా మూడో వంతు మంది ఓటుకి దూరంగా ఉండడం ప్రజాస్వామ్యంలోనే విషాదకరం. ఈ ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు ఉండడంతో ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ఇప్పట్నుంచే కేంద్ర ఎన్నికల సంఘం వ్యూహాలు పన్నుతోంది. మొట్టమొదటిసారి 1951లో ఓటర్ల జాబితాను రూపొందించినప్పుడు 17.32 కోట్ల మంది తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో 45.67% ఓటింగ్ నమోదైంది. 1957 సార్వత్రిక ఎన్నికల సమయానికి ఓటర్ల సంఖ్య 19.37 కోట్లు ఉంటే 47.44% మంది ఓటు వేశారు. 2009 నాటికి ఓటర్ల సంఖ్య భారీగా 71.7 కోట్లకు పెరిగినప్పటికీ ఓటింగ్ శాతం 58.21 మాత్రమే. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 91.20 రిజిస్టర్డ్ ఓటర్లు ఉంటే 67.40శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

విదేశాల నుంచి అమెరికా వీసా!

న్యూఢిల్లీ: అమెరికా వీసా కోసం ఇకపై సుదీర్ఘంగా నిరీక్షించాల్సిన అవసరం లేకుండా భారతీయులకు అమెరికా రాయబార కార్యాలయం అరుదైన అవకాశం కల్పించింది. అత్యవసరంగా అమెరికా వెళ్లాల్సిన అవసరమున్నవారు ఇతర దేశాల్లోని ఎంబసీల నుంచి కూడా వీసా కోసం దరఖాస్తు చేసుకునే సౌలభ్యాన్ని కల్పించింది. బీ1, బీ2 బిజినెస్, పర్యాటక వీసాలకు ప్రస్తుతం హైదరాబాద్, కోల్‌కతా, ముంబైల్లో ఏడాదికి పైగా వెయిటింగ్ ఉంది! బ్యాంకాక్‌లో కేవలం 14 రోజుల్లోనే అపాయింట్‌మెంట్ దొరుకుతోంది. అందుకే అత్యవసరంగా వెళ్లాలనుకునేవారు విదేశీ ఎంబసీల్లో దరఖాస్తు చేసుకోవాలని ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం అధికారులు సూచించారు. సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాంల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంది.

232 విదేశీ యాప్‌లపై నిషేధం

న్యూఢిల్లీ: చైనాతోపాటు వివిధ దేశాలకు చెందిన సంస్థలు నిర్వహిస్తున్న 232 బెట్టింగ్, గ్యాంబ్లింగ్, అనధికారిక రుణ యాప్‌లపై కేంద్రం ఆదివారం నిషేధం విధించింది. ఇవి దేశ ఆర్థిక స్థిరతకు ముప్పుగా మారాయని ఓ అధికారి చెప్పారు. బ్లాక్ చేసిన యాప్‌ల పేర్లను కేంద్రం వెల్లడించలేదు.

'అదానీ'పై మోదీ మాట్లాడాల్సిందే: కాంగ్రెస్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ఆర్థిక అవకతవకల ఆరోపణలకు సంబంధించి కేంద్రంలోని మోదీ సర్కారుపై విమర్శల దాడిని కాంగ్రెస్ తీవ్రతరం చేసింది. ఈ విషయమై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం మాటున దాక్కోలేరని పేర్కొంది. అదానీతో ఆయన అంటకాగారన్న ఆరోపణలకు ఈ మౌనం మరింత బలం చేకూరుతోందని అభిప్రాయపడింది. 'అదానీతో ఉన్న సంబంధం ఏమిటి? (హమ్ అదానీ కే హై కౌన్)' అన్నదానికి బదులివ్వకుండా తప్పించుకోవడం కుదరదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. అదానీ ఉదంతానికి సంబంధించి మోదీకి రోజుకు మూడు ప్రశ్నల చొప్పున సంధిస్తామని ఆదివారం వెల్లడించారు.

బెదురుతున్న బీజేపీ: టీఎంసీ

అదానీ ఉదంతంపై పార్లమెంటులో చర్చకు అధికార బీజేపీ బెదిరిపోతోందని తృణమూల్ కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. దీనిపై ఉభయ సభల్లోనూ కేంద్రాన్ని గట్టి నిలదీస్తామని పార్టీ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ చెప్పారు. అదానీ దెబ్బకు స్టాక్ మార్కెట్ల పతనం తాలూకు ప్రతికూల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై, సామాన్యుల పౌరులపై చాలాకాలం పాటు ఉంటుందని బీఎస్పీ అధినేత్రి మాయావతి అభిప్రాయపడ్డారు.

భారత్‌-యూకే ఎన్ఎస్ఏల చర్చల్లో రిషి

లండన్: భారత, బ్రిటన్ జాతీయ భద్రతా సలహాదార్లు (ఎన్ఎస్ఏ) అజిత్ ధోవల్, టిమ్ బర్రోల మధ్య లండన్లో జరుగుతున్న చర్చల్లో ప్రధాని రిషి సునాక్ ప్రత్యేకంగా పాల్గొన్నారు! ఇరు దేశాల మధ్య సంబంధాలను దృఢతరం చేసుకునేందుకు బ్రిటన్ ఎంతో ఆసక్తిగా ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పినట్టు భారత విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు ఆ దేశ జాతీయ భద్రతా సలహాదారు జాక్ సలివాన్‌తో చర్చల అనంతరం ధోవల్ శుక్రవారం యూకేకు చేరుకున్నారు.

బ్రిటన్లోకి అక్రమ వలసలకు చెక్!

బ్రిటన్లోకి అక్రమ వలసలను పూర్తిస్థాయిలో నిరోధించాలని సునాక్ నిర్ణయించుకున్నారు. దీనికి అడ్డంకిగా మారేలా కన్పిస్తున్న యూరప్ మానవ హక్కుల ఒప్పందం (ఈసీహెచ్ఆర్) నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ ఏడాది 65 వేల మందికి పైగా అక్రమ వలసదారులు ఇంగ్లండ్‌లో ప్రవేశించవచ్చని వార్తలు వస్తున్నాయి.

అస్సాంలో బాల్య వివాహాలపై కొరడా

గువాహటి: పద్నాలుగేళ్లలోపు బాలికలను వివాహమాడిన వారిపై అస్సాం ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. మూడు రోజులుగా కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్‌లో ఆదివారం నాటికి 2,278 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. 4,074 కేసులు పెట్టారు. ప్రస్తుతానికి తల్లిదండ్రులకు నోటీసులతో సరిపెడుతున్నామని సీఎం హిమంత బిశ్వ శర్మ చెప్పారు. స్పెషల్ డ్రైవ్ 2026 అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగుతుందన్నారు.

ముషారఫ్ కన్నుమూత



2019లో దుబాయ్ ఆస్పత్రిలో ముషారఫ్



• పాకిస్తాన్‌లోనే త్వరలో అంత్యక్రియలు
• కార్గిల్ సూత్రధారిగా శాశ్వత అపకీర్తి

ఇస్లామాబాద్/దుబాయ్: పాకిస్తాన్ మాజీ సైనిక పాలకుడు, 1999 నాటి కార్గిల్ యుద్ధం సృష్టికర్త జనరల్ పర్వేజ్ ముషారఫ్(79) అనారోగ్యంతో కన్నుమూశారు. చాలా రోజులుగా అమిలాయిడోసిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఆయన దుబాయ్‌లోని అమెరికన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. ముషారఫ్ భౌతికకాయాన్ని పాకిస్తాన్‌కు తరలించి, అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని ఆయన కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఇందుకు సహకరించాలని కోరుతూ దుబాయ్‌లోని పాకిస్తాన్ కాన్సులేట్‌లో దరఖాస్తు సమర్పించారు. ముషారఫ్ పార్థివదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి పాక్ ప్రభుత్వం రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ నుంచి ప్రత్యేక విమానాన్ని దుబాయ్‌కి పంపించనుంది. అంత్యక్రియలు కరాచీలో నిర్వహించాలని నిర్ణయించారు. స్వదేశంలో పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముషారఫ్ 2016 మార్చి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో ప్రవాస జీవితం గడుపుతున్న సంగతి తెలిసిందే. భారత్–పాకిస్తాన్ మధ్య జరిగిన కార్గిల్ యుద్ధానికి ప్రధాన సూత్రధారిగా, సైనిక నియంతగా ముషారఫ్ అపకీర్తిని మూటగట్టుకున్నారు. ముషారఫ్ మరణం పట్ల పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సంతాపం వ్యక్తం చేశారు. త్రివిధ దళాల అధిపతులు సైతం సంతాపం తెలిపారు. ముషారఫ్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి భగవంతుడు మానసిక స్థైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు వెల్లడించింది.

ఏమిటీ అమిలాయిడోసిస్?

చికిత్సతో నయం కాని ఇదొక అరుదైన వ్యాధి. శరీరంలోని అవయవాలు, కణజాలంలో అమిలాయిడ్ అనే ప్రొటీన్ అసాధారణంగా పెరిగిపోవడాన్ని అమిలాయిడోసిస్‌గా పరిగణిస్తారు. ఈ వ్యాధి వల్ల అవయవాలు పనిచేయడం క్రమంగా ఆగిపోతుంది. ముషారఫ్‌కు ఈ వ్యాధి సోకినట్లు తొలిసారిగా 2018లో బయటపడింది. ఆయన సొంత పార్టీ ఆల్ పాకిస్తాన్ ముస్లిం లీగ్(ఏపీఎంఎల్) ఈ విషయాన్ని ప్రకటించింది. ఆయన గత ఏడాది జూన్‌లో దుబాయ్‌లో ఆసుపత్రిలో చేరారు. 3 వారాల పాటు అసుపత్రిలోనే ఉన్నారు. అప్పట్లోనే ఆయన చనిపోయినట్లు సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి.

కాంగ్రెస్, బీజేపీ మాటల యుద్ధం

ముషారఫ్ మృతి పట్ల కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ సంతాపం ప్రకటించారు. భారత్‌కు శత్రువే అయినప్పటికీ శాంతి కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ ట్వీట్‌పై కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, బీజేపీ నేత షెహజాదా పూనావాలా ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్న నియంతను కీర్తించడం దారుణమని మండిపడ్డారు.

'కార్గిల్' విలన్

కరడుగట్టిన సైనిక నియంత



భారత గడ్డపై పుట్టి, కార్గిల్ యుద్ధంతో మనల్ని దొంగదెబ్బ తీసిన తెంపరి ముషారఫ్! కశ్మీర్ సమస్యను అంతర్జాతీయ అంశంగా మార్చడానికే అందుకు తెగించినట్టు తన ఆత్మకథ 'ఇన్ ద లైన్ ఆఫ్ ఫైర్'లో రాసుకున్నారు కూడా. నాటి ప్రధాని నవాజ్ షరీఫ్‌కు కూడా తెలియకుండా ముషారఫ్ స్వయంగా పథక రచన చేసిన కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌కు ఘోర పరాభవం మిగిలింది. 1999 మే 3న మొదలైన యుద్ధం జూలై 26న ముగిసింది. భారత్ 527 మంది సైనికులను కోల్పోగా 4,000 మందికిపైగా పాక్ జవాన్లు హతమయ్యారు.

ఢిల్లీలో పుట్టి...

పర్వేజ్ ముషారఫ్ 1943 ఆగస్టు 11న నాటి ఉమ్మడి భారతదేశ రాజధాని ఢిల్లీలో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. మాతృ భాష ఉర్దూ. 1947లో దేశ విభజనతో ఆయన కుటుంబం పాకిస్తాన్‌లోని కరాచీకి తరలివెళ్లింది. తండ్రి సయీద్ ముషారఫుద్దీన్ ఉద్యోగరీత్యా ముషారఫ్ 1956 దాకా టర్కీలో ఉన్నారు. తర్వాత కరాచీ, లాహోర్లలో చదువుకున్నారు. 1961లో పాకిస్తాన్ మిలటరీ అకాడమీలో చేరారు. 1964లో ఆర్టిలరీ రెజిమెంట్‌లో అడుగుపెట్టారు. 1971లో కంపెనీ కమాండర్‌గా భారత్–పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. తర్వాత సైన్యంలో అంచెలంచెలుగా ఎదిగారు. 1998లో నాటి ప్రధాని నవాజ్ షరీఫ్ ఆయన్ను చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నియమించారు. 'జాయింట్ చీఫ్స్ స్టాఫ్ కమిటీ' చైర్మన్‌గా 1999 ఏప్రిల్ 9న అదనపు బాధ్యతలు సైతం అప్పగించారు.

నియంత పాలన

పాక్, భారత్ ప్రధాన మంత్రులు షరీఫ్, వాజ్‌పేయి మధ్య 1999 ఫిబ్రవరి 21న చరిత్రాత్మక లాహోర్ శాంతి ఒప్పందం కుదిరిన కొన్ని నెలలకే కార్గిల్ యుద్ధానికి ముషారఫ్ తెగబడ్డారు. దీనిపై ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొన్నారు. తనను తొలగించేందుకు నవాజ్ షరీఫ్ ప్రయత్నించడంతో 1999 అక్టోబర్‌లో సైనిక కుట్రతో ఆయన్ను గద్దె దింపారు. పాకిస్తాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ప్రకటించుకుని పాలకునిగా మారారు. 2001లో దేశాధ్యక్షుడిగా ప్రకటించుకున్నారు. తొమ్మిదేళ్లపాటు పాలించారు. ఉగ్రవాదంపై యుద్ధం పేరిట అమెరికాతో చేతులు కలిపారు. మితవాద, ప్రగతిశీల ఇమేజీ కోసం ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలను నిషేధించి వాటి ఆగ్రహానికి గురయ్యారు. ముషార్రఫ్‌పై పలుమార్లు హత్యాయత్నాలూ జరిగాయి. 2008లో తప్పనిసరిగా పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహిస్తానని ప్రకటించారు. ఎన్నికల తర్వాతి పరిణామాల్లో రాజీనామా చేసి దుబాయ్ పారిపోయారు. 2013 మార్చిలో తిరిగొచ్చి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రయత్నించినా అనర్హత వేటు పడింది. నవాజ్ గెలిచాక ముషార్రఫ్‌పై మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో హత్య సహా పలు కేసులు నమోదయ్యాయి. 2019లో ప్రత్యేక కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది!

– సాక్షి, నేషనల్ డెస్క్



2001 జూలైలో భారత పర్యటన సందర్భంగా రాష్ట్రపతి కేఆర్ నారాయణన్, ప్రధాని వాజ్‌పేయిలతో ముషారఫ్

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023

మత్తు ఇంజెక్షన్ ఇచ్చి 'మాక్నా' పట్టివేత

అన్నానగర్: ధర్మపురి జిల్లా బాప్పరాపట్టి సమీపంలో గత నాలుగు నెలలుగా రెండు ఏనుగులు వ్యవసాయ పొలాల్లోకి ప్రవేశించి పంటలను దెబ్బతీస్తున్నాయి. దీంతో రైతుల ఫిర్యాదు మేరకు.. అటవీశాఖాధికారులు వీటిని బంధించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో రెండింటిలో ఒకటైన మాక్నా అనే ఏనుగు ఆదివారం తెల్లవారుజామున మోరాపూర్ – బికిలీ అటవీ ప్రాంతం మధ్య కనిపించింది. వెంటనే అటవీశాఖాధికారులు, వెటర్నరీ వైద్యులు, అధికారులు అక్కడికి చేరుకున్నారు. కుంకీ ఏనుగును కూడా సహాయం కోసం తీసుకువచ్చారు. మాక్నా ఏనుగుకు ఎయిర్ గన్ ద్వారా నాలుగు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చారు. కింద పడిన తరువాత కుంకీ ఏనుగు సాయంతో మాక్నాను ట్రక్కులో ఎక్కించి పొల్లాచ్చి సమీపంలోని ఏనుగుల కొండ శిబిరానికి తరలించారు.


తిరుచెందూరు సాగరతీరంలో అశేష భక్త జనం

దేదీప్యమానంగా వెలిగే ఆలయ శిఖరాలు.. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు.. దిక్కులు పిక్కటిల్లేలా హరోంహర నామస్మరణలు.. పవిత్ర స్నానాలు.. కావడి మొక్కుల చెల్లింపులతో రాష్ట్రంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు ఆదివారం భక్త జనసంద్రంగా మారాయి. ముఖ్యంగా ఆరుపడై వీడుల్లో భూమి ఈనిందా.. అన్నట్లు భక్తులు పోటెత్తారు. అత్యంత ప్రీతిపాత్రమైన తైపూసం రోజున తమ ఇష్టదైవాన్ని దర్శించుకుని తన్మయత్వం చెందారు.


పళణిలో రథోత్సవానికి పోటెత్తిన భక్తులు

తైపూసం.. భక్తజన సంద్రం

హరోం..హర
- మురుగన్ ఆలయాల్లో ఘనంగా తైపూస మహోత్సవం
- తిరుచెందూర్, పళని, తిరుప్పరగుండ్రం ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- శూలాలు, కావళ్లతో మొక్కుల చెల్లింపు

సాక్షి, చెన్నై: తైపూసం సందర్భంగా ఆదివారం రాష్ట్రంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. తమిళ్ కడవుల్ మురుగన్‌ను ప్రార్థిస్తూ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధి చెందిన తిరుచెందూరు, పళని, తిరుప్పరగుండ్రం తదితర ఆలయాల్లో మహోత్సవాలు మిన్నంటాయి. కావళ్లు మోస్తూ భక్తులు పాదయాత్రగా ఆలయాలకు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆరుపడ వీడుల్లో..

మురుగన్ కొలువైన 'ఆరుపడ వీడు'గా విశేష గుర్తింపు పొందిన అనేక ఆలయాలు రాష్ట్రంలో ఉన్న విషయం తెలిసిందే. ఇందులో తిరుప్పరగుండ్రం, తిరుచెందూరు, పళని, సెన్నిమలై, తిరుత్తణి, పలముదిర్ చోళై అత్యంత ప్రసిద్ధి చెందాయి. ఇక్కడి ఆలయాల్లో గత వారం రోజులుగా తైపూసం వేడుకలు అత్యంత కోలాహలంగా సాగుతున్నాయి. ఈ ప్రధాన ఆలయాల్లోనే కాదు, ఎక్కడెక్కడ సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు ఉన్నాయో, అక్కడ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఇక తైపూసం రోజున స్వామి వారిని దర్శించుకుంటే సకల శుభాలూ కలుగుతాయని భక్తుల నమ్మకం. ఆ దిశగా తమ ఆరాధ్య దైవానికి తమిళ భక్తులు కావళ్లు మోసి, శూలాలు గుచ్చుకుని పాదయాత్రతో ఆలయాలకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

తిరుచెందూరులో..

తిరుచెందూరు సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో వేకువ జామున నుంచే విశేష పూజలు మొదలయ్యాయి. ఇక్కడ విశ్వరూప జ్యోతి దర్శనంతో భక్తులు పులకించిపోయారు. ఆలయానికి కూత వేటు దూరంలో ఉన్న సముద్రంలో పవిత్ర స్నానాలు చేశారు. తర్వాత అక్కడి బావి నీటిని చల్లుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. ఇక తిరుప్పర గుండ్రంలోని ముత్తుకుమార స్వామి ఆలయంలో, మదురై అళగర్ మలైలోని పలముదిర్ చోళైలో, ఈరోడ్ జిల్లా సెన్నిమలై(స్వామి మలై)లో తైపూసం మహోత్సవాలు కనుల పండువగా సాగాయి. అలాగే చెన్నై వడపళణిలోని మురుగన్ ఆలయం వద్ద స్వామి దర్శనార్థం ఉదయాన్నే భక్తులు కిలోమీటర్ల కొద్ది బారులు తీరారు. అలాగే కడలూరు జిల్లా వడలూరులో వల్లలార్ జ్యోతి దర్శన మహోత్సవంలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఇక్కడ ఏడు వర్ణాలతో కూడిన తెరను తెరిచి అద్దం ద్వారా జ్యోతి దర్శనాన్ని భక్తులకు కల్పించడం విశేషం.

పళనిలో..

దిండుగల్ జిల్లా పళనిలో దండాయుధ పాణి స్వామి ఆలయంలో 16 ఏళ్ల అనంతరం జరిగిన కుంభాభిషేకం తర్వాత ఆలయంలో బ్రహ్మాండంగా తైపూసం ఉత్సవాలు సాగుతున్నాయి. ఈ సందర్భంగా రోజూ ఆలయంలో విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారు మయూరం, పల్లకి వాహనాల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అలాగే స్వామి వారి వివాహ మహోత్సవం కనుల పండువగా సాగింది. వళ్లి, దైవానై అమ్మవార్లతో దండాయుధ పాణిగా ముత్తుకుమార స్వామి ఇక్కడ భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శనివారం సాయంత్రం రథోత్సవం కనుల పండువగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించిన భక్తులు రాత్రాంతా ఆలయం వద్ద భక్తి శ్రద్ధలతో పూజల్లో లీనమయ్యారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు లక్షలాది మంది పాదయాత్రగా పళని వైపు పోటెత్తారు. పళనిలోని అన్ని మార్గాలు, పరిసరాలు, మెట్ల దారి భక్తులతో నిండిపోయాయి. అన్ని ఆలయాల వద్ద పోలీసు యంత్రాంగం గట్టి భద్రతా చర్యలు తీసుకుంది.

వేలూరు, తిరువణ్ణామలైలో..

వేలూరు: తమిళ తైమాసంలోని పౌర్ణమి రోజున వచ్చే తైపూజోత్సవాలను వేలూరు, తిరువణ్ణామలై ఆలయాల్లో ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో తైపూజోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వారికి అన్నాభిషేకం చేశారు. వేలూరు రత్నగిరి మురుగన్ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి ప్రార్థనలు చేశారు. వాలాజ సమీపంలోని శ్రీ ధన్వంతరి ఆరోగ్య పీఠంలో పీఠాధిపతి మురళీధర స్వామిజీ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పీఠంలోని 27 నక్షత్రాలకు పరిహార పూజలు, స్వయం వర కళాపార్వతి యాగం, గంధర్వ రాజ హోమం, సంతాన గోపాల యాగం, నవనీత కృష్ణుడికి వెన్నతో అభిషేకం, పుష్పాలంకరణ చేశారు.

తిరుత్తణిలో..

తిరుత్తణి: తిరుత్తణి ఆలయంలో తైపూసం సందర్భంగా ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా అర్చకులు మూలవర్లు అభిషేక పూజలు చేపట్టి వజ్రాభరణాలు తొడిగి సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, రాణిపేట, కృష్ణగిరి సహా వివిధ జిల్లాలతో పాటు ఆంధ్రాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తిరుత్తణికి పోటెత్తారు. మెట్లమార్గంతో పాటు ఘాట్‌రోడ్డు మార్గాలన్నీ జనంతో కిక్కిరిశాయి. కావళ్లు మోసి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. పలు ప్రాంతాల్లో అన్నదానం చేశారు. భక్తులు తీసుకొచ్చిన పాల బిందెలతో ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తి వెండి నెమలి వాహన సేవలో కొలువుదీరి మాడ వీధుల్లో విహరించారు. తైపూసం సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి ఎల్ మురుగన్ సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. ప్రధానగేటు ద్వారా మంత్రి లోపలికి ప్రవేశించిన సమయంలో బీజేపీ శ్రేణులు భారీ సంఖ్యలో రావడంతో భక్తుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. మంత్రికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశ్విన్‌కుమార్, జిల్లా పట్టభద్రుల విభాగం ఉపాధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత వాసుదేవ రాజు, తమిళ భాష అభ్యున్నతి విభాగం కార్యదర్శి రఘురామన్ ఘన స్వాగతం పలికారు.


విశేష అలంకరణలో ఉత్సవమూర్తి మురుగన్


స్వామి దర్శనానికి వెళ్తున్న కేంద్ర మంత్రి మురుగన్


చెన్నై వడపళణి ఆలయంలో బారులుదీరిన భక్తులు



తిరుచెందూరులో భక్తుల అంగప్రదక్షిణ


తిరుప్పోరూరులో కావళ్లతో భక్తులు


అన్నాభిషేకం

న్యూస్‌రీల్

కరోనా.. సున్నా!



సాక్షి చెన్నై: రాష్ట్రంలో కరోనా కేసులు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. చెన్నైలో రోజువారీ కేసుల సంఖ్య సున్నాకి చేరింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఐదు పాజిటివ్ కేసులు మాత్రమే ఉన్నాయి. వివరాలు.. కరోనా ఒకటి, రెండు వేవ్‌లు రాష్ట్రంలో విలయ తాండవం సృష్టించిన విషయం తెలిసిందే. ఒకటిలో కంటే, రెండో వేవ్‌లో అధికప్రాణ నష్టం సంభవించింది. ఒక సమయంలో రోజు వారి కేసుల సంఖ్య రాష్ట్రంలో 50 వేలను సైతం దాటేసింది. ఆక్సిజన్ కోసం అలమటించి మరణించిన వారెందరో. ఆ తర్వాత క్రమంగా కరోనా తగ్గుముఖం పడుతూ వచ్చింది. ఈ ఏడాది ఆరంభంలో కొత్త రకం వేరియంట్ కలవర పెట్టింది. రాష్ట్రంలోకి ఆ వేరియంట్ ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. తర్వాత కాలంలో ఆ వేరియంట్ సైతం కనుమరుగైంది. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో రోజుకు నాలుగు లేదా ఐదు కేసులు మాత్రమే నమోదవుతూ వస్తున్నాయి. చికిత్సలో, స్వీయ నిర్బంధంలో ఉన్న వారికి సంఖ్య డబుల్ డిజిట్‌గా ఉంది. ఈ సమయంలో చెన్నైలో కేసుల సంఖ్య జీరో స్థాయికి చేరినట్లు అధికారులు ఆదివారం ప్రకటించారు. మొదట్లో చెన్నై, దాని శివారు జిల్లాలోనే అధికంగా వైరస్ తీవ్ర ప్రభావం చూపింది. ఈనేపథ్యంలో ప్రస్తుతం కరోనా రహితంగా చెన్నై నిలవడం విశేషం.

బస్సు- కారు ఢీ

– ముగ్గురి మృతి

సాక్షి, చెన్నై: బస్సు –కారు ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురు మరణించారు. తిరుప్పూర్ నుంచి కుంబకోణం వైపుగా ఓ ప్రభుత్వ బస్సు ఆదివారం మధ్యాహ్నం బయలు దేరింది. మార్గం మధ్యలోని వలపాళయం వద్ద ఎదురుగా వస్తున్న కారును ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ఘటనలో కారులోని ముగ్గురు ఘటనా స్థలంలోనే మరణించారు. ఆధార్ కార్డుల ఆధారంగా మృతులను లోకేశ్వరన్(26), ప్రమీల (45), దేవి (60)గా గుర్తించారు. వీరు మరణించిన విషయాన్ని కుంబకోణంలోని బంధువులకు తెలియజేశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు.

చెత్త రహితంగా చెన్నై

- 11వ తేదీ నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం
- నిరంతర శుభ్రత కోసం 18 రోడ్ల ఎంపిక


మేయర్ ప్రియ

సాక్షి, చెన్నై: రాజధాని నగరం చెన్నైను చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కార్పొరేషన్ కసరత్తు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 15 మండలాల్లో 18 ప్రధాన రోడ్లను ఎంపిక చేశారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఈ రోడ్లను 11వ తేదీ నుంచి నిరంతరం పరిశుభ్రంగా ఉంచనున్నారు. వివరాలు.. రాజధాని నగరం చెన్నైను సుందరంగా తీర్చిదిద్దేందుకు కార్పొరేషన్ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే ఇళ్ల వద్దకే వెళ్లి సిబ్బంది చెత్త సేకరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక బ్యాటరీ, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసి ఆయా మండలాల వారీగా అప్పగించారు. ఇష్టానుసారం చెత్తను బయట పడవేసే వారికి జరిమానా మోత మోగిస్తున్నారు. గత ఏడాది రూ. 5 కోట్ల మేరకు జరిమానా సైతం వసూలు చేసినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో నగరంలోని కొన్ని ప్రధాన మార్గాలను మరింత శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. ఈ విషయాన్ని ఆదివారం మేయర్ ప్రియ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలోని తిరువొత్తియూరు హైరోడ్డు, కామరాజర్ సాలై, జీఎస్‌టీ రోడ్డు, పూందమల్లి రోడ్డు, పూందమల్లి హైరోడ్డు, పెరంబూరు, అంబత్తూరు- రెడ్‌హిల్స్ రోడ్డు, కెథడ్రల్ రోడ్డు, రాధాకృష్ణన్ సాలై, త్యాగరాజ సాలై, వలసరవాక్కం రోడ్డు, అడయార్ ఎలియట్స్ బీచ్ రోడ్డు, రాజీవ్ గాంధీ రోడ్డు తదితర 18 మార్గాలను చెత్త రహితంగా తీర్చిదిద్దాలని నిర్ణయించామని వివరించారు. ఈ నెల 11వ తేదీ నుంచి 24 గంటల పాటూ ఈరోడ్లను శుభ్రంగా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. కార్పొరేషన్ సిబ్బంది ఈ మార్గాలపై ప్రత్యేక దృష్టి పెడుతారని ఆమె తెలియజేశారు.

దర్శకుడు, నటుడు గజేంద్రన్ కన్నుమూత



నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ (ఇన్‌సెట్) టీపీ గజేంద్రన్ (ఫైల్)

తమిళ సినిమా: సీనియర్ దర్శకుడు, నటుడు టీపీ గజేంద్రన్ (71) ఆదివారం కన్నుమూశారు. స్థానిక సాలిగ్రామంలో ఈయన నివాసం ఉంటున్నారు. ఈయన పూర్వీకులు తూతుక్కుడికి చెందిన వారు. తన పాట్టితనాన్ని ఆసరగా చేసుకుని.. సినిమా రంగంలో రాణించారు. కె.బాలచందర్, విసుల వద్ద దర్శకత్వం శాఖలో శిక్షణ పొంది ఆ తర్వాత 25 చిత్రాల వరకు దర్శకత్వం వహించారు. వీటిలో 90 శాతం నిర్మాతలకు లాభాలు తెచ్చిపెట్టినవే. అదేవిధంగా 150కి పైగా చిత్రాల్లో వివిధ పాత్రల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. కాగా కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురయ్యారు. వైద్య చికిత్సలనంతరం కోలుకున్న గజేంద్రన్ ఆదివారం ఉదయం అనూహ్యంగా కన్నుమూశారు. పలువురు సినీ ప్రముఖులు టీపీ గజేంద్రన్ మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి స్టాలిన్ నివాళి..

ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం ఉదయం టీపీ గజేంద్రన్ నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. అంతకుముందు ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో టీపీ గజేంద్రన్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అందులో ప్రముఖ నటుడు, దర్శకుడు నా కళాశాల సహచరుడు, మిత్రుడు టీపీ గజేంద్రన్ మరణ వార్త ఎంతో బాధను కలిగించిందని పేర్కొన్నారు. యంగవూరు కాలం, పాండినాడు సంఘం వంటి పలు విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించి, పలు చిత్రాల్లో నటించి సినిమా రంగానికి తన ఉత్తమ సేవలను అందించారని కొనియాడారు. అనూహ్యంగా అనారోగ్యానికి గురై కన్ను మూయడం ఎంతగానో బాధించిందన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం కూడా రాజేంద్రన్‌కు సంతాపం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటనను విడుదల చేసింది.

అన్నదాతను ఆదుకోండి..!

- ప్రధానికి సీఎం స్టాలిన్ లేఖ
- వరి కొనుగోలు నిబంధనల్లో సడలింపునకు వినతి
- వర్ష బాధిత ప్రాంతాల్లో మంత్రుల పర్యటన


డెల్టా జిల్లాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రులు, అధికారుల బృందం

సాక్షి, చెన్నై: అకాలవర్షం తమిళనాడులోని డెల్టా జిల్లాల్లో అపార నష్టాన్ని కలిగించిందని సీఎం ఎంకే స్టాలిన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి ఆదివారం ఆయన లేఖ రాశారు. వరి కొనుగోలుకు విధించిన నిబంధనలు సడలించాలని అందులో విజ్ఞప్తి చేశారు. వివరాలు.. వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలతో అన్నదాతలు విలవిలలాడుతున్నారు. ఒక్క తిరువారూర్ జిల్లాలోనే 2 లక్షల ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లింది. మిగిలిన జిల్లాలో నష్టం భారీగానే జరిగిందని అంచనా. ఆదివారం మంత్రులు చక్రపాణి, ఎంఆర్‌కే పన్నీరు సెల్వం, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి రాధాకృష్ణన్ తదితరులు డెల్టా జిల్లాల్లో పర్యటించారు. తంజావూరు నుంచి తమ ప్రయాణాన్ని మొదలెట్టారు. దెబ్బ తిన్నవరి పంటను పరిశీలించారు. అన్నదాతల వద్ద వివరాలను సేకరించారు. ఈ పరిశీలన మరో రెండురోజుల పాటు సాగనుంది. ఆ తర్వాత సీఎం స్టాలిన్‌కు ఈ బృందం నష్టం తీవ్రతపై నివేదిక సమర్పించనుంది.

లక్ష హెక్టార్లలో..

ప్రధాని నరేంద్రమోదీకి సీఎం స్టాలిన్ రాసిన లేఖలో.. అకాల వర్షాల కారణంగా కావేరి డెల్టాలో నీట మునిగి సంబా వరి పంట గురించి వివరించారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆవేదనలో పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. కోతలకు సిద్ధమయ్యే సమయానికి, దురదృష్టవశాత్తు తంజావూరు, తిరువారూరు, నాగపట్నం, మైలాడుతురై, పుదుకోట్టై జిల్లాల్లో అకాల వర్షాల కారణంగా లక్ష హెక్టార్లలో వరి నీట మునిగినట్లు ప్రాథమిక అంచనాల్లో తేలిందని వివరించారు. నిరంతర భారీ వర్షాల కారణంగా పండించిన ధాన్యంలో తేమ స్థాయి చాలా ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రైతులను ఆదుకునేందుకు, తేమతో ఉన్న వరి కొనుగోలుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే వరి పంట కొనుగోలులో తేమ శాతానికి సంబంధించి నిబంధనలను సడలించాలని విజ్ఞప్తి చేశారు. తమిళనాడు కమోడిటీ మార్కెటింగ్ కార్పొరేషన్ రైతుల నుంచి 22శాతం వరకు తేమ ఉన్న వరిని కొనుగోలు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే కుంచించుకుపోయిన వరి పరిమితిని 3 నుంచి 5 శాతానికి, దెబ్బతిన్న, రంగు మారిన, మొలకెత్తిన వరి పరిమితిని 5 నుంచి 7 శాతానికి సడలించాలని విన్నవించారు. ఇదిలా ఉండగా, వరి కొనుగోలు కేంద్రాలకు పౌర సరఫరాల శాఖ మంత్రి చక్రపాణి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం 19 శాతం వరకు తేమ ఉన్న వరిని కొనుగోలు చేయడానికి నిరాకరించవద్దని సూచించారు.

దుర్గా స్టాలిన్ సోదరి చారుమతి మృతి


చారుమతి (ఫైల్)

సాక్షి, చెన్నై: డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ సోదరి చారుమతి(62) చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆమె బాధ పడుతూ వచ్చారు. దుర్గా స్టాలిన్‌కు చారుమతి, జయంతి అనే ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. పెద్ద సోదరి చారుమతి ఎగ్మూర్‌లో నివాసం ఉన్నారు. ఆమెకు భర్త షణ్ముగ సుందరం, కుమారుడు కార్తికేయన్, కుమార్తె అభిరామి ఉన్నారు. వీరందరికీ వివాహాలు అయ్యాయి. గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన చారుమతి శనివారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. ఈ సమాచారంతో దుర్గా స్టాలిన్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. సీఎం స్టాలిన్‌తో కలిసి హుటాహుటిన ఎగ్మూర్ ఖాజా మేజర్ రోడ్డులోని నివాసంకు దుర్గా స్టాలిన్ వెళ్లారు. చారుమతి భౌతిక కాయానికి సీఎం స్టాలిన్‌తో పాటుగా మంత్రులు పొన్ముడి, తంగం తెన్నరసు, ఎం సుబ్రమణియన్, శేఖర్‌బాబు, ఉదయ నిధి స్టాలిన్, పెరియకరుప్పన్, ఎంపీలు కనిమొళి, దయానిధి మారన్, ఎస్ఆర్ ఇలంగోలు నివాళులర్పించారు. దివంగత డీఎంకే అధ్యక్షుడు కరుణానిధి సతీమని రాజాత్తి అమ్మాల్ కూడా అక్కడికి చేరుకుని భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

జెమ్‌లో కేన్సర్ గైడెన్స్ ప్రోగ్రామ్

సాక్షి, చెన్నై: పెరుంగుడిలోని జెమ్ ఆసుపత్రిలో కేన్సర్ గైడెన్స్ ఉచిత ప్రోగ్రామ్‌కు శనివారం శ్రీకారం చుట్టారు. ఈ వివరాలను ఆ ఆసుపత్రి చైర్మన్ సి. పళనివేల్ మీడియాకు వివరించారు. కేన్సర్‌తో పోరాడుతున్న వారు ఆ రుగ్మత నుంచి బయటపడి విజయం సాధించేందుకు అవసరమైన అంశాలతో ఈ కార్యక్రమాన్ని రూపొందినట్లు వెల్లడించారు. వైద్యబృందం విలువైన సలహాలు, మార్గదర్శకాలను రోగులకు ఉచితంగా తెలియజేస్తారని వివరించారు. ఈనెల 28వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ప్రకటించారు.

క్లుప్తంగా

సత్యనారాయణస్వామికి విశేష పూజలు



పూజలను ప్రారంభిస్తున్న మహిళలు, నిర్వాహకులు

కొరుక్కుపేట: చెన్నై కొడుంగయూర్‌లోని నార్త్ మద్రాస్ ఆర్యవైశ్య సంఘ భవనంలో ఆదివారం సత్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు సంఘం భవనంలోని మొదటి అంతస్తులో రూ.20 లక్షలతో ఆధునీకరించిన ఏసీ హాలును ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక కార్యదర్శి చీమకుర్తి గోవిందరాజులు, గుండ్లపల్లి సత్యనారాయణ, శుభశ్రీ, సంఘం అధ్యక్షుడు వి.రమేష్ కృష్ణ, కోశాధికారి ఉపేంద్ర, జాయింట్ సెక్రటరీలు మద్దాల ప్రవీణ్ కుమార్, ఎస్.బాబు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి



శివాజీస్వామిజీకి జ్ఞాపిక అందజేస్తున్న ప్రతినిధులు

వేలూరు: పేద విద్యార్థుల ఉన్నత విద్యకు దాతలు ముందుకు రావాలని అఖిల భారత విశ్వకర్మ జగత్‌గురు, చానాందల్ మఠం 65వ గురు మహా సన్నిదానం శివాజీ ఆచ్చారి స్వామిజీ అన్నారు. అఖిల భారత విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో 22వ వార్షికోత్సవం, విద్యార్థులకు స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం ఉందన్నారు. ప్రస్తుతం విద్యతోనే విశ్వకర్మకు చెందిన వారు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. ఏటా విద్యార్థులను ప్రోత్సహించే విధంగా స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని.. ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలన్నారు. పేద విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన విద్యా స్కాలర్‌షిప్‌లను అందజేసేందుకు సంఘం సిద్ధంగా ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు, దాతలు ముందుకు వస్తే విద్యార్థుల జీవితాలు బాగుపడతాయని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకుడు జనార్దనన్, నటరాజన్, కుప్పుస్వామి, శిగామణి, సెల్వరాజ్, స్వామినాథన్ పాల్గొన్నారు.

ఏడాదిగా ఎదురుచూపే..!



నిరుపయోగంగా ఉన్న సబ్‌వే



ట్రాక్ దాటుతున్న ప్రయాణికులు

- ప్రారంభానికి నోచుకోని సబ్‌వే
- పట్టించుకోని అధికారులు
- ప్రయాణికుల ఇక్కట్లు

తిరువళ్లూరు: రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం రూ.6 కోట్లు వ్యయంతో నిర్మించిన సబ్‌వే నిర్మాణం పూర్తయ్యి ఏడాది దాటుతున్నా ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదు. ఫలితంగా ప్రయాణికులు రైల్వే ట్రాక్ దాటే సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చెన్నై నుంచి తిరువళ్లూరు, అరక్కోణం, తిరుత్తణి, తిరుపతి, కాట్పాడి, ముంబై, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్, సబర్బన్ రైళ్ల ద్వారా రాకపోకలు సాగిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన తిరువళ్లూరు నుంచి వేర్వేరు ప్రాంతాలకు, ఇతర ప్రాంతాల నుంచి తిరువళ్లూరుకు పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులు నిత్యం వచ్చిపోతుంటారు. ఈ రైల్వేస్టేషన్ ద్వారా ఏడాదికి రూ.15 కోట్ల మేరకు ఆదాయం వస్తోంది. ఉదయం 5.30 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు తిరువళ్లూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. రైల్వేస్టేషన్‌లో మొత్తం 6 ప్లాట్‌ఫాంలు ఉండగా, 5 ప్లాట్‌ఫాంలను అనుసంధానం చేస్తూ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. అయితే రైలు దిగిన తరువాత ఫ్లైఓవర్‌పై వెళ్లడానికి బదులు మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు రైల్వే పట్టాలను దాటి వెళ్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాలను అరికట్టడానికి 2019లో 1,2,3 ప్లాట్‌ఫాంలను అనుసంధానిస్తూ.. ఎస్కలేటర్‌ను ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో రూ.6 కోట్ల వ్యయంతో సబ్‌వే నిర్మాణపు పనులను సైతం ప్రారంభించారు. పనులను ఏడాదిలోపు పూర్తి చేయాల్సి ఉంది. ఎస్కలేటర్ పనులు పూర్తయి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. సబ్‌వే గత ఏడాది పూర్తయ్యింది. అయితే ఇంత వరకు సబ్‌వే ప్రజలకు అందుబాటులోకి రాకపోవడంతో ట్రాక్ దాటడం తప్ప మరే మార్గం లేకుండా పోయింది. సబ్‌వేను ప్రారంభించి అందుబాటులోకి తేవాలని పలుమార్లు రైలు ప్రయాణికుల సంఘంతో పాటు సాధారణ ప్రయాణికులు కోరినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ఇక నిత్యం రద్దీగా ఉండే తిరువళ్లూరు రైల్వేస్టేషన్‌లో లిఫ్టు సదుపాయాన్ని కల్పించాలని కూడా ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వైశ్య సంఘం సేవలు ప్రశంసనీయం



సామూహిక వివాహ కార్యక్రమంలో నూతన వధూవరులు

కొరుక్కుపేట: సామాజిక బాధ్యతగా ఉచిత సామూహిక వివాహాలు జరిపించిన దక్షిణ ఇండియా వైశ్య సంఘం సేవలు ప్రశంసనీయం అని వక్తలు కొనియాడారు. చెన్నై ప్యారీస్ గిడ్డంగి వీధిలో ఆర్య వైశ్య సామూహిక వివాహ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో రెండు జంటలకు ఉచిత సామూహిక వివాహాలను శాస్త్రోక్తంగా జరిపించారు. వారి కుటుంబానికి సరిపడా వస్తువులు, మంగళసూత్రం, పట్టు వస్త్రాలను అందజేసినట్టు దక్షిణ ఇండియా వైశ్య సంఘం అధ్యక్షుడు కె.శంకర రావు తెలిపారు. ముఖ్య అతిథిగా సింగంశెట్టి యతీంద్రులు శెట్టి, ఏల్చూరు సురేష్ బాబు వివాహ విశిష్టత, చరిత్రను సభకు వివరించారు. సంఘ సంయుక్త కార్యదర్శులు మద్ది నరసింహులు, పువ్వాడ అశోక్ కుమార్, కోశాధికారి పెసల రమేష్, సీఏ శేఖర్, టీజీ పార్థసారథి, మన్నారు ఉదయకుమార్ వధూవరులను ఆశీర్వదించారు. ప్రముఖ న్యాయవాదులు జె.మదనగోపాల్ రావు, ఎస్ఎల్ సుదర్శన్, గణేష్, ఆడిటర్ ఎస్ఎల్ జనార్ధనం, దేసు లక్ష్మీ నారాయణ, బద్రీనారాయణ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు స్టాల్స్

తిరువళ్లూరు: పట్టణంలోని చిరువ్యాపారులకు కేంద్రప్రభుత్వ సహకారంతో తొలిదశలో 30 స్టాల్స్(చిల్లర కొట్లు)ను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ రాజ్యలక్ష్మి వివరించారు. తిరువళ్లూరు పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా 500 పైగా చిల్లరకొట్లు ఉన్నాయి. వీటిలో 342 మంది చిరువ్యాపారులు మాత్రమే తమ పేర్లను మున్సిపాలిటీలో నమోదు చేసుకున్నారు. వీరు టిఫిన్, సూప్, బిరియాని, కూరగాయలు, పండ్లు, పూలు తదితర వాటిని అమ్ముకుని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అర్హులైన చిరువ్యాపారులను గుర్తించి వారికి సాయం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా చిల్లర బంక్‌ను అందించాలని చిరు వ్యాపారులను ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలిదశలో 30 మందికి చిల్లర కొట్టు బండ్లను అందజేయనున్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇక్కట్లు



పేరుకుపోయిన ప్లాస్టిక్ వస్తువులు

తిరువళ్లూరు: ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని అధికారులు శతవిధాలుగా ప్రయత్నం చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఫలితంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరువళ్లూరు జిల్లాలో 14 యూనియన్లు, 526 గ్రామ పంచాయతీలు, ఆరు మున్సిపాలిటీ, మేజర్ పంచాయతీలతో పాటు ఆవడి కార్పొరేషన్ కూడా ఉంది. జిల్లాలో ప్లాస్టిక్ వస్తువుల వాడకం గతంలో పెరిగి పర్యావరణం క్రమంగా దెబ్బతింటోంది. దీంతో జిల్లాను ప్లాస్టిక్ రహితంగా మార్చడానికి అప్పటి కలెక్టర్‌లు వీరరాఘవరావు, సుందరవల్లి, మహేశ్వరి ప్రత్యేకంగా కృషి చేశారు. దుకాణాల్లో తరచూ తనిఖీలు చేసి ప్లాస్టిక్ విక్రయాలపై ఉక్కుపాదం మోపారు. ఫలితంగా ప్లాస్టిక్ వాడకం క్రమంగా తగ్గింది. అయితే గత ఆరు నెలల నుంచి మళ్లీ ప్లాస్టిక్ వాడకం ఎక్కువైంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వస్తువులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్ అమ్మకాలు, కొనుగోలుపై ఉక్కుపాదం మోపాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.

డీఎండీకే విజయానికి కృషి చేద్దాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డీఎండీకే జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి

తిరుత్తణి: ఈరోడ్డు ఉప ఎన్నికల్లో డీఎండీకే అభ్యర్థి విజయానికి సమష్టి కృషి చేద్దామని డీఎండీకే తిరువళ్లూరు జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం తిరుత్తణిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తిరుత్తణి, తిరువళ్లూరు, పూందమల్లి నియోజకవర్గాల నుంచి జిల్లా, మండల, నగర, టౌన్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈరోడ్డు ఉప ఎన్నికలు డీఎండీకేకు చాలా కీలకమని పేర్కొన్నారు. ఓటు బ్యాంకు పెంచుకునేందుకు సరైన అవకాశం అన్నారు. డీఎండీకే బలాన్ని నిరూపించాల్సిన సమయని.. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజయం కన్నా ఓటు బ్యాంకు శాతం అత్యవసరమని, ప్రతి కార్యకర్త ఈరోడ్డులో 10 రోజుల పాటు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలవాలన్నారు. విజయకాంత్ నాయకత్వానికి మద్దతు ఇవ్వాలని కోరాలన్నారు. ఈ నెల 12వ తేదీ డీఎండీకే జెండా దినోత్సవాన్ని అన్ని గ్రామాల్లో జరుపుకునేందుకు ఏర్పాట్లు చేయాలని తీర్మానించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



టాస్మాక్ ఉద్యోగుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కన్నన్

తిరుత్తణి: పట్టణంలో ఆదివారం టాస్మాక్ ఉద్యోగుల జిల్లా మహానాడు జరిగింది. ఉద్యోగ భద్రత కల్పించాలని తీర్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరాజు అధ్యక్షత వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెరియస్వామి, ఎంపీ సుబ్బరాయన్, మాజీ ఎమ్మెల్యే కన్నన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టాస్మాక్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. మద్యం షాపులు క్రమంగా తగ్గించాలని.. మద్యరహిత రాష్ట్రంగా మార్చాలన్నారు. అదే సమయంలో టాస్మాక్ సిబ్బందికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని తీర్మానాలు ఆమోదించారు.

కోలీవుడ్ టాక్స్

శివ కార్తికేయన్ @ 11



తమిళ సినిమా: నటుడు శివ కార్తికేయన్ గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఈయన పేరు ఇప్పుడు కోలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు ప్రాచుర్యం పొందింది. కోలీవుడ్లో ప్రముఖ హీరోలలో ఒకరుగా రాణిస్తున్న శివ కార్తికేయన్ ఆరంభ దశలో టీవీ యాంకర్‌గా తన ప్రయాణాన్ని మొదలు పెట్టారు. చిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న ఈయన ఆ తర్వాత సినీ కథానాయకుడిగా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రం మనం కొత్తి పరవై తోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ తర్వాత పలు విజయవంతం చిత్రాల్లో నటించి స్టార్‌డమ్‌ను పెంచుకుంటూ వచ్చారు. ఈయన ఇటీవల నటించిన డాక్టర్, డాన్ చిత్రాలు సూపర్ హిట్ అయ్యాయి. ఆ తర్వాత నటించిన తెలుగు చిత్రం ప్రిన్స్ మిశ్రమ స్పందనను తెచ్చుకుంది. ప్రస్తుతం అయిలాన్, మావీరన్ చిత్రాల్లో నటిస్తున్నారు. మావీరన్ చిత్రానికి మడోనా అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా శివ కార్తికేయన్ నటుడుగా 11 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. దీంతో మావీరన్ చిత్ర యూనిట్ షూటింగ్ స్పాట్‌లో శివకార్తికేయన్‌ను అభినందిస్తూ యూనిట్ సభ్యులు కేక్ కట్ చేసి సందడి చేశారు. కాగా, ప్రిన్స్ చిత్ర నిర్మాతలే ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. దీని తెలుగు వెర్షన్‌కు మహావీరుడు అనే టైటిల్‌ను నిర్ణయించారు.

రజనీ చిత్ర రీమేక్‌లో అజిత్



తమిళ సినిమా: హిట్ చిత్రాలను రీమేక్ చేయడం అనేది.. చాలా కాలం నుంచి జరుగుతున్న విషయమే. అలా వచ్చిన కొన్ని చిత్రాలు సక్సెస్ అయ్యాయి కూడా. ఉదాహరణకు గతంలో రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన బిల్లా చిత్రాన్ని అదే పేరుతో దర్శకుడు విష్ణువర్ధన్ చేశారు. రజనీకాంత్ పాత్రలో అజిత్ నటించి హిట్ కొట్టారు. తాజాగా మళ్లీ అలాంటి ప్రయత్నమే జరుగుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. రజనీకాంత్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ చిత్రం బాషా. ఒక సాధారణ యువకుడు పరిస్థితుల ప్రభావంతో ఎలా అండర్ వరల్డ్ డాన్‌గా మారాడో..? తిరిగి మళ్లీ ఎలా మంచిగా మారి జన స్రవంతిలోకి కలిసిపోయాడు? అన్న ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రం సంచలన విజయం సాధించింది. ఈ చిత్రం టాలీవుడ్‌లోనూ రజనీకాంత్‌కు స్టార్ ఇమేజ్‌ను తెచ్చిపెట్టింది. తాజాగా ఈ చిత్రానికి దర్శకుడు విష్ణువర్ధన్ కొన్ని చేర్పులు మార్పులు చేసి రీమేక్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తాజా సమాచారం. ఇందులోనూ అజిత్‌ను కథానాయకుడిగా నటింపజేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు టాక్. కాగా తుణివు చిత్రం తర్వాత అజిత్ తన 62వ చిత్రానికి సిద్ధమవుతున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి నయనతార భర్త విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించడానికి సిద్ధమయ్యారు. అయితే అనూహ్యంగా ఈ చిత్రం నుంచి దర్శకుడు విఘ్నేశ్ శివన్ వైదొలిగారు. అందుకు కారణం కథలో అజిత్ చెప్పిన మార్పులకు ఈయన అంగీకరించ పోవడమేనని సమాచారం. ఇప్పుడు అజిత్ చిత్రానికి మగిళ్ తిరుమేణి దర్శకత్వం వహించనున్నట్లు ప్రచారం జరుగుతుంది. కాగా తదుపరి విష్ణువర్ధన్ దర్శకత్వంలో బాషా చిత్ర రీమేక్‌లో నటించడానికి అజిత్ మరోసారి సాహసం చేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

వడచెన్నైకు సీక్వెల్



వాత్తి చిత్ర ఆడియో వేడుకలో ఇద్దరు కొడుకులతో ధనుష్

తమిళ సినిమా: ధనుష్ కథానాయకుడిగా తమిళం, తెలుగు భాషల్లో రూపొందుతున్న చిత్రం ధాత్రి. తెలుగులో సార్ అనే పేరును నిర్ణయించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నాగ వంశీ నిర్మించిన ఈ చిత్రానికి తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించారు. సంయుక్త నాయకిగా నటించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందించారు. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం 17వ తేదీన తెరపైకి రావడానికి ముస్తాబవుతుంది. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం చెన్నైలోని ఓ ప్రైవేట్ కళాశాల ఆవరణలో చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధనుష్ ప్రస్తుతం నటిస్తున్న కెప్టెన్ మిల్లుల చిత్ర గెటప్‌లో రావడం విశేషం. మరో విషయం ఏంటంటే ఆయన ఇద్దరు వారసులు లింగ, యాత్ర పాల్గొనడం మరో విశేషం. వేదిక ముందు ధనుష్‌కు ఇరువైపులా ఆయన కొడుకులు కూర్చోవడంతో ఫొటోగ్రాఫర్ల కెమెరాలు క్లిక్‌మనిపించాయి. కాగా వేదికపై ధనుష్ చిత్రంలోని పాటను పాడి అభిమానులను అలరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ చిత్ర కథను వెంకీ తనకు లాక్‌డౌన్ టైంలో చెప్పారన్నారు. కథ నచ్చడంతో ఓకే చెప్పానన్నారు. ఇది 1990లో జరిగే కథ చిత్రంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వడ చెన్నై పార్ట్- 2 ఉంటుందా..? అన్న ప్రశ్నకు బదులిస్తూ ఈ విషయం దర్శకుడు వెట్రిమారన్‌ను అడగాలని, అయితే సీక్వెల్ మాత్రం కచ్చితంగా ఉంటుందని స్పష్టం చేశారు.

అది చాలా గడ్డు కాలం



తమిళ సినిమా: తక్కువ సమయంలోనే అగ్ర కథానాయిక స్థాయికి చేరుకున్న నటి సమంత. యువ నటుల నుంచి స్టార్ నటుల వరకు సినిమాలు చేసిన సమంత.. ఆ తర్వాత లేడీ ఓరియంటెడ్ కథా చిత్రాలతో అదరగొట్టింది. ఇక ది ఫ్యామిలీ మన్- 2 వెబ్ సిరీస్‌లో నటించి జాతీయ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. అలాంటిది గత కొంత కాలంగా తాను మమోసైటిస్ వ్యాధిలో బాధపడుతున్నట్లు స్వయంగా వెల్లడించి అందరికీ షాక్ ఇచ్చింది. దీంతో ఆమె సన్నిహిత నటీనటులు, అభిమానులు ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు చేశారు. అయితే వారి ప్రార్థనలు ఫలించాయో, లేక తనలోని ఆత్మవిశ్వాసం గెలిచిందో గానీ, సమంత ఇప్పుడు చాలా వరకు కోలుకుంది. ఎంతగా అంటే మళ్లీ షూటింగ్లో పాల్గొనేంత. అయితే ఇందుకోసం సమంత గట్టిగానే శ్రమించింది. ఒక పక్క చికిత్స పొందుతూనే మరోపక్క వర్కౌట్స్ చేస్తూ తనను తాను తీర్చి దిద్దుకుంటోంది. దీంతో మళ్లీ కొత్త అవకాశాలు ఈమెను వెతుక్కుంటూ వస్తున్నాయి. ఇప్పటికే వెబ్ సిరీస్ షూటింగ్‌లలో పాల్గొంటోంది. అదేవిధంగా తన కారణంగా ఆగిపోయిన విజయ్ దేవరకొండ నటిస్తున్న ఖుషి చిత్రం త్వరలో మళ్లీ సెట్ పైకి వెళ్లనుంది. ఈ విషయాన్ని ఆ చిత్ర యూనిట్ వర్గాలే తాజాగా మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఇటీవల సమంత ఇన్‌స్టాగామ్‌లో ఒక ట్వీట్ పోస్ట్ చేసింది. అందులో తనకు తానే ధైర్యం చెప్పుకునే విధంగా ''నువ్వు త్వరలోనే పూర్తిగా కోలుకుంటావు. గడిచిన ఏడు, ఎనిమిది నెలలు నీకు చాలా గడ్డుకాలాన్ని అనుభవించావు. ఆ రోజుల్ని మర్చిపోకుండా గుర్తుంచుకో. నువ్వు చాలా శక్తివంతమైన అమ్మాయివి'' అని పేర్కొంది.

నయన్ సో స్వీట్



తమిళ సినిమా: నటి నయనతార సో స్వీట్ అని.. బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ కొనియాడారు. ఈయన తాజాగా నటించిన పఠాన్ చిత్రం ఇటీవల విడుదలై కలెక్షన్ల పరంగా బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోంది. కొద్దికాలంగా సక్సెస్ లేక కళ తప్పిన బాలీవుడ్‌కు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. కాగా ప్రస్తుతం ఆయన కథానాయకుడిగా నటిస్తున్న జవాన్ చిత్రంపై పఠాన్ ప్రభావం బాగానే ఉంటుందని చెప్పవచ్చు. ఇందులో షారుక్ ఖాన్ ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు సమాచారం. విషయం ఏమిటంటే ఈ చిత్రానికి కోలీవుడ్ యువ దర్శకుడు అట్లీ దర్శకత్వం వహించడం. సంచలన నటి నయనతార హీరోయిన్. దర్శకుడు అట్లీతో పాటు నయనతారకి బాలీవుడ్ ఎంట్రీ చిత్రం ఇదే. జవాన్ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. కాగా షారుక్ ఖాన్ ఇటీవల ట్విట్టర్ ద్వారా అభిమానులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా నటి నయనతార గురించి అభిమాని అడిగిన ప్రశ్నకు షారుక్ ఖాన్ బదిలిస్తూ ఆమె సో స్వీట్ అని పేర్కొన్నారు. ఆమెకు అనేక భాషలు తెలుసని జవాన్ చిత్రంలో నయనతారతో కలిసి నటించడం మంచి అనుభవమని పేర్కొన్నారు. ఈ చిత్రంలో ఆమె నటన అందరికీ నచ్చుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా ఈ చిత్రంలో నటుడు విజయ్ సేతుపతి, నటి ప్రియమణి, యోగిబాబు తదితరులు ముఖ్య పాత్రల్లో నటించడం విశేషం. ఇకపోతే జవాన్ నయనతార, దర్శకుడు అట్లీల బాలీవుడ్ భవిష్యత్‌ను నిర్ణయించే చిత్రం అవుతుంది విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా నయనతార ప్రస్తుతం తమిళంలో మరో రెండు కొత్త చిత్రాలు నటించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

పోలీసుల ఆదేశాలు బేఖాతరు

తిరువొత్తియూరు: నెల్లై జిల్లాలో ఇడిందకర్రై పవిత్ర లూర్థు మేరి ఆలయం ఉంది. ఈ ఆలయంలో ఏటా జెండా ఎగురవేసి 10 రోజులు ఉత్సవాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. జాలర్ల కోసం పడవల పోటీలు నిర్వహిస్తారు. కుమరి జిల్లా కోవలం సముద్ర తీరం నుంచి తిరువళ్లువర్ విగ్రహం ఉన్న బండ రాళ్ల వెనుక భాగం మార్గంగా ఇడిందకర్రై వరకు జరుగుతుంది. ప్రస్తుతం ఉత్సవాలు జరుగుతున్నాయి. జాలర్ల కోసం తెరచాప పడవ పోటీలు ఆదివారం జరగాల్సి ఉంది. అయితే సముద్ర ప్రాంతంలో తీవ్రమైన గాలులు వీస్తుండడంతో జాలర్లు చేపలు పట్టడానికి వెళ్లరాదని వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. తుపాన్ హెచ్చరిక కారణంగా కోవలం నుంచి పడవ పోటీ నడపడానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. అయితే పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేసి పడవ పోటీల్లో పాల్గొనడానికి ఆదివారం ఉదయం నుంచి నెల్‌లై జిల్లా నుంచి కొవలం సముద్ర తీరానికి పడవల్లో జాలర్లు వచ్చారు. దీంతో కన్యాకుమారి డీఎస్పీ రాజా ఆధ్వర్యంలో కోవలం సముద్ర తీరంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

యువకుడిపై పోక్సో కేసు

అన్నానగర్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. రాణిపేట జిల్లా వాలాజా తాలూకా తెన్ కండ పంతంగల్ ఏరికర్రై వీధికి చెందిన మణికంఠన్ (29) చెన్నైలోని ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. ఇతనికి రెండేళ్ల కుమారుడు, ఆరు నెలల కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం సమీప గ్రామానికి చెందిన బాలిక (13) సైకిల్‌పై అక్కడి దుకాణానికి వెళ్లింది. అటుగా వెళుతున్న మణికంఠన్ బాలికను అడ్రస్ అడుగుతున్నట్లు మాటలు కలిపాడు. బాలిక అడ్రస్ తెలియదని చెప్పి సైకిల్‌పై వెళ్లేందుకు ప్రయత్నించింది. మణికంఠన్ అకస్మాతుగా బాలికను బలవంతంగా ఎత్తుకెళ్లి సమీపంలోని ముళ్లపొదలో లైంగిక దాడి చేశాడు. ఆమె తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పగా వారు రాణిపేట మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాణిపేట ఇన్‌స్పెక్టర్ వాసుకి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి మణికంఠన్‌ను అరెస్టు చేశారు. అనంతరం వేలూరు పోక్సో కోర్టులో హాజరుపరిచి వేలూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

హైటెక్ మోసం

తిరువొత్తియూరు: మహిళను బురిడి కొట్టించి గూగుల్ పే ద్వారా ఆమె అకౌంట్ నుంచి రూ. 1.60 లక్షలు కాజేశారు. వివరాలు. చెన్నై పులియంతోప్పు శ్రీనివాసన్ వీధికి చెందిన రమేష్ (48) పానీపూరి వ్యాపారం చేస్తున్నాడు. ఇతని భార్య వలర్మతి (42). వీరు తమ ఇంటిలో ఓ భాగాన్ని అద్దెకు ఇస్తున్నట్లు ఓఎల్ఎక్స్‌లో ప్రకటన ఇచ్చారు. శుక్రవారం వలర్మతికి ఫోన్ చేసిన వ్యక్తి తాను రాజస్థాన్ నుంచి మాట్లాడుతున్నాని.. తన పేరు భవానీసింగ్ అని పరిచయం చేసుకున్నాడు. సైనిక అధికారిగా చెన్నైకి బదిలీ అవుతున్నానని, ఓఎల్ఎక్స్‌లో మీ ప్రకటన చూశానని తెలిపారు. ఇంటిని అద్దెకు తీసుకుంటానని ఇంటిని ఫొటో తీసి పంపమని కోరాడు. దీంతో వలర్మతి ఇంటిని ఫొటో తీసి అతనికి పంపించింది. అడ్వాన్స్ చెల్లిస్తానని.. ఇందు కోసం ముందుగా తనకు గూగుల్ పే ద్వారా రూపాయి పంపించమని కోరాడు. దీంతో వలర్మతి అతని అకౌంట్‌కు పంపించారు. తరువాత వలర్మతి అకౌంట్ వివరాలు తెలుసుకున్న అతను వలర్మతికి ఓ లింకు పంపాడు. ఆ లింకును టచ్ చేయగానే ఆమె అకౌంట్ నుంచి రూ.1.60 లక్షలు డెబిట్ అయ్యింది. దిగ్భ్రాంతి చెందిన వలర్మతి దీని గురించి బేసిన్‌బ్రిడ్జ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేశారు.

బిట్ కాయిన్ పేరుతో..

తిరువొత్తియూరు: తూత్తుకుడి జిల్లాలో బిట్ కాయిన్ పేరుతో రూ. 12 లక్షలు మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. విలాత్తికులంవావల్ తొత్తియ ప్రాంతానికి చెందిన రామర్ (48) ఫేస్‌బుక్‌కు బిట్‌కాయిన్ ఇన్వెస్ట్‌మెంట్‌పై ప్రకటన వచ్చింది. రామర్ అందులో ఉన్న లింకును ఓపెన్ చేసి వారు తెలిపినట్టు రూ. 12,10,740 డిపాజిట్ చేశాడు. ఆ తరువాత ఎలాంటి సమాచారం అందలేదు. దీంతో మోసపోయినట్టు గుర్తించిన రామర్ దీనిపై ఎన్‌సీఆర్‌బీలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి మోసం చేసిన వ్యక్తి కోసం గాలింపు చేపట్టారు. విచారణలో రామర్‌ను మోసం చేసింది కోవై చిన్ని పాళయంకు చెందిన సమీరాజిన్ కుమారుడు కరుణాకరణ్ (32) అని తెలిసింది. దీంతో పోలీసులు కరుణాకరన్‌ను అరెస్టు చేశారు. అతని అకౌంటు నుంచి రూ. 10 లక్షలు నగదు బ్లాక్ చేసి విచారణ చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ హత్య

తిరువొత్తియూరు: కరూర్ జిల్లాలో ఆటో డ్రైవర్ శనివారం రాత్రి హత్యకు గురయ్యాడు. వివరాలు.. రామనూర్‌కు చెందిన వడివేల్ (50) ఆటో డ్రైవర్. 32వ వార్డు అన్నాడీఎంకే కార్యదర్శి. కరూర్ ముత్తురాజపురానికి చెందిన మహాదేవన్ (45) ఆటో డ్రైవర్. వీరిద్దరూ స్నేహితులు. వడివేలుకు కుటుంబ ఖర్చులకు రూ.5 వేలు అవసరమైంది. దీంతో మహాదేవన్ వద్ద అప్పుడు అడగడానికి శనివారం అతనికి రెండుసార్లు ఫోన్ చేశాడు. కానీ అతను ఫోన్ ఎత్తలేదు. దీంతో సందేహపడి మహాదేవన్‌ను కలిసేందుకు బైకుపై ముత్తురాజపురానికి వెళ్లాడు. మార్గమధ్యలో ఓ టీ దుకాణం వద్ద నిలబడి ఉన్న మహాదేవన్‌ను చూసిన వడివేల్ ఫోన్ ఎందుకు తీయలేదని ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మహాదేవన్ తన ఫోన్‌ను టీ దుకాణంలో పొగొట్టుకున్నాడు. సెల్‌ఫోన్ కోసం తిరిగి టీ దుకాణం వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో వడివేలుకు మహాదేవన్‌కు మళ్లీ గొడవ జరిగింది. శనివారం రాత్రి బైకుపై వడివేలు వెళుతున్న సమయంలో అతన్ని అడ్డుకున్న ముగ్గురు రౌడీలు కత్తులతో దాడి చేశారు. దీంతో వడివేలు మృతి చెందాడు. పశుపతి పాళయం పోలీసులు కేసు నమోదు చేసి మహాదేవన్ హత్య చేయించాడా అనే కోణంలో విచారణ చేస్తున్నారు.



- తమిళ్ మగన్ హుస్సేన్ తీరుపై 'పన్నీరు' ఆగ్రహం
- మళ్లీ మొదటికి రెండాకుల గుర్తు వివాదం

మేం ఒప్పుకోం..!

సాక్షి, చెన్నై: సర్వసభ్య సమావేశం సభ్యుల మద్దతు కోసం అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్ పంపిన దరఖాస్తును ఆ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శిబిరం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇందులో ఏక పక్షంలో అభ్యర్థి పేరును సూచించారని, తమ మద్దతుదారు పేరు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు.. ఈరోడ్ తూర్పు నియోజకవర్గం ఉప ఎన్నికల్లో శనివారం నాటికి 46 మంది నామినేషన్లు వేశారు. ఇందులో కాంగ్రెస్, డీఎండీకే, నామ్ తమిళర్ కట్చి, అమ్మమక్కల్ మున్నేట్ర కళగం అభ్యర్థులు కూడా ఉన్నారు. అయితే అన్నాడీఎంకేలో విభేధాల నేపథ్యంలో ఆ పార్టీలోని తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణి స్వామి, సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శిబిరాలకు చెందిన అభ్యర్థులు ఇంత వరకు నామినేషన్లు దాఖలు చేయలేదు. మంగళవారంతో నామినేషన్లు ముగియనున్నాయి. ఈ పరిస్థితుల్లో రెండాకుల చిహ్నం వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు సర్వ సభ్య సమావేశం సభ్యుల మద్దతు సేకరణకు అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్ శనివారం చర్యలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తును సిద్ధం చేశారు. ఆదివారం రాత్రిలోపు ఈ దర ఖాస్తులను పూర్తి చేసి సమర్పించాలని సర్వసభ్య సమావేశం సభ్యులకు సమాచారం పంపించారు. మెజారిటీ మద్దతు అనుగుణంగా ఎన్నికల కమిషన్ ను సోమవారం కలిసేందుకు తమిళ్ మగన్ హుస్సేన్ సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో ఆ దరఖాస్తుకు వ్యతిరేకంగా పన్నీరు సెల్వం శిబిరం ఆదివారం గళం విప్పింది.

తీవ్ర వ్యతిరేకత..

దరఖాస్తును ఏక పక్షంగా సిద్ధం చేశారని పన్నీరు శిబిరం నేతలు బన్రూటి రామచంద్రన్, వైద్యలింగం ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్ వేస్ రోడ్డులోని పన్నీరు సెల్వం ఇంట్లో జరిగిన సమావేశం అనంతరం మీడియాతో వారు మాట్లాడారు. ఆ దరఖాస్తులో పళణిస్వామి ప్రకటించిన అభ్యర్థి తెన్నరసు పేరును మాత్రం సూచించారని, తమ అభ్యర్థి పేరును నమోదు చేయలేదని మండిపడ్డారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా తమిళ్ మగన్ హుస్సేన్ వ్యవహరిస్తున్నారని, ఈ దరఖాస్తును తాము అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై ఫిర్యాదు చేయాల్సిన చోట ఫిర్యాదు చేస్తామన్నారు. ఇదిలా ఉండగా, అన్నాడీఎంకేలోని సర్వసభ్య సభ్యుల్లో పళణి స్వామి శిబిరానికి 2,662 మంది మద్దతు ఉంది. అలాగే ముగ్గురు ఎంపీలు, 61 మంది ఎమ్మెల్యేలు, 70 మంది జిల్లాల కార్యదర్శుల మద్దతు కూడా ఆయన ప్రకటించిన అభ్యర్థి తెన్నరసుకే ఉండడం గమనార్హం. ఇక, పన్నీరు సెల్వం శిబిరానికి 148 మంది సర్వసభ్య సభ్యులు, ఇద్దరు ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు , ఐదుగురు జిల్లాల కార్యదర్శుల మద్దతు మాత్రమే ఉండడం గమనార్హం. మద్దతు తక్కువగా ఉన్నా, రెండాకుల వివాదాన్ని మళ్లీ మొదటికి తెచ్చే విధంగా దరఖాస్తును అస్త్రంగా చేసుకుని ఫిర్యాదు చేయడానికి పన్నీరు శిబిరం సిద్ధం అవుతోండడం అన్నాడీఎంకేలో ఆసక్తి రేపుతోంది.

ప్రియుడిని దక్కించుకునేందుకు..

లైంగిక దాడి నాటకం!

- ఐటీ ఉద్యోగిని గుట్టురట్టు
- పోలీసులను పరుగులు తీయించిన ఫిర్యాదు
- సీసీ కెమెరాల ద్వారా వెలుగులోకి యువతి బాగోతం

సాక్షి, చెన్నై: ప్రేమించిన ప్రియుడిని దక్కించుకునేందుకు ఓ యువతి రచించిన లైంగిక దాడి నాటకం అందరినీ విస్మయానికి గురి చేసింది. రాత్రంతా పోలీసులకు కంటి మీద కునుకు లేకుండాచేసింది. వివరాలు.. కాంచీపురం జిల్లాపాలవాక్కం పరిధిలో శనివారం రాత్రి ఓ యువతి రక్తగాయాలైన స్థితిలో పరుగులు తీస్తూ ఓ ఇంట్లోకి చొరబడింది. తనపై నలుగురు వ్యక్తులు సామూహికంగా లైంగిక దాడి చేసినట్లు ఆ యువతి పేర్కొనడంతో ఆ ఇంట్లో ఉన్న వారు పోలీసులకు సమాచారం అందించారు. చెంగల్పట్టు రైల్వే స్టేషన్ నుంచి తనను కిడ్నాప్ చేసినట్లు ఆ యువతి పోలీసుల దృష్టికి తీసుకెళ్లి అడ్డంగా బుక్కైంది. ఆ యువతిని ఆస్పత్రికి తరలించిన పోలీసులు చెంగల్పట్టు రైల్వేస్టేషన్ పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇదే సమయంలో యువతిపై సామూహిక లైంగిక దాడి సమాచారం మీడియాల్లో హల్‌చల్ కావడంతో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు రాత్రంతా గాలించారు.

అడ్డంగా బుక్కైంది..

చెంగల్పట్టు రైల్వే స్టేషన్ నుంచి ఆ యువతి ఓ యువకుడితో మోటారు సైకిల్‌పై వెళ్తున్న దృశ్యం ఓ చోట సీసీ కెమెరాలో కనిపించింది. ఉత్తర మేరు వైపుగా వెళ్లడం, కాసేపటికి లైంగిక దాడి జరిగినట్లు పాలవాక్కంలో ఆమె పరుగులు తీయడం పోలీసుల్లో అనుమానాల్ని రెకెత్తించాయి. ఆ యువతి కొందరు యువకుల పేర్లను విచారణలో వెల్లడించడంతో వారి సెల్ నంబర్లను పోలీసులు ట్రాప్ చేసే ప్రయత్నం చేశారు. ఆ యువకులు కన్యాకుమారి, మదురై, ఉత్తర చెన్నై పరిధిలో ఉండటంతో మరింత అనుమానాలు నెలకొన్నాయి. సంఘటన జరిగిన సమయం నుంచి ఆ యువకులు కన్యాకుమారి, మదురైకు వెళ్లాలంటే, కనీసం ఏడెనిమిది గంటలు పట్టే అవకాశం ఉంది. దీంతో మోటారు సైకిల్‌పై వెళ్లిన యువకుడు సలీంను అదుపులోకి తీసుకుని విచారించగా, ఆ యువతి రచించిన నాటకం వెలుగులోకి వచ్చింది. ఐటీ ఉద్యోగిగా ఉన్న ఆ యువతి సలీం అనే యువకుడిని ప్రేమించింది. మూడు నెలలుగా ఈ ఇద్దరు కలిసి తిరుగుతున్నాయి. ఈ సమయంలో తనను పెళ్లి చేసుకోవాలని సలీంపై ఆమె ఒత్తిడి పెంచింది. సలీం దాట వేస్తూ రావడంతో అతడిని దక్కించుకునేందుకు లైంగిక దాడి పేరిట, సలీంతో పాటు అతడి మిత్రులను ఇరికించే ప్రయత్నం చేసి అడ్డంగా బుక్కైంది. ఆదివారం ఆమెను ఆసుపత్రి నుంచి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు. సలీంను కూడా ప్రశ్నిస్తున్నారు. కాంచీపురం ఎస్పీ సుధాకర్ మీడియాతో మాట్లాడుతూ, ఆ యువతి నాటకం గురించి వివరించారు. ఆ యువతి ఇచ్చిన ఆధారంగా నలుగురు యువకుల పోన్‌లను ట్రాప్ చేయగా, వారంతా వేరువేరు చోట్ల ఉన్నట్లు తేలిందన్నారు. దీంతో అనుమానం వచ్చి విచారించడంతో యువతి నాటకం బయటపడిందని వెల్లడించారు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరిట మోసం

-ఆరుగురి అరెస్టు

అన్నానగర్: ప్రభుత్వ ఉద్యోగాలు తీసిస్తానని నమ్మించి లక్షలు వసూలు చేసిన కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. కోయంబత్తూరు కోవిల్ పాళయం సమీపంలోని కొండయాంపాళానికి చెందిన చందనకృష్ణన్ (56) తన కుమార్తెకు ఉద్యోగం వెతుకుతున్నాడు. ఈ క్రమంలో అతని ఇంటి సమీపంలో ఉంటున్న ఏడుగురు వ్యక్తులు తాము ప్రభుత్వ డ్రైవర్లమని పరిచయం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగం తీసిస్తామని చెప్పారు. దీనిని నమ్మిన చందన కృష్ణన్ తన కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని కోరాడు. ఉన్నతాధికారులకు కొంత మొత్తం చెల్లించాలని చెప్పి గత ఏడాది మే నుంచి ఆగస్టు వరకు వివిధ వాయిదాల్లో రూ.21 లక్షలు వసూలు చేశారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్ కూడా ఇచ్చారు. అయితే అది నకిలీదని తేలింది. దీంతో షాక్‌కు గురైన చందనకృష్ణన్ కోయంబత్తూరు క్రైం బ్రాంచ్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు జవహర్‌ప్రసాద్ (29), అన్బుప్రసాద్ (39), ఎస్ఎస్ శరవణకుమార్ (33), సతీష్‌కుమార్ (33), సుధాకర్ (37), సురేంద్రన్ (34), జి.శరవణకుమార్‌గా గుర్తించారు. కోయంబత్తూరులోని ఓ మిల్లులో పని చేస్తున్నప్పుడు స్నేహితులయ్యారు. తరువాత మిల్లు ఉద్యోగం మానేసిన ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వీరిలో సుధాకర్, సురేంద్రన్ అన్నదమ్ములు. కోయంబత్తూరులో తలదాచుకున్న జవహర్ ప్రసాద్, అన్బుప్రసాద్, ఎస్ఎస్ శరవణకుమార్, సతీష్‌కుమార్, సురేంద్రన్, సుధాకర్‌లను శనివారం అరెస్టు చేశారు.

డెంటల్ విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: డెంటల్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన పళ్లికరణైలో చోటుచేసుకుంది. వివరాలు.. మేంగువంగాలమ్‌కి చెందిన అమిత్ మిశ్రా కుమార్తె శ్వేతా మిశ్రా (23) పళ్లికరణైలోని ఓ దంత వైద్య కళాశాలలో చదువుతోంది. ఈమె చెల్లెలు సినేయా మిశ్రా కాట్టాం గళత్తూరులోని ఓ ప్రైవేట్ కాలేజీలో బీటెక్ చేస్తూ హాస్టల్‌లో ఉంటోంది. శనివారం మధ్యాహ్నం యువతి తండ్రి శ్వేతా మిశ్రా సెల్‌ఫోన్‌లో మాట్లాడాడు. శనివారం రాత్రి 9 గంటలకు అక్కను చూసేందుకు సినేయా ఇంటికి వచ్చింది. ఇంటికి తాళం వేసి ఉంది. మరో తాళపు చెవితో తలుపు తెరిచి లోపలికి వెళ్లింది. శ్వేతా మిశ్రా ఉరివేసుకుని ఉండడం చూసి షాక్‌కు గురైంది. సమాచారం అందుకున్న పళ్లికరణై పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్వేతా మిశ్రా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం క్రోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుందా? మరేదైనా కారణమా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డులోకి చెన్నై విద్యార్థికి చోటు



ధ్రువీకరణపత్రంతో డివిజ్ ఖుల్లార్

సాక్షి, చెన్నై : విద్యార్థి దశలోనే దంత వైద్య సేవల్లో చేసిన ప్రయోగాలు విజయవంతం కావడంతో చెన్నైకు చెందిన డివిజ్ ఖుల్లార్ అనే విద్యార్థి ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నాడు. చెన్నైకు చెందిన ఖుల్లార్ సవీత దంత వైద్య కళాశాలలో ప్రోస్టోడాంటిక్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో 45 మంది రోగులకు దంత వైద్య పరిశోధన, శస్త్ర చికిత్సలను విజయవంతం చేశాడు. ఈ రోగులకు పూర్తిస్థాయిలో దంతాలను అమర్చి వారి ముఖాల్లో చిరునవ్వులు తెప్పించాడు. దంతాలను కోల్పోయిన ఈ రోగులకు అన్ని దంతాలు పునరుద్ధరించేందుకు 14 సిట్టింగ్(అపాయింట్‌మెంట్)లు అవసరమయ్యాయి. అలాగే, బహుళ ప్రయోగశాల సాంకేతిక నిపుణులతో కూడిన విస్తృతంగా పరిశోధనలు చేశాడు. 45 మందికి దంతాలను అమర్చి ప్రతిభ చూపాడు. ప్రోస్టోడాంటిక్ కన్సల్టెంట్‌లు కూడా వారి జీవితకాలంలో ఈమేరకు చికిత్స అందించేందుకు వీలు కలిగిఉండేది కాదు. అయితే, డాక్టర్.ఖుల్లర్ వివిధ రకాల టూత్ సపోర్ట్, టూత్ – టిష్యూ సపోర్ట్, ఫుల్ మౌత్ ఇంప్లాంట్ సపోర్ట్, టూత్ – ఇంప్లాంట్ సపోర్టెడ్ కేసులను విజయంతం చేయడంతో ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నాడు. ఈమేరకు రికార్డు సంస్థ అందజేసిన సర్టిఫికెట్లను ఆదివారం ఆ విద్యా సంస్థ చాన్స్‌లర్ వీరయ్యన్, డైరెక్టర్ దీపక్, డీన్ అరవింద్‌కుమార్‌కు అందజేశాడు. ఈసందర్భంగా ఖుల్లార్‌ను ఘనంగా సత్కరించారు. డాక్టర్ దీపక్ నల్లస్వామి మాట్లాడుతూ, డివిజ్ సాధించిన విజయం తమ విద్యా సంస్థకు గర్వకారణమన్నారు. నాణ్యమైన విద్య, శిక్షణ, ప్రోత్సాహానికి ఎప్పుడూ తాము ముందుంటామన్నారు. అరవింద్ కుమార్ మాట్లాడుతూ, ఈ విజయం భారతీయ డెంటల్ కమ్యూనిటీకి గర్వకారణం పేర్కొన్నారు.

బ్యాంకులో దోపిడీకి యత్నం

అన్నానగర్: తిరుపూర్ జిల్లా తారాపురం సమీపంలోని అలంగియంలో కెనరా బ్యాంకు ఉంది. శనివారం మధ్యాహ్నం ఉద్యోగులు విధుల్లో ఉండగా ఓ విద్యార్థి ఖాతాదారుడిగా బ్యాంకులోకి ప్రవేశించాడు. ముసుగు వేసుకుని మాస్క్, గ్లౌజులు ధరించి తుపాకీ, కత్తితో బెదిరించడం ప్రారంభించాడు. చేతిలో టైం బాంబ్ కూడా ఉందని, శబ్దం చేస్తే పేల్చేస్తానని బెదిరించాడు. ఇంతలో బ్యాంకు వద్దకు వచ్చిన ఓ వృద్ధుడు తాను వేసుకున్న టవల్‌ను తీసుకుని దొంగ మెడకు చుట్టి కింద పడేసి దేహశుద్ధి చేశాడు. ఆ విద్యార్థి డమ్మీ తుపాకీ, టైం బాంబ్‌తో బెదిరించి దోపిడీకి యత్నించినట్లు వెలుగులోకి వచ్చింది. ఆ విద్యార్థి నివిచారించగా తారాపురం అలంగియం గాంధీనగర్‌కు చెందిన సురేష్ (19)గా గుర్తించారు. బ్యాంక్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి అతడిని అరెస్టు చేశారు. విద్యార్థి సురేష్‌ను పట్టుకున్న వృద్ధుడిని అభినందించారు.

యువకుడి నుంచి రూ.20 లక్షలు స్వాధీనం

అన్నానగర్: చెన్నై షావుకారుపేటలోని తంగసాలై వీధిలో థౌజండ్‌లైట్స్ పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా బ్యాగుతో వచ్చిన యువకుడిని విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా అందులో రూ.20 లక్షలు ఉన్నట్లు తెలిసింది. విచారణలో అతను స్వరూప్ (20)అని.. తంగసాలై ప్రాంతంలోని ఓ ఎలక్ట్రికల్ షాపులో పని చేస్తున్నట్లు గుర్తించారు. డబ్బుకు సంబంధించిన ఎలాంటి పత్రం లేకపోవడంతో నుంగంబాక్కంలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులకు స్వరూప్, డబ్బును అందించారు. స్వరూప్‌ను విచారిస్తున్నారు.

పాలారులో చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న పీఎంకే జిల్లా కార్యదర్శి ఇళవయగన్

వేలూరు: పాలారులో రెండు కిలోమీటర్లకు ఒక చెక్ డ్యామ్ నిర్మించి జిల్లాలోని రైతులను ఆదుకోవాలని పీఎంకే పార్టీ జిల్లా కార్యదర్శి ఇళవయగన్ అన్నారు. వేలూరులోని ప్రైవేటు కల్యాణ మండపంలో ఆ పార్టీ యువజన విభాగం జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. ప్రతి వార్డు, ప్రతి పంచాయతీలో బూత్ కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. పాలారులో మూడేళ్లుగా వర్షపు నీరు వృథాగా పోతోందని.. ఆంధ్ర తరహాలో పాలారులో చెక్‌డ్యామ్‌లు ఏర్పాటు చేస్తే రైతులతో పాటు సమీపంలోని ప్రజలు తాగునీటి ఇబ్బందులు లేకుండా జీవిస్తారన్నారు. వేలూరు కార్పొరేషన్‌లోని అన్ని వార్డుల్లో భూగర్భ డ్రైనేజీ పనులు చేయాలన్నారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి జగన్, నాయకులు శరవణన్, దురైరాజ్, వెంకటేశన్ పాల్గొన్నారు.

కవితాదత్‌కు ఘన సత్కారం



కవితాదత్‌ని సత్కరిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

కొరుక్కుపేట: తమిళనాడుకు వియాత్నం దేశ రాయబారిగా నియమితులైన కేసీపీ సిమెంట్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వెలగపూడి కవితా దత్‌ను ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) తరఫున ఘనంగా సత్కరించారు. డబ్ల్యూటీఎఫ్ అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరాదత్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కవితా దత్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఆమె ఇలాంటి పదవులు మరెన్నో అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం కవితాదత్ మాట్లాడుతూ.. అందరి అభిమానం, తన తల్లిదండ్రులు వీఎల్. దత్, ఇందిరాదత్ ఆశీస్సులతోనే తమిళనాడుకు వియత్నాం రాయబారిగా గౌరవం దక్కిందన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు, ముఖ్యంగా తమిళనాడుకు వియత్నాం దేశంతో వాణిజ్య, పారిశ్రామిక, విద్యా రంగాలల్లో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. యువతకు వ్యాపార, పారిశ్రామిక, విద్యారంగాలో అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డబ్ల్యూటీఎఫ్ కార్యదర్శి శ్రీలక్ష్మి మోహనరావు, శివర్మప్రసాద్, జేఎం నాయుడు, బేతిరెడ్డి శ్రీనివాస్, సురేష్ బాబు, శివకుమారి, టి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమరయోధులను స్మరించుకుందాం



తిరుమల నాయకర్‌కు నివాళులర్పిస్తున్న సీఎంకే రెడ్డి, తదితరులు

కొరుక్కుపేట: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతీ భారతీయుడి కర్తవ్యం అని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షుడు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి అన్నారు. దక్షిణ భారత దేశాన్ని పరిపాలించిన చక్రవర్తి తిరుమల నాయకర్ జయంతిని మదురైలోని మన్నర్ మహల్‌లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సీఎంకే రెడ్డితో పాటు ఏఐటీఎఫ్ ఉపాధ్యక్షుడు సీఎం కిషోర్, ఏఐటీఎఫ్ ప్రధాన కార్యదర్శి నాయకర్ నందగోపాల్ తిరుమల నాయకర్, వీరపాండి కట్టబొమ్మన్ విగ్రహాలకు నివాళులర్పించారు.

ప్రియురాలి కిడ్నాప్

-అడ్డొచ్చిన ఆమె తల్లిదండ్రులపై దాడి

అన్నానగర్: కరూర్ జిల్లా పాత జయంకొండాం సమత్తువపురానికి చెందిన తంగవేల్ కుమారుడు కార్తీక్ (21) అదే ప్రాంతానికి చెందిన యువతి (21)ని రెండేళ్లుగా ప్రేమిస్తున్నాడు. ఈ విషయం స్నేహ తల్లిదండ్రులకు తెలియడంతో దేవాచి కౌండన్ పుదూర్‌కు చెందిన బంధువు యువకుడితో జనవరి 27వ తేదీ పళనిలో వివాహం చేశారు. పెళ్లి విషయం కార్తీక్‌కు తెలియడంతో దిగ్భ్రాంతి చెందాడు. కులతుపట్టికి చెందిన అతని సోదరుడు శక్తివేల్, జీవానందంను తీసుకుని దేవాచి కౌండన్ పుదూరులోని ప్రియురాలి ఇంటికి శనివారం వెళ్లాడు. అనంతరం కారులో తన ప్రియురాలిని బలవంతంగా ఎత్తుకెళుతుండగా యువతి తల్లిదండ్రులు, బంధువులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిపై కార్తీక్, అతని సోదరుడు శక్తివేల్ దాడి చేసి వెళ్లిపోయారు. మాయనూరు పోలీసులు కేసు నమోదు చేసి శక్తివేల్, జీవానందంను అరెస్టు చేశారు. కార్తీక్ కోసం గాలిస్తున్నారు.

ప్లాస్టిక్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

తిరువొత్తియూరు: శీర్గాళిలోపి ప్లాస్టిక్ గోడౌన్‌లో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. రూ. 50 లక్షల విలువ కలిగిన వస్తువులు దగ్ధం అయ్యాయి. మయిలాడుదురై జిల్లా శీర్గాళి, స్వామినాథశెట్టి వీధికి చెందిన తిరుజ్ఞానం (65) శీర్గాళి పాత బస్ నిలయం వద్ద ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ మేట్స్ తదితర వస్తువులు విక్రయిస్తున్నాడు. ఇంటి మిద్దెపై ప్లాస్టిక్ వస్తువులను స్టాక్ చేసి ఉన్నారు. ఈ గోడౌన్‌లో ఆదివారం ఉదయం హఠాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం మేరకు శీర్గాళి పూంబుహార్ అగ్నిమాపక సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ. 50 లక్షల విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి.

చోరీ సొత్తు అప్పగింత



నగలను బాధితులకు అందజేస్తున్న పోలీసు కమిషనర్ శంకర్ జివాల్

కొరుక్కుపేట: చెన్నై పరిధిలోని స్టేషన్లలో చోరీలకు గురైన వస్తువులను శనివారం రాత్రి యజమానులకు అందజేశారు. చెన్నై మహానగరంలో క్రిమినల్ కేసుల్లో రూ.19.29 కోట్ల విలువైన 53.2 కిలోల బంగారు ఆభరణాలు, రూ. 2.70 కోట్ల నగదు, 1,487 సెల్ ఫోన్లు, 425 ద్విచక్ర వాహనాలు, 31 ఆటోలు, 18 నాలుగు చక్రాల వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వాటిని చెన్నై నగర పోలీస్ కమిషనర్ శంకర జివాల్ యజమానులకు అప్పగించారు.



వాణిజయరాం పార్థివ దేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న బంధువులు

నివాళి అర్పించేందుకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



గగనానికి.. గాన శిఖరం

సుప్రసిద్ధ గాయని వాణీజయరాం అంత్యక్రియలు ఆదివారం స్థానిక బీసెంట్ నగర్‌లోని శ్మశానవాటిలో నిర్వహించారు. అంతకు ముందు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆమె భౌతికకాయానికి నివాళి అర్పించి.. సంగీతానికి ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. - తమిళ సినిమా



అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు




నివాళులు అర్పించేందుకు వచ్చిన నటి సచ్చు

పరవళ్లతో పునరుజ్జీవం

వర్షాభావం, ఇసుక తవ్వకాలతో ఇప్పటివరకు జీవం కోల్పోయిన 'వేదవతి'

- నాలుగేళ్లుగా పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలతో జలకళ
- అటు కర్ణాటక.. ఇటు రాష్ట్రంలో నదీ గర్భంలో సబ్ సర్ఫేస్ డ్యామ్‌ల నిర్మాణం
- వీటితో నది గర్భంలోకి ఇంకిన వర్షపు నీరు..ఇసుక తవ్వకాల నియంత్రణతో పరుగులు తీసిన వేదవతి..89 ఏళ్ల తర్వాత నిండిన వాణీవిలాస రిజర్వాయర్
- అలాగే, దశాబ్దం తర్వాత బీటీ ప్రాజెక్టు కళకళ
- బీటీపీ సామర్థ్యం కంటే అధికంగా 63 టీఎంసీల ప్రవాహం
- వర్షాకాలం, వరద ప్రవాహం ముగిసినా నేటికీ కొనసాగుతున్న సహజసిద్ధ ప్రవాహం
- వేదవతి జీవం పోసుకున్నట్లేనంటున్న పర్యావరణవేత్తలు



సాక్షి, అమరావతి: దశాబ్దాలుగా ఇసుక మేటలతో ఎడారిని తలపించిన వేదవతి నది ప్రస్తుతం జలకళ సంతరించుకుంది. గతేడాది ఆగస్టు 3 నుంచి ఈ ఏడాది జనవరి 9 వరకూ అంటే.. 159 రోజులపాటు కర్ణాటకలోని వాణీవిలాస రిజర్వాయర్.. రాష్ట్రంలోని అనంతపురం జిల్లా భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ)ల గేట్లను ఎత్తేశారంటే.. వేదవతి ప్రవాహ ఉధృతి ఏ స్థాయిలో సాగిందో అంచనా వేసుకోవచ్చు. వాణీవిలాస రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 30.422 టీఎంసీలైతే.. ఆ రిజర్వాయర్‌లోకి 78.32 టీఎంసీల ప్రవాహం వచ్చింది. ఆయకట్టుకు నీళ్లందిస్తూ.. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేస్తూ.. గేట్లు ఎత్తి దిగువకు 32.179 టీఎంసీలు విడుదల చేశారు. వాణీవిలాస రిజర్వాయర్‌కు 109 కి.మీల దిగువన.. కర్ణాటక సరిహద్దుకు 1.5 కి.మీల దూరంలో అనంతపురం జిల్లాలో గుమ్మఘట్ట మండలంలో రెండు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ)లోకి 2022 ఆగస్టు 3 నుంచి జనవరి 9 వరకూ 65.63 టీఎంసీల ప్రవాహం వస్తే.. ఆయకట్టుకు నీళ్లందిస్తూ, ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేస్తూ 62 టీఎంసీలను దిగువకు వదిలేశారు. ఆ జలాలు తుంగభద్ర మీదుగా శ్రీశైలం రిజర్వాయర్‌కు చేరాయి. అంటే.. బీటీపీ సామర్థ్యం కంటే 63 టీఎంసీలు ఎక్కువ వచ్చినట్లు స్పష్టమవుతోంది.


భైరవానితిప్ప ప్రాజెక్టు

89 ఏళ్ల తర్వాత నిండిన 'వాణీవిలాస'

- ఇక వేదవతిపై కర్ణాటకలో 1907లో నిర్మించిన వాణీవిలాస రిజర్వాయర్ 1933, సెప్టెంబరు 2న నిండింది. ఆ తర్వాత గతేడాది ఆగస్టు 3న అంటే 89 ఏళ్ల తర్వాత నిండింది. దాంతో 50 వేల ఎకరాలకు ఖరీఫ్‌లో నీళ్లందించారు.
- ఇక అనంతపురం జిల్లాలో బీటీపీ ప్రాజెక్టు దశాబ్దం తర్వాత నిండింది. గతేడాది ఆగస్టు 8న 55,574 క్యూసెక్కుల ప్రవాహం డ్యామ్‌లోకి వచ్చింది. డ్యామ్ చరిత్రలో అంటే 1961 నుంచి ఇప్పటివరకూ గరిష్ట వరద ఇదే.
- వర్షాకాలం ముగియడంతో వరద ప్రవాహం నవంబర్‌లోనే తగ్గింది. ఆ తర్వాత నదిలో సహజసిద్ధ ప్రవాహం ప్రారంభమై.. ఇప్పటికీ కొనసాగుతోంది. దీన్నిబట్టి చూస్తే.. వేదవతి పునరుజ్జీవం పోసుకున్నట్లేనని పర్యావరణ వేత్తలు విశ్లేషిస్తున్నారు.

సబ్‌సర్ఫేస్ డ్యామ్‌లు, ఇసుక తవ్వకాల నియంత్రణతో..

- కృష్ణా నదికి కోయినా, మలప్రభ, ఘటప్రభ, బీమా, తుంగభద్ర, మూసీ, పాలేరు, మున్నేరులతోపాటు వేదవతి కూడా ప్రధాన ఉప నది. కర్ణాటకలో చిక్‌మగళూరు జిల్లాలోని పశ్చిమ కనుమల్లో చంద్రవంక పర్వత శ్రేణుల్లో వేద, అవతి నదులు పురుడుపోసుకుని.. పుర వద్ద రెండు నదులు కలిసి వేదవతిగా మారి కర్ణాటకలో తుమకూరు, చిత్రదుర్గ, బళ్లారి.. రాష్ట్రంలో అనంతపురం, కర్నూల్ జిల్లాల మీదుగా 391 కి.మీలు ప్రవహించి.. బళ్లారి జిల్లా సిరిగుప్ప వద్ద తుంగభద్రలో కలుస్తుంది.
- కృష్ణా నదీ పరివాహక ప్రాంతం (బేసిన్) మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో 2,58,948 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించగా.. అందులో వేదవతి బేసిన్ విస్తీర్ణం 23,590 చ.కి.మీలు (9.1 శాతం).
- వేదవతి జన్మించే చంద్రవంక పర్వతాల్లోనూ.. ప్రవహించే హగరి లోయలోనూ వర్షాభావ పరిస్థితులవల్ల ప్రవాహం లేక ఇసుక మేటలతో జీవం కోల్పోయింది. దాంతో ఎగువ నుంచి వేదవతి ద్వారా కృష్ణా నదిలోకి పెద్దగా వరద ప్రవాహం చేరడంలేదు.
- గత నాలుగేళ్లుగా వేదవతి బేసిన్‌లో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. నదికి జీవం పోయాలనే లక్ష్యంతో వేదవతిపై అటు కర్ణాటక.. ఇటు రాష్ట్రంలో సబ్ సర్ఫేస్ డ్యామ్‌లు నిర్మించారు. ఇసుక తవ్వకాలను నియంత్రించారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటం నదిలోకి వచ్చే వరదను నదీ గర్భంలోకి ఇంకింపచేయడంలో సబ్ సర్ఫేస్ డ్యామ్‌లు దోహదం చేశాయి. ఇసుక తవ్వకాలను నియంత్రించడంవల్ల నీటి ప్రవాహంతో వేదవతి జీవం పోసుకుంది.

తెలంగాణ

రైతులే పాలకులు కావాలి

- అందుకే భారత్ రాష్ట్ర సమితి ఆవిర్భావం
- నాందేడ్ సభలో తెలంగాణ సీఎం కేసీఆర్
- రైతు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నాడు?
- మహారాష్ట్ర ప్రజలు ఈ విషయాలపై చర్చించాలి
- మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ పోటీ


సభలో ప్రసంగిస్తున్న కేసీఆర్

నిర్మల్/భైంసా : 'ఒక రైతు.. తన కుటుంబాన్ని, భార్యా పిల్లలను వదిలి ఆత్మహత్య ఎందుకు చేసుకుంటున్నాడు? ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెట్టి, జీవితాన్ని ప్రసాదించే రైతన్న ఆత్మహత్య చేసుకోవాల్సిన అగత్యం ఈ దేశంలో ఎందుకు ఏర్పడింది? దీని వెనకున్న మతలబేంటి? దేశం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలోనే దేశ ప్రజలు స్పష్టమైన మార్పును కోరుకుంటున్నారు. అందుకే భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) దేశంలోనే మొట్ట మొదటిసారిగా ఏ పార్టీ ఇవ్వని విధంగా 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అనే నినాదంతో రైతులనే పాలకులను చేసేందుకు ప్రజల ముందుకు వచ్చింది' అని తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. తొలిసారిగా రాష్ట్రం బయట.. మహారాష్ట్ర నాందేడ్ రైల్వేస్టేషన్ సమీపంలోని గురుద్వారా సచ్‌ఖండ్ బోర్డు మైదానంలో ఆదివారం భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సభలో కేసీఆర్ ఏమన్నారంటే..

నాయకుల తీరే లోపం..

- దేశంలో రైతుల సంఖ్య జనాభాలో 42 శాతం కంటే అధికంగా ఉంది. వ్యవసాయ కార్మికులను కూడా కలిపితే ఇది 50 శాతం కంటే ఎక్కువ. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఇంతకన్నా బలం అవసరం లేదు. మీరు ఇంటికి వెళ్లాక ఈ విషయంపై చర్చ పెట్టాలి.
- మనదేశం అమెరికా కంటే ధనవంతమైన దేశం. మహారాష్ట్ర విషయమే తీసుకుంటే.. గోదావరి, కృష్ణా, ప్రవర, పూర్ణ, పెన్‌గంగ, వార్ధా, ఘటప్రభ, మంజీర, భీమా, ప్రాణహిత, ఇంద్రావతి వంటి ఎన్నో నదులున్నా.. నీటికి కటకట ఎందుకుంది? కాంగ్రెస్, బీజేపీలే దేశ దుస్థితికి కారణం.
- 'నేను మీ అన్నను, మీ కొడుకును. బాధాతప్త హృదయంతో మీ దగ్గరికి వచ్చి మాట్లాడుతున్నాను. ఈ విషయాలపై బాగా ఆలోచించాలి. కేవలం 8 నుంచి 10 రోజుల్లో ప్రతి గ్రామానికి బీఆర్ఎస్ వాహనం చేరుకుంటుంది. త్వరలోనే అన్ని కమిటీలు వేస్తాం. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేస్తాం. మహారాష్ట్ర వ్యాప్తంగా రైతు కమిటీలు ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభిస్తాం.

ఆరు నెలల్లోపు నియోజకవర్గాల పునర్విభజన

బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించడంతో పార్లమెంటు, అసెంబ్లీల్లో 33 శాతం సీట్లు రిజర్వు చేస్తాం. ఆరు నెలల్లోపు నియోజకవర్గాల పునర్విభజన పూర్తి చేసి 33 శాతం సీట్లు పెంచి మహిళలకు కేటాయిస్తాం. 90 శాతం విద్యుత్ రంగాన్ని ప్రభుత్వ ఆధీనంలోనే పెడతాం. రెండేళ్లలోనే దేశానికి విద్యుత్ వెలుగులు అందిస్తాం. ఎల్ఐసీని అదానీకి అప్పగించడం వాస్తవం కాదని చెప్తున్న కేంద్రం .. దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీని నియమించడానికి ఎందుకు భయపడుతోంది?

– మీడియాతో కేసీఆర్

భవిష్యత్తులో మహమ్మారిల నియంత్రణ

అమెరికా వర్సిటీతో ఎల్లా ఫౌండేషన్ ఒప్పందం

సాక్షి, న్యూఢిల్లీ: భవిష్యత్తులో మనుషులు, జంతువులు, మొక్కలు ఎలాంటి మహమ్మారిలతో ఇబ్బందులు పడకుండా వైరస్‌లను నియంత్రించడానికి హైదరాబాద్‌కు చెందిన ఎల్లా ఫౌండేషన్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్–గ్లోబల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక, వ్యవసాయ విద్య పరిశోధన, బయోటెక్నాలజీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం ఎల్లా ఫౌండేషన్ డైరక్టర్, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకుడు కృష్ణ ఎల్లా మాట్లాడుతూ ప్రస్తుతం అందరూ చర్చిస్తున్న వన్‌వరల్డ్, వన్‌హెల్త్ గురించి ఎల్లా ఫౌండేషన్ తరఫున అమెరికాకు చెందిన విస్కాన్సిన్ యూనివర్సిటీకి చెందిన గ్లోబల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ (జీహెచ్ఐ) కూడా ఆలోచిస్తోందన్నారు. భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు సుచిత్ర ఎల్లా మాట్లాడుతూ భవిష్యత్తు ఆరోగ్య సమస్యలు, వాటిని అధిగమించడానికి ఎలాంటి సాంకేతికత కావాలనే అంశంపై జీహెచ్ఐతో కలిసి పనిచేయనున్నామన్నారు. భారత్ వంటి అధిక జనాభాగల ప్రాంతాల్లో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి జీహెచ్ఐ సహకారం ఎంతో ఉపకరిస్తుందన్నారు.

తెలంగాణ

పక్షుల వయ్యారం.. వీక్షకుల విహారం..

- ఉత్సాహంగా ముగిసిన బర్డ్‌వాక్
- అరుదైన పక్షులను కెమెరాల్లో బంధించిన పక్షి ప్రేమికులు



జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని కవ్వాల్ అభయారణ్యంలో రెండు రోజులు నిర్వహించిన బర్డ్ వాక్ ఆదివారం ముగిసింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పక్షి ప్రేమికులకు అటవీ శాఖాధికారులు శనివారం రాత్రి కామన్‌పల్లి వాచ్‌టవర్, ఘనిశెట్టికుంట ప్రాంతాల్లో డేరాల్లో బస ఏర్పాటు చేశారు. ఢిల్లీ, హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, జిల్లాలతోపాటు జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్, ఫైనార్ట్స్ యూనివర్సిటీ, హైదరాబాద్ ఫారెస్ట్ కాలేజ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, కామారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు బర్డ్‌వాక్‌లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకు పక్షి ప్రేమికులు కల్పకుంట ప్రాంతానికి వెళ్లారు. అక్కడ అరుదైన పక్షులను వారు తమ కెమెరాల్లో బంధించారు. ఆసియా, ఐరోపా ఖండాలలో సంచరించే పక్షులు.. ఇక్కడ కనిపించడం అదృష్టమని హైదరాబాద్‌కు చెందిన ఇర్షాద్, కిశోర్, ఢిల్లీకి చెందిన ఆనందిత తెలిపారు. వివిధ రకాల అరుదైన పక్షులను కవ్వాల్ అటవీ ప్రాంతంలో గుర్తించినట్లు వెల్లడించారు. అక్కడి నుంచి మైసమ్మ కుంట, ఘనిశెట్టి కుంట ప్రాంతాలలో పర్యటించి అరుదైన పక్షుల ఫొటోలు తీసుకున్నారు.


ఓపెన్ బిల్ స్టార్క్


గ్రే హీడెడ్ ఫిష్ ఈగల్

సూర్యం శరణం గచ్ఛామి!

ప్రతి నలుగురిలో ముగ్గురికి విటమిన్‌–డి లోపం

- ఎముకలు పెళుసుబారి విరిగిపోతున్న వైనం
- పెద్దలతోపాటు పిల్లలకూ సమస్యలు
- ఏసీ రూములు, నీడపట్టున జీవితాలతో అనారోగ్యం
- సూర్యరశ్మి తగిలితేనే శరీరానికి విటమిన్‌–డి అందేది

కేస్ స్టడీ.. చిన్న బకెట్‌తో నీళ్లు తెస్తుంటే..

ఆత్మకూరు మండలం నల్లపరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మస్తానమ్మకు సుమారు 60 ఏళ్లు ఉంటాయి. యాక్టివ్‌గా ఉండేది. అయితే కొంతకాలం క్రితం చిన్న బకెట్‌తో నీరు తీసుకువెళ్తుండగా కాలు స్లిప్ అయి మెల్లగా కిందకు ఒరిగిపోయి పైకి లేవలేకపోయింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. ఎక్స్‌రే తీయగా తొడభాగంలో పొడవైన ఎముక ముక్కలుగా విరిగిపోయి ఉంది. దీంతో డాక్టర్లు ఆమెకు ఆపరేషన్ చేసి రాడ్ వేశారు. ఇలా ఎందుకు జరిగిందని కుటుంబ సభ్యులు ప్రశ్నించగా ఆమెకు విటమిన్‌–డి, కాల్షియం లోపం ఉన్నాయని, అందుకే ఎముకలు పెళుసుబారి కాలు విరిగిందని డాక్టర్లు తెలిపారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. నిత్యం ఇలాంటి కేసులు జిల్లాలోని పలు ఆస్పత్రులకు వస్తున్నాయి.



సాక్షి, నెల్లూరు డెస్క్:ఆరోగ్యమే మహాభాగ్యం. సృష్టిలో ప్రతి జీవి ఆరోగ్యంగా ఉండేలా ప్రకృతి అన్ని వనరులు ప్రసాదించింది. కానీ మనిషి జీవనశైలి గాడి తప్పడంతో అనారోగ్యాలకు గురవుతున్నాడు. మన దేశ జనాభాలో ప్రతి నలుగురిలో ముగ్గురు విటమిన్‌–డి లోపంతో బాధపడుతున్నట్లు తాజాగా గురుగావ్‌కు చెందిన టాటా గ్రూప్ కంపెనీ 1ఎంజీ నిర్వహించిన సర్వేలో వెల్లడైనట్లు పేర్కొంది.

విటమిన్‌–డి ఎలా అందుతుంది?

మన శరీరానికి రెండు మార్గాల ద్వారా విటమిన్‌–డి అందుతుంది. అందులో మొదటిది సూర్యరశ్మి నుంచి, రెండోది ఆహారంగా తీసుకోవడం ద్వారా వస్తుంది. ప్రతిరోజూ ఎండలో కొంత సమయం ఉంటే చాలు మనిషి శరీరానికి అవసరమైన డి–విటమిన్ సహజంగానే అందుతుంది. అలాగే చేపలు, గుడ్డులోని పచ్చసొన, పాలు, తృణధాన్యాలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.

ప్రాముఖ్యత ఏమిటంటే..

మన దేహంలో బలమైన ఎముకలు, కండరాలు, దంతాలు ఏర్పడాలంటే విటమిన్‌–డి ఎంతో అవసరం. తగినంతగా ఈ పోషకం లేకపోతే చిన్నపిల్లల్లో ఎముకలు పటుత్వం కోల్పోయి వంకర్లు పోతాయి. పెద్దవాళ్లలో అయితే ఎముకలు గుల్లబారి ధృడత్వం పోతుంది. తర్వాత కీళ్ల నొప్పులతో మొదలై పలు ఇబ్బందులు ఏర్పడతాయి. ఫలితంగా ఏ చిన్న ప్రమాదం జరిగినా ఎముకలు విరిగి పోతుంటాయి. అందుకే ముందుగా మేల్కొని డాక్టర్‌ను సంప్రదించి సమస్య రాకుండా జాగ్రత్తపడాలి.

డి–విటమిన్ లోపిస్తే..

మన శరీరానికి విటమిన్‌–డి లోపిస్తే ఉదరంలోని పేగులు కాల్షియం, ఫాస్ఫరస్‌ను తగినంతగా సంగ్రహించలేవు. ఇది హైపోకాల్సిమియాకు దారితీస్తుందని డాక్టర్లు చెబుతున్నారు. అంటే రక్తంలో కాల్షియం లెవెల్స్ తగ్గిపోవడం. ఫలితంగా కండరాలు బలహీనపడి.. పిక్కలు పట్టేయడం, మలబద్ధకం, నీరసం వంటి సమస్యలు వస్తాయి. తీవ్రత ఎక్కువైతే ఒక్కోసారి డిప్రెషన్‌కు గురికావచ్చు.

సమస్యకు కారణాలు

విటమిన్‌–డి లోపం నేటి కాలంలో చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ఉంది. గతంలో సుమారు మూడు దశాబ్దాల క్రితం వరకు స్కూళ్లలో విద్యార్థులు ఉదయం కొంతసేపు ఎండలో నిలబడి ప్రతిజ్ఞ చేసేవారు. అంతేకాకుండా సాయంత్రం డ్రిల్ పిరియడ్ ఉండేది. ఆ సమయంలో పిల్లలందరూ గ్రౌండ్‌లో ఆటలాడేవారు. ఆ విధంగా వారికి అవసరమైన మేరకు డి విటమిన్ సూర్యరశ్మి ద్వారా అందేది. పెద్దలు కూడా ఎక్కువమంది ఎండలోనే కాయకష్టం చేసేవారు కాబట్టి వారికి ఈ సమస్య ఎదురుకాలేదు. కాలక్రమంలో ప్రైవేట్ స్కూళ్లు ఎక్కువ కావడం, వాటిలో చేరే విద్యార్థులను నాలుగు గోడల మధ్య కుక్కి చదివించడమే కానీ గౌండ్‌లో ఆటలాడించడం లేకుండా పోయింది. ధనికుల పిల్లలు ఇళ్లలో, స్కూళ్లలో కూడా ఏసీ గదుల్లోనే గడిపేస్తుండటంతో వారికి విటమిన్‌–డి లోపిస్తోంది.

అవగాహన లోపం

ఎండలో తిరిగితే నల్లబడిపోతామని, చర్మ ఛాయ తగ్గుతుందని భావిస్తూ చాలామంది ఇళ్లలోనే ఉండిపోతున్నారు. ఒకవేళబయటకు రావాల్సి వచ్చినా పూర్తిగా దుస్తులతో శరీరాన్ని కప్పేస్తున్నారు. ఇలా చేయడంతో వారికి సూర్యరశ్మి తగలకు విటమిన్‌–డి అందడం లేదు. శరీరానికి ఉదయం, సాయంత్రం వేళల్లో అయినా కొంత సమయం సూర్యరశ్మి తాకేలా చూసుకోవాలి.

గ్రామీణులే మెరుగు

సాధారణంగా పట్టణాల్లో నీడపట్టున పనిచేయడం, ఏసీ రూంలలో ఉండటం, రాత్రిళ్లు మేలుకొని విధులు నిర్వర్తించే వారు, ఇలా ఎండతగలని వారికి విటమిన్‌–డి లోపం ఉంటోంది. ఎండలో కనీసం 4 గంటలు పని చేసేవారికి విటమిన్‌–డి ఎక్కువగా వస్తుంది. తద్వారా ఎముకలు బలంగా, ధృడంగా ఉంటాయి. అందువల్లనే గ్రామీణ ప్రాంతాల్లో ఎండలో పని చేసేవారికి డి విటమిన్ అంది వారు ధృడంగా ఉంటారని వైద్యులు చెపుతున్నారు.

ఇష్టానుసారంగా విటమిన్‌లు తీసుకోరాదు

ప్రస్తుతం మార్కెట్‌లో అనేక మంది డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా ఇష్టానుసారంగా విటమిన్‌–డి, కాల్షియం, ఇ విటమిన్ లాంటి మాత్రలు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. ఇది సరైనది కాదు. శరీరానికి తక్కువ మోతాదులో విటమిన్లు అవసరమవుతాయి. ప్రతిరోజూ డి–విటమిన్ ట్యాబ్లెట్ తీసుకుంటే ఆ కాంపోనెంట్ ఎక్కువై మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది. శరీరానికి ఉపయోగపడదు. ఒక్కో దఫా అతిగా వినియోగించినందు వల్ల అర్థిమియా వచ్చి (గుండె చాలా వేగంగా కొట్టుకోవడం) గుండె ఆగిపోయే ప్రమాదం ఉంది. అందువల్ల డాక్టర్ల సలహా లేకుండా ఏ మాత్రలు వినియోగించకూడదు.

పిల్లల్లోనూ సమస్య ఉంది



డి–విటమిన్ లోపం పెద్ద వారిలోనే కాకుండా పిల్లల్లోనూ ఉంది. 30 శాతం మంది పిల్లల్లో డి–విటమిన్స్ తక్కువ ఉన్నందువల్ల వారి శారీరక, మానసిక పెరుగుదల సరిగా ఉండటం లేదు. ఈ ప్రభావం చదువుపై పడుతోంది. అంతేకాకుండా చిన్నపిల్లల్లో రికెట్స్ వ్యాధికి గురవుతున్నారు. పెద్దల్లో 40 నుంచి 45 శాతం మందికి విటమిన్‌–డి లోపం ఉంటోంది. డి–విటమిన్ శరీరానికి అందాలంటే ఎండవేడిమికి అలవాటు పడాలి. విటమిన్లు తగ్గితే శరీర జీవన ప్రక్రియలు సకాలంలో జరగాల్సిన తీరులో జరగవు. విటమిన్స్ లభించే పదార్థాలు, ఆకుకూరలు, కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి.

–డాక్టర్ మస్తాన్‌బాష,
అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్థోపెడిక్ స్పెషలిస్టు, జీజీహెచ్

అతిగా ఉపయోగిస్తే అనర్థాలు



జీవన క్రియలు సక్రమంగా జరగాలంటే స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు విటమిన్లు శరీరానికి అవసరం. ఇందులో డి విటమిన్ శరీరంలో తక్కువగా ఉందంటే అనుబంధంగా కాల్షియం కూడా తగ్గిపోతుంది. ఇసుక–సిమెంట్ కలిస్తేనే గోడ బలంగా ఉన్నట్టు, డి విటమిన్, కాల్షియం సరిపడా ఉండాలి. ఇవి లోపిస్తే ఎముకలు గుల్లబారుతాయి. పెద్ద కారణం లేకుండానే ఎముకలు విరిగిపోతాయి. 40 ఏళ్లు వచ్చిన మహిళల్లో ముందస్తు మెనోపాజ్ దశ వల్ల కూడా విటమిన్స్ లోపం ఏర్పడి హార్మోన్స్ బ్యాలెన్స్ తగ్గి కాల్షియం తగ్గిపోతుంది. అప్పుడు డి విటమిన్ కూడా తగ్గుతుంది. మునగ ఆకు, మునగ కాయలు, రాగులు, పాలు, గుడ్డు, చేప, గుమ్మడి లాంటి ఆహార పదార్థాలు తీసుకునే వారిలో విటమిన్ డి తగ్గదు.

–డాక్టర్ రోజారమణి,
అసోసియేట్ ప్రొఫెసర్, జనరల్ సర్జన్, జీజీహెచ్

వేలానికి వేళాయె..!

- 23వ తేదీ నుంచి దశలవారీగా పొగాకు వేలం కేంద్రాలు ప్రారంభం
- ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిన పొగాకు బోర్డు

పొగాకు వేలానికి సమయం ఆసన్నమైంది. ఇప్పటికే పొగాకు బోర్డు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రీజియన్ పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల పరిధిలో ఉన్న 11 వేలం కేంద్రాలను దశలవారీగా ప్రారంభించనున్నారు. ఇప్పటికే కర్ణాటకలో వేలం చివరి దశకు చేరుకుంది. రికార్డు స్థాయిలో ధరలు పలకడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. అవే ధరలు వస్తే తమ పంట పండినట్లేనని సంబరపడుతున్నారు.

కందుకూరు: ఈ ఏడాది సాగులో మాండూస్ లాంటి తుఫాన్‌లు ఇబ్బంది పెట్టినా పొగాకు సాగులో రైతులు ఏమాత్రం వెనకడుగు వేయలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు విపరీత డిమాండ్ రావడం, పక్క రాష్ట్రం కర్ణాటకలో జరిగిన పొగాకు అమ్మకాల్లో కిలో పొగాకు రికార్డు ధరల పలకడం రైతుల్లో ఉత్సాహం నింపింది. 2022–23 సీజన్‌కు సంబంధించి రైతులు పెద్ద ఎత్తున పొగాకు సాగు చేశారు. పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా 61,639 హెక్టార్లలో పొగాకు రైతులు సాగు చేశారు. పంట సాగు విస్తీర్ణం పెరగడంతో బోర్డు అనుమతిని మించి ఉత్పత్తి రావచ్చునని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోపక్క ఈనెలాఖరు నుంచి పొగాకు వేలం అధికారికంగా ప్రారంభించేందుకు బోర్డు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు.

23 నుంచి దశల వారీగా..

పొగాకు వేలాన్ని ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభించేలా పొగాకు బోర్డు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. 23వ తేదీన తొలుత ఒంగోలు, పొదిలి, కొండపి, వెల్లంపల్లి వేలం కేంద్రాల్లో, మార్చి 9న రెండో దశలో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పరిధి కందుకూరు–1,2 కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాలతో పాటు జిల్లాలోని కనిగిరి, ఒంగోలు, టంగుటూరు కేంద్రాల్లో వేలం ప్రారంభం కానుంది. కర్ణాటకలో ఈ ఏడాది కిలో పొగాకు రూ.274ల వరకు పలికింది. ఇక్కడ గతేడాది కిలో పొగాకు అత్యధిక ధర రూ.184 వచ్చింది. అదే కిలో సరాసరి ధర అత్యధికంగా రీజియన్ పరిధిలో రూ.172 వరకు వచ్చింది. కర్ణాటక మార్కెట్‌లో ఒక్కసారిగా రికార్డు స్థాయిలో ధరలు రావడంతో అదే స్థాయిలో ఇక్కడ కూడా రేట్లు ఉంటాయనే ఆశలు రైతులు పెట్టుకున్నారు.

అధిక విస్తీర్ణంలో సాగు:

పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్‌లో 11 వేలం కేంద్రాలున్నాయి. వీటిలో తేలిక నేలల పరిధిలో (ఎస్ఎల్ఎస్) నెల్లూరు జిల్లాలోని కందుకూరు–1, కందుకూరు–2, కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాలతో పాటు జిల్లాలోని పొదిలి, కనిగిరి వేలం కేంద్రాలున్నాయి. నల్లరేగడి నేలల (ఎస్‌బీఎస్) పరిధిలో జిల్లాలోని వెల్లంపల్లి, ఒంగోలు–1, ఒంగోలు–2, టంగుటూరు, కొండపి వేలం కేంద్రాలున్నాయి. 2022–23 సీజన్‌కు గాను 57,744 హెక్టార్లలో పొగాకు సాగుకు బోర్డు అనుమతిచ్చింది. అయితే రికార్డు స్థాయిలో 61,639 హెక్టార్లలో పంట సాగైంది. అదే 2021–22లో బోర్డు 49,889.15 హెక్టార్లలో పంట సాగుకు బోర్డు అనుమతిస్తే సాగైంది మాత్రం 46,647.01 హెక్టార్లు మాత్రమే. అంటే బోర్డు అనుమతికంటే తక్కువగా సాగైంది. కానీ ఈ ఏడాది మాత్రం బోర్డు అనుమతిని మించి సాగు చేపట్టారు. గత ఏడాది వేలంలో పొగాకు మంచి ధరలు రావడం, ఈ ఏడాది కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో అధిక శాతం మంది రైతులు పొగాకు సాగువైపు మొగ్గు చూపారు. గతేడాది డిసెంబర్‌లో వచ్చిన మాండూస్ తుఫాన్ వల్ల పంట నష్టపోయినా రైతులు మాత్రం తిరిగి పొగాకునే సాగు చేశారు. జనవరి చివరి వరకు సాగుచేస్తూనే ఉన్నారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదు. దీని వల్ల ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పొగాకు పంట సాగైందని అధికారులు చెప్తున్నారు.

99 మిలియన్ కేజీల ఉత్పత్తి అంచనా:

పంట సాగు విస్తీర్ణం పెరగడంతో ఆ మేరకు పొగాకు ఉత్పత్తి కూడా పెరుగుతుందని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. బోర్డు 11 వేలం కేంద్రాల పరిధిలో 87 మిలియన్ కేజీల పొగాకును విక్రయించుకునేందుకు అనుమతించింది. కానీ అనుమతిని మించి 12 మిలియన్ కేజీలు అధికంగా అంటే 99 మిలియన్ కేజీల ఉత్పత్తి వస్తుందని బోర్డు అధికారుల అంచనా. అలాగే ఈ ఏడాది క్యూరింగ్‌లో నాణ్యత కూడా పర్వాలేదని చెప్తున్నారు. 55–60 శాతం వరకు బ్రైట్ గ్రేడ్(గ్రేడ్–1) పొగాకు వస్తుందని, 25 శాతం మీడియం, మరో 25 శాతం లోగ్రేడ్ పొగాకు ఉత్పత్తులు వస్తున్నాయని అధికారులు చెప్తున్నారు. అంటే ఒక రకంగా ఈ ఏడాది పొగాకు రైతులకు ఆశాజనకంగా ఉందని చెప్పవచ్చు.

పొగాకు పంట


సాక్షి ఫ్యామిలీ
చెన్నై
సోమవారం ॥ 6-2-2023

సన్నిధి

మంచి మాట



నాణ్యతతో మాన్యత

నాణ్యత లేని మనిషి నాసిరకం మనిషి అవుతాడు. నాసిరకం మనిషి గడ్డిపోచ కన్నా హీనం అవుతాడు. నాసిరకం మనిషి విలువలేని మనిషి, అనవసరం అయిన మనిషి అయిపోతాడు ఆపై అనర్థదాయక మైన మనిషిగానూ అయిపోతాడు. విద్య , సమాజం, సాహిత్యం, సంగీతం, కళలు, వృత్తులు, విధి నిర్వహణ... ఇలా అన్నింటా నాసిరకం మనుషులు కాదు నాణ్యమైన వాళ్లే కావాలి. నాణ్యత ఎంత కరువు అయితే అంత కీడు జరుగుతుంది. నాణ్యత ఎంత ఉంటే అంత మంచి జరుగుతుంది. నాణ్యత అన్నది సంస్కారం; మనిషికి ఉండాల్సిన సంస్కారం. నాణ్యత లోపిస్తే మనిషికి సంస్కారం లోపించినట్లే. నాణ్యత గురించి మనిషికి ఆలోచన ఉండాలి. మనిషికి నాణ్యమైన ఆలోచనలు ఉండాలి.

నాసిరకం ఆహారం, నీరు తీసుకోవడంవల్ల మన ఆరోగ్యం చెడిపోతుంది అని మనకు తెలిసిందే. నాసిరకం ఆలోచనాసరళివల్ల మన జీవితం చెడిపోతుంది అని అవగతం చేసుకోవాలి. నాణ్యమైన అభిరుచి, ప్రవర్తన, పనితీరు సాటివాళ్లలో మనకు గొప్పస్థాయిని ఇస్తాయి. చదువు నాణ్యమైంది అయితే అది వర్తమానం లోనివారికి, భావితరాలవారికి ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. చదవు నాసిరకంది అయితే పెనునష్టం జరుగుతుంది. గత ఆరు దశాబ్దులుగా నాసిరకం వ్యక్తులు ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి. పట్టభద్రులు అవడంవల్ల, నాసిరకం వ్యక్తులు సాహితీ విమర్శకులు, కవులు, అధ్యాపకులు అవడం వల్ల, నాసిరకం రచనలకు పురస్కారాలు వస్తూ ఉండడంవల్ల తెలుగుసాహిత్యం, కవిత్వం పతనం అవుతూ నిరాదరణకూ, ప్రజల ఏవగింపుకు గురి అయిపోవడం క్షేత్రవాస్తవంగా తెలియవస్తోంది; అంతేకాదు వీళ్లవల్ల తెలుగుభాష కూడా వికలం అయిపోతూ ఉంది. ఏది ప్రక్రియ అవుతుందో కూడా తెలియని నాసిరకం వ్యక్తులవల్ల మరేభాషలోనూ లేని ప్రక్రియల పైత్యం తెలుగుకవితలో ముదిరిపోయింది. నాసిరకం వ్యక్తుల వల్ల మత, కుల, ప్రాంతీయత, వాదాల ఉన్మాదం తెలుగుసాహిత్యాన్ని, కవిత్వాన్ని, భాషను ధ్వంసం చేస్తోంది.

నాణ్యమైన వృత్తికారులవల్ల వృత్తి పరిఢవిల్లుతుంది. నాణ్యమైన కళాకారులవల్ల కళ పరిఢవిల్లుతుంది. నాణ్యమైన క్రీడాకారులవల్ల క్రీడ పరిఢవిల్లుతుంది. నాణ్యమైన మనుషులవల్ల సంఘం పరిఢవిల్లుతుంది. నాణ్యతవల్ల నాణ్యత నెలకొంటుంది; నాణ్యతవల్ల భవ్యత వ్యాపిస్తుంది. మనుషులమై పుట్టిన మనం మళ్లీ మనుషులమై పుడతామో లేదో? కనుక ఈ జన్మలో నాణ్యతనే కోరుకుందాం; నాణ్యతనే అందుకుందాం.

ఒక నాసిరకం వైద్యుడివల్ల రోగులకు సరైన వైద్యం జరగకుండా కీడు జరుగుతుంది. నాసిరకం కట్టడాలు కూలిపోతే ప్రజలకు జరిగే నష్టం భర్తీ చెయ్యలేనిది. నాసిరకం భావజాలాలవల్ల పలువురి బతుకులు బలి అవుతూ ఉండడమే కాదు పలువురు దుష్టులై సంఘానికి హానికరం అయ్యారు, అవుతున్నారు. నాసిరకం మనస్తత్వం వల్లే అసమానతలు, నేర ప్రవృత్తి వంటివి సమాజాన్ని నిత్యమూ బాధిస్తున్నాయి. నాసిరకం చదువుల వల్ల, పనితీరువల్ల, ఆలోచనలవల్ల, ప్రవర్తనలవల్ల, మనిషికీ, సమాజానికీ, ప్రపంచానికీ విపత్తులు కలుగుతూ ఉన్నాయి, ఉంటాయి.

కొందరి నాసిరకం చింతనవల్ల, దృక్పథంవల్ల, పోకడవల్ల మామూలు మనుషులుగా కూడా పనికిరానివాళ్లు, సంప్రదాయానికి చెందని వాళ్లు దైవాలుగా అయిపోయి అహేతుకంగా, అశాస్త్రీయంగా ఆలయాలు, అర్చనలు, హారతులతో పూజింపబడుతూ ఉన్న దుస్థితి మనలో తాండవిస్తోంది. ఈ పరిణామం నైతికత, సంస్కృతి, ధార్మికతలకు ముప్పు అవుతోంది. ఇలాంటివి కాల క్రమంలో ప్రజల్లో చిచ్చుపెడతాయి.

నాసి వాసికెక్కకూడదు; నాణ్యత మాన్యత చెరిగిపోదు. నాణ్యత ప్రతిమనిషికీ ఎంతో అవసరం. మనిషి నాణ్యతకు అలవాటుపడాలి. నాణ్యత తప్పకుండా కావాల్సింది, ప్రయోజనకరమైంది ఆపై ప్రగతికరమైంది. నాణ్యతను వద్దనుకోకూడదు, వదులుకోకూడదు. నాణ్యతను మనం అనుగమించాలి, అనుసంధానం చేసుకోవాలి. నాణ్యతతో మనం క్షేమంగానూ, శ్రేష్ఠంగానూ బతకాలి.

– రోచిష్మాన్

గురువాణి



వాగ్భూషణమ్ భూషణం

లోకంలో భగవంతుడిచ్చిన అందం ఒకటి ఉంటుంది. దానిని మరింత ఉద్దీపింపచేయడానికి భూషణాలు వాడతారు. భుజాలకు కేయూరాలు, మెడలో చంద్రహారాలు, సూర్యహారాలు వంటి ఆభరణాలతో అలంకరిం చుకుంటారు. శరీరానికి చందనం పులుముకుంటారు. మెడలో పుష్పహారాలు, సిగలో పూలు ధరిస్తారు. ఇవన్నీ కాలగతిలో క్షీణించిపోతాయి. కానీ చక్కటిమాట ఎవరు మాట్లాడతారో ఆ మాటలు ఎంతకాలం గడిచినా శాశ్వతత్వాన్ని తెచ్చిపెడతాయి తప్ప క్షీణించవు. భర్తృహరి అదే అంటాడు...''కేయురాణి న భూషయంతి పురుషం, హారాన చంద్రోజ్జ్వలా/న స్నానం, న విలేపనం, న కుసుమం, నాలంకృతా ముర్ధజా/వాణ్యేకా సమలంకరోతి పురుషం, యా సంస్కృతాధార్యతే/ క్షీయంతే ఖిల భూషణాని సతతం, వాగ్భూషణం భూషణం.''

అందుకే వాగ్దేవీ కటాక్షం ఉండాలంటారు. మంచి మాటలు, సారవంతమయిన మాటలు మనుషుల జీవితాలనే మార్చేస్తాయి. అన్నం పెడితే మళ్ళీ ఆకలి వేస్తుంటుంది, నీళ్ళు ఎన్నిసార్లిచ్చినా దాహం వేస్తూనే ఉంటుంది. బట్టలయినా కొంతకాలానికి జీర్ణమయి పోతాయి, కొత్తవి అవసరమవుతుంటాయి. కానీ ఒక మంచిమాట జీవితాలను ప్రభావితం చేస్తుంటుంది. మాటలకు దేశకాలాలతో సంబంధం లేదు. వాక్కు సారవంతంగా... మధురాతిమధురంగా ఉండాలి. ప్రేమతో మాట్లాడిన మాట హృదయంలోకి చొచ్చుకుపోతుంది. వాక్కు సరస్వతీ దేవి అనుగ్రహం. మంచి మాటలు నోటివెంట రావాలంటే ఆమె అనుగ్రహం కోసం ప్రార్థిస్తాం...


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కృష్ణ పరమాత్మ అర్జునుడికి ధైర్యం నూరిపోసే మిషమీద నాలుగు మాటలు చెప్పినట్లుగా కనిపించే భగవద్గీత ద్వాపరయుగం నాటిదైనా... దేశకాలాలతో సంబంధం లేకుండా ఇప్పటికీ మనిషిని ఉద్ధరించడానికి ఉపయోగపడుతూనే ఉన్నది కదా! శంకర భగవత్పాదులు 72 అవైదికమైన వాదనలను ఖండన చేసేటప్పుడు ఎక్కడా ఉద్రేకపడకుండా పరమ ప్రేమభావనలతో మాట్లాడుతూ ఎదుటివారు తమ లోపాన్ని తాము తెలుసుకునేట్టు చేసి ఉత్తమమైన, సంస్కారవంతమైన, శాస్త్రీయమైన మార్గాన్ని పట్టుకునేటట్లు చేయగలిగారు.. ఎలా... కేవలం వాదనాపటిమచేత...అంటే వాక్కుచేత.నిరాశా నిస్పృహలతో మరణించడానికి సిద్ధంగా ఉన్న సీతమ్మకు హనుమ కేవలం కొన్ని మాటలు కథగా చెప్పి ఆమెచేత ఆ ప్రయత్నం విరమింపచేశారు.

అదీ వాగ్భూషణమ్ భూషణం.. అంటే.

సువార్త

తగిన సమయంలో హెచ్చించు దేవుడు

దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతి కింద దీనమనస్కులై యుండుడి (1 పేతురు 5:6). ప్రతిదానికి సమయం ఉంది అని పరిశుద్ధ గ్రంథం సెలవిస్తుంది. ప్రసంగి గ్రంథంలో జ్ఞానియైన సొలొమోను కూడా ఈ విషయాన్ని ప్రస్తావించాడు. సర్వశక్తుడైన దేవుడు ప్రతి విషయాన్ని తన సమయంలో చేస్తాడు. అది ఆయన నిత్య స్వభావం. సమయానికి ముందు కార్యాలు చేసి తన ప్రణాళికలను చులకన చెయ్యడు. సమయమంతా అయిపోయాక చేసి తన ప్రజలను నిరుత్సాహపరచడు. ప్రేమగల దేవుడు ఏది చేసినా తన చిత్త ప్రకారం తన సమయంలో చేస్తాడు. అది అందరికి ప్రయోజనకరమైనది. తాను సృష్టిని శాసించువాడైనప్పటికి కాలం సంపూర్ణమైనప్పుడు ఈ లోకానికి మనుష్యునిగా దిగివచ్చాడు. దేవుడు ఎందుకు ముందే రాలేదు? అని కొందరు ప్రశ్నిస్తుంటారు. దానికి సమాధానం దేవుడు తన సమయంలో స్పందిస్తాడు. ఎప్పుడు చేస్తే బావుంటుందో దేవునికి బాగా తెలుసు. అయితే తాను చేయబోయే కార్యానికి ముందు దేవుడు ఒక అమోఘమైన వాగ్దానాన్ని ఇస్తాడు. వేచి చూచే సమయాన్ని నిర్ణయిస్తాడు. ఆ సమయంలో మనకు కొన్ని పాఠాలు నేర్పిస్తాడు.



దేవుని పాఠశాలలో ఆత్మీయ పాఠాలు నేర్చుకున్నవాడు కచ్చితంగా ప్రపంచానికి ఆశీర్వాదకరంగా ఉంటాడు.

దేవుని నుండి హెచ్చింపును పొందాలంటే మనిషి చేయాల్సింది దీనమనస్సుతో వ్యవహరించుట. దేవుని కొరకు, ఆయన కార్యాల కొరకు కనిపెట్టుట అనేది క్రైస్తవ జీవితంలో ఒక అద్భుత అనుభవం. కనిపెట్టే సమయం వృథా చేస్తున్న సమయం కానేకాదు. దేవుని కొరకు ఎదురు చూచువారు నూతనబలాన్ని పొందుతారన్న లేఖన సత్యం ఇచ్చే ధైర్యం అంతా ఇంతా కాదు. కల్దీయ దేశాన్ని విడిచి కనాను దేశానికి వచ్చిన అబ్రాహాము తనకు ఇవ్వబడిన వాగ్దాన నెరవేర్పు చూడడానికి ఇరవై ఐదు సంవత్సరాలు పట్టింది. తనకు దేవుడు ఇచ్చిన కలలు నెరవేరడానికి భక్తుడైన యోసేపుకు పదమూడు సంవత్సరాలు పట్టింది. గొల్యాతును జయించిన తరువాత ఇశ్రాయేలు దేశానికి రాజుగా అలంకరింపబడడానికి దావీదుకు సమయం పట్టింది. ఆ సమయంలో వారెన్నో పాఠాలు నేర్చుకున్నారు. చెక్కుచెదరని విశ్వాసంలో అభివృద్ధి చెందారు. దేవుని గుణలక్షణాలను అర్థం చేసుకున్నారు. దేవుని ప్రణాళికలకు తమను తాము సంపూర్తిగా సమర్పించుకున్నారు.

ఆధ్యాత్మిక ప్రపంచంలో సహనం ఓర్పు చాలా కీలకమైనవి. గుడ్డును పొదగడం ద్వారా కోడిపిల్ల వస్తుంది గానీ దానిని అర్ధాంతరంగా పగులకొట్టడం ద్వారా కాదు.

తగిన సమయమందు స్పందించకుండా దేవుడు ఉండలేడు. ఊహించలేని మేళ్ళతో నిన్ను నింపి తన నామాన్ని మహిమపరచుకుంటాడు. ఆమేన్!!

–డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

ఇస్లాం వెలుగు

సాఫల్యానికి దారి

ఇరుగు పొరుగు, బంధువులు, బాటసారులు, పేదసాదలను ఆదుకోవడం, తల్లిదండ్రులను సేవించడం ఇహపర సాఫల్యానికి రాజమార్గం. పవిత్ర ఖురాన్‌లో ఇలా ఉంది. 'దైవాన్నే ఆరాధించండి. ఆయన దైవత్వంలో ఎవరికీ సాటి కల్పించకండి. తల్లిదండ్రుల పట్ల సత్ ప్రవర్తనతో మెలగండి. బంధువులు, అనాథలు, నిరుపేదలతో మంచిగా మసలుకోండి. బంధువులకు, పరిచయం లేని పొరుగువారికి, మీ దైనందిన కార్యకలాపాలలో మీకు తారసపడే మిత్రులకు, బాటసారులకు, మీ అధీనంలో ఉన్న సేవకులకు మేలు చేయండి. దేవుడు అహంకారులను, ప్రగల్భాలు పలికే వారిని ఎన్నటికీ ప్రేమించడు.'(4 – 36) అంతేకాదు, తాము పిసినారితనం వహించడమేగాక, ఇతరులక్కూడా పిసినారితనం నూరిపోసే వారిని సైతం దైవం ప్రేమించడు. కనుక అందరి హక్కులు నెరవేర్చడంతో పాటు, విశాల హృదయంతో సత్కార్యాల్లో పాలుపంచుకోవాలి. పవిత్ర ఖురాన్‌లో మరోచోట ఇలా ఉంది: 'దైవమార్గంలో తమ సంపదను ఖర్చు పెట్టేవారి పోలిక, ఒక విత్తనం నాటగా అది ఏడు వెన్నులు ఈని ప్రతి వెన్నులో వందేసి గింజలున్నట్లు ఉంటుంది. ఈ విధంగా దైవం తాను తలచిన వారి కర్మఫలాన్ని అనేక రెట్లు పెంచుతాడు. ఆయన అన్నీ తెలిసినవాడు, ఎంతో ఉదార స్వభావుడు.' దైవమార్గంలో ఖర్చు చెయ్యడంతో పాటు, చేసిన మేలు గుర్తు చేసి గ్రహీతల మనసు నొప్పించని వారి కోసం వారి ప్రతిఫలం దైవం దగ్గర సిద్ధంగా ఉంది. దైవం నిరపేక్షాపరుడు, విశాల హృదయం కలవాడు.' కనుక లోకుల మెప్పుకోసం ప్రదర్శనా బుద్ధితో దానధర్మాలు చేసి, ఎత్తిపొడుపు మాటల ద్వారా వారి మనసు నొప్పించి దానధర్మాలను వృథా చేసుకోకూడదు. అలాంటి వారు చేసే దానధర్మాల ఉపమానం ఎలా ఉందంటే, భారీ వర్షం కురవగానే పైనున్న పల్చని పొర కాస్తా తుడిచి పెట్టుకుపోయి నున్నగా మిగిలే రాయితో సమానం. సత్యాన్ని తిరస్కరించే వారికి దైవం సన్మార్గం చూపడు.



కేవలం దైవ ప్రసన్నత కోసం చిత్తశుద్ధితో తమ సంపద ఖర్చుపెట్టేవారు మెరక ప్రాంతంలో ఉండే తోట లాంటివారు. ఆ తోట వర్షాలు బాగా పడితే రెండింతలు ఫలసాయాన్నిస్తుంది. అంతగా వర్షాలు లేకపోయినా సన్నటి జల్లులు పడినా దానికి సరిపోతుంది. మీరు చేసే పనులన్నీ దైవం గమనిస్తున్నాడు. (సూరె బఖరా 261నుండి – 265 వరకు).

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సినిమా


రామ్‌చరణ్

ఇట్స్ డ్యాన్సింగ్ టైమ్

హీరో రామ్‌చరణ్ డ్యాన్స్ మోడ్‌లోకి వెళ్లారు. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా తర్వాతి షెడ్యూల్ నేటి నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ఓ సాంగ్‌ను చిత్రీకరించనున్నారు. సో.. రామ్‌చరణ్‌కు ఇది డ్యాన్సింగ్ టైమ్. డిఫరెంట్ లొకేషన్స్‌లో పాట చిత్రీకరణ జరగనుండటం విశేషం. తొలుత హైదరాబాద్‌లో చిత్రీకరణ జరిపి తర్వాత వైజాగ్, రాజమండ్రిలో షూటింగ్ జరిపేలా ప్లాన్ చేశారట చిత్రయూనిట్. అంజలి, శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, సునీల్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు.


విజయ్ దేవరకొండ

కాంబినేషన్ రిపీట్

'గీతగోవిందం' (2018) వంటి సూపర్ హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 'దిల్' రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మించనున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి. మరోవైపు శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఖుషి' చిత్రంలో విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సమంత హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కూడా మొదలైంది. అయితే సమంత అనారోగ్యం, కాల్షీట్స్ సర్దుబాటు కారణాల వల్ల ఈ చిత్రం షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. కాగా ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ శరవేగంగా జరుగుతున్నాయి. హేషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. అలాగే దర్శకుడు సుకుమార్‌తో విజయ్ దేవరకొండ ఓ సినిమాకి కమిట్ అయిన సంగతి తెలిసిందే.

అమిగోస్‌తో హ్యాట్రిక్ సాధించాలి – ఎన్టీఆర్



రవిశంకర్, రాజేంద్ర రెడ్డి, ఆషిక, ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, నవీన్ యెర్నేని

''నవీన్, రవిశంకర్‌గార్లు నిర్మించిన రెండు చిత్రాలు(వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి) ఈ సంక్రాంతికి విడుదలై సూపర్‌హిట్స్ అయ్యాయి. అంత సుడి ఉన్న నిర్మాతలు తీసిన 'అమిగోస్' కూడా బ్లాక్ బస్టర్ అయి హ్యాట్రిక్ సాధించాలి'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. కల్యాణ్ రామ్, ఆషికా రంగనాథ్ జంటగా రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అమిగోస్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ మాట్లాడుతూ– ''ఇంజినీరింగ్ చదివిన రాజేంద్రగారు వారి తల్లితండ్రులు వద్దంటున్నా ఇండస్ట్రీకి వచ్చారు. 'అమిగోస్' మొదలయ్యేలోపు వారి అమ్మగారు కాలం చేస్తే, లాస్ట్ షెడ్యూల్ సమయంలో నాన్నగారు కూడా చనిపోయారు. రాజేంద్రగారి తల్లితండ్రులు భౌతికంగా ఇక్కడ లేకపోయినా ఆయన సాధించిన ఈ మొదటి మెట్టు విజయాన్ని వారు చూశారు. 'జై లవ కుశ'లో నేను మూడు పాత్రలు చేశా. మూడు విభిన్న పాత్రలు చేయడం ఎంత కష్టమో నాకు తెలుసు. 'అమిగోస్' లో కల్యాణ్ అన్న మూడు పాత్రల్లో ఎంతో అద్భుతంగా నటించారు'' అన్నారు.

కొరటాల శివగారు, నా కాంబినేషన్‌లో సినిమా ఈ నెలలో ప్రారంభంది. మార్చిలో షూటింగ్ మొదలుపెడతాం. 2024 ఏప్రిల్ 5న ఆ సినిమాని విడుదల చేస్తాం. – ఎన్టీఆర్

కల్యాణ్ రామ్ మాట్లాడుతూ– ''బింబిసార' తర్వాత ఎలాంటి సినిమా చేయాలనే ఆలోచన ఉన్న నాకు 'అమిగోస్' పర్ఫెక్ట్ మూవీ. 18 ఏళ్ల పాటు నన్ను ఆదరిస్తూ, భరిస్తూ వచ్చిన మీకు (ప్రేక్షకులు, అభిమానులు) చాలా థ్యాంక్స్. ఈ సినిమా చూసి ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహపడరు'' అన్నారు. ''నన్ను, 'అమిగోస్' స్క్రిప్ట్‌ను నమ్మి అవకాశం ఇచ్చిన కల్యాణ్ రామ్‌గారికి, నిర్మాతలు రవి, నవీన్‌గార్లకు రుణపడి ఉంటాను'' అన్నారు రాజేంద్ర రెడ్డి. ''అమిగోస్' ని హిట్ చేసి, మాకు హ్యాట్రిక్ ('వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి') విజయాలను అందించాలి'' అన్నారు నవీన్ యెర్నేని. ''బింబిసార' తర్వాత కల్యాణ్‌గారి నెక్ట్స్ లెవల్ పెర్ఫార్మెన్స్‌ను ఈ చిత్రంలో చూస్తారు'' అన్నారు వై.రవిశంకర్. ఈ వేడుకలో డైరెక్టర్ బుచ్చిబాబు, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


జాకీష్రాఫ్

మూడు దశాబ్దాల తర్వాత...

హీరో రజనీకాంత్, బాలీవుడ్ నటుడు జాకీష్రాఫ్ మూడు దశాబ్దాల తర్వాత కలిసి నటిస్తున్నారు. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్'. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో జాకీష్రాఫ్ నటించనున్నారని, ఆయన షూటింగ్‌లో పాల్గొంటున్నారని యూనిట్ ప్రకటించింది. కాగా 1987లో వచ్చిన హిందీ చిత్రం 'ఉత్తర్ దక్షిణ్' తర్వాత రజనీకాంత్, జాకీష్రాఫ్ మళ్లీ కలిసి నటిస్తున్న సినిమా 'జైలర్' కావడం విశేషం. దాదాపు 36 ఏళ్ల తర్వాత రజనీ, జాకీష్రాఫ్ కలిసి నటిస్తున్నారన్నమాట.

శ్రీదేవి శోభన్‌బాబు


సంతోష్, గౌరి

సంతోష్ శోభన్, గౌరి జి.కిషన్ జంటగా ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'. సుస్మిత కొణిదెల, విష్ణు ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలవుతోంది. సంతోష్ శోభన్ మాట్లాడుతూ–''1970 నేపథ్యంలో ఓ పల్లెటూరులో జరిగే అందమైన కథ ఇది'' అన్నారు. ''నా మనసుకు ఎంతో దగ్గరైన సినిమా ఇది'' అన్నారు నిర్మాత సుస్మిత. ''ఈ సినిమా చూసిన తర్వాత మన కుటుంబ సభ్యులందరూ కలుసుకుంటే బావుంటుందనే ఆలోచన వస్తుంది'' అన్నారు ప్రశాంత్. ఈ కార్యక్రమంలో నటి గౌరి జి.కిషన్, నిర్మాత విష్ణు ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శరణ్య పొట్ల పాల్గొన్నారు.

గిరిజన నేపథ్యంలో...


శ్రీకర్, శ్రావణి

శ్రీకర్ కృష్ణ, శ్రావణి నిక్కీ, అజయ్ ఘోష్, జయ నాయుడు, అమ్మ రమేష్, షఫీ క్వాద్రి ముఖ్య పాత్రల్లో గౌతమ్ మైలవరం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సిరిమల్లె పువ్వా'. షకీరా మూవీస్‌పై కౌసర్ జహాన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథులుగా హాజరైన డైరెక్టర్స్ చంద్రమహేష్, సముద్ర, నిర్మాత తుమ్మల ప్రసన్నకుమార్ ఈ చిత్రం టీజర్, పాటలు విడుదల చేశారు. కౌశర్ జహాన్ మాట్లాడుతూ– ''ఒక గిరిజన అమ్మాయి ప్రేమలో పడుతుంది.. ఆ తర్వాత ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంది? గిరిజన వర్గాలకు జరిగిన అన్యాయం ఏంటి? అనేది మా చిత్ర కథ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సత్యానంద్ వి, సంగీతం: జీబు.

తెలుగు ఇండస్ట్రీ నుంచి చాలా నేర్చుకున్నా – ఉపేంద్ర

''**తె**లుగు సినిమా ఇండస్ట్రీని చూసి చాలా నేర్చుకుని, రాసుకుని సినిమాలు చేశాను. దర్శకుడు చంద్రు మూడేళ్లు కష్టపడి 'కబ్జ' చిత్రాన్ని ఇక్కడి వరకు తీసుకువచ్చారు''అని ఉపేంద్ర అన్నారు. ఆర్.చంద్రు దర్శక నిర్మాణంలో రూపొందిన చిత్రం 'కబ్జ'. ఉపేంద్ర, శ్రియ జంటగా సుదీప్ కీలక పాత్రలో నటించిన ఈ మూవీ మార్చి 17న విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని నిర్మాత ఎస్.సుధాకర్ రెడ్డి సమర్పణలో హీరో నితిన్ రుచిరా ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎన్. సినిమాస్ పతాకాలపై తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు చిత్రయూనిట్. ఆర్.చంద్రు మాట్లాడుతూ–''మార్చి 17న పునీత్ రాజ్‌కుమార్‌గారి జయంతి.. ఆ రోజు మా 'కబ్జ'ని రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''ఉపేంద్రగారితో వర్క్ చేయడాన్ని నా అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు శ్రియ. కాగా ఆస్కార్ ముంగిట నిలిచిన 'ఆర్ఆర్ఆర్' సినిమాను నిర్మించిన డీవీవీ దానయ్య, 'నాటు నాటు..' పాట రాసిన చంద్రబోస్‌ను ఉపేంద్ర అండ్ టీమ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సాయినాథ్, హనుమంత రెడ్డి, లగడపాటి శ్రీధర్, హీరో విశ్వక్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.


ఉపేంద్ర, శ్రియ

నవ్వులే నవ్వులు


వెంకటేశ్, అశోక్ గల్లా

అశోక్ గల్లా కొత్త చిత్రం షురూ అయింది. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించగా, అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నారు. సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నమ్రత కెమెరా స్విచ్చాన్ చేయగా, వెంకటేష్ క్లాప్ కొట్టారు. బోయపాటి శ్రీను గౌరవ దర్శకత్వం వహించగా, మిర్యాల రవీందర్ రెడ్డి, సాహు గారపాటి, హరీష్ పెద్ది కలిసి స్క్రిప్ట్‌ని ప్రశాంత్ వర్మకు అందజేశారు. అశోక్ గల్లా మాట్లాడుతూ–''ఈ సినిమాలో నా పాత్ర రఫ్‌గా ఉంటుంది'' అన్నారు. ''ప్రశాంత్ వర్మగారు చాలా మంచి వినోదాత్మక కథ అందించారు'' అన్నారు అర్జున్ జంధ్యాల. ''నాలుగేళ్లుగా ఈ కథను రాసుకున్నాను'' అన్నారు ప్రశాంత్ వర్మ. ఈ చిత్రానికి సమర్పణ: నల్లపనేని యామిని, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, సహ నిర్మాత: కె.సాగర్.

సూర్యాపేట్ జంక్షన్


ఈశ్వర్, నైనా

ఈశ్వర్, నైనాసర్వార్ జంటగా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. నాదెండ్ల రాజేష్ దర్శకత్వంలో అనిల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్ఎస్ రావు, విష్ణువర్ధన్ నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని ఈశ్వర్ విడుదల చేసి, మాట్లాడుతూ–''వాస్తవ కథని సినిమాటిక్‌గా మలుచుకుని తీశాం'' అన్నారు. ''మాస్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు రాజేష్. ''ఈ చిత్రం మంచి సక్సెస్ అవుతుందని నమ్ముతున్నాం'' అన్నారు నిర్మాతలు.

హారర్ కామెడీ


అనన్య

యశ్వంత్, రాకింగ్ రాకేష్, అనన్య, హిందోలా చక్రవర్తి, పూజ, సిమ్రాన్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'ఊ అంటావా మావా ఊఊ అంటావా మావ'. రేలంగి నరసింహారావు దర్శకత్వంలో తుమ్మల ప్రసన్న కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న రిలీజ్ కానుంది. ''కామెడీ అండ్ హారర్ చిత్రమిది. కశ్మీర్, హైదరాబాద్‌లలో చిత్రీకరించాం'' అన్నారు ప్రసన్న కుమార్.



తేజ్‌నారాయణ్, బ్రాత్‌వైట్ అజేయ సెంచరీలు

వెస్టిండీస్, జింబాబ్వే జట్ల మధ్య తొలి టెస్టును వర్షం వెంటాడుతోంది. తొలి రోజు 51 ఓవర్ల ఆట సాధ్యమైతే... రెండో రోజు 38 ఓవర్లు మాత్రమే పడ్డాయి. బులవాయోలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రెండో రోజు కూడా జింబాబ్వే బౌలర్లు వికెట్ తీయడంలో విఫలమయ్యారు. ఓవర్‌నైట్ స్కోరు 112/0తో ఆట కొనసాగించిన వెస్టిండీస్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 221 పరుగులు సాధించింది. ఓవర్‌నైట్ ఓపెనర్లు క్రెయిగ్ బ్రాత్‌వైట్ (246 బంతుల్లో 116 బ్యాటింగ్; 7 ఫోర్లు)... తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (291 బంతుల్లో 101 బ్యాటింగ్; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలు పూర్తి చేసుకున్నారు. విండీస్ దిగ్గజ క్రికెటర్ శివనారాయణ్ చందర్‌పాల్ తనయుడైన తేజ్‌నారాయణ్ తన అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... క్రెయిగ్ బ్రాత్‌వైట్‌కిది 12వ శతకం. 1999లో న్యూజిలాండ్‌తో హామిల్టన్‌లో జరిగిన తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ ఓపెనర్లు అడ్రియన్ గ్రిఫిత్ (114), షెర్విన్ క్యాంప్‌బెల్ (170) సెంచరీలు చేసిన తర్వాత... మళ్లీ విండీస్ ఓపెనర్లు టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శతకాలు చేయడం విశేషం.



‘స్వర్ణ’ సురభి


సురభి


కీర్తన

సాక్షి, హైదరాబాద్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ ఖాతాలో మూడో స్వర్ణ పతకం చేరింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఆదివారం జరిగిన జిమ్నాస్టిక్స్ అండర్–18 బాలికల టేబుల్ వాల్ట్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన కె.సురభి ప్రసన్న పసిడి పతకం సాధించింది. సురభి 11.63 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ ఈవెంట్‌లో సురభి నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. అథ్లెటిక్స్‌లో 2000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో డిండి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అథ్లెటిక్స్ అకాడమీ విద్యార్థిని చెరిపెల్లి కీర్తన (పాలకుర్తి) రజత పతకం సొంతం చేసుకుంది. కీర్తన 7 నిమిషాల 17.37 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది. బాలికల కబడ్డీ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 28–46తో మధ్యప్రదేశ్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఈనెల 11 వరకు జరగనున్న ఈ క్రీడల్లో తెలంగాణ 3 స్వర్ణాలు, 3 రజతాలు, 6 కాంస్యాలతో కలిపి మొత్తం 12 పతకాలతో 11వ స్థానంలో ఉంది.

తేజస్విన్... పసిడి జంప్

బోస్టన్: న్యూ బ్యాలెన్స్ ఇండోర్ గ్రాండ్‌ప్రి అథ్లెటిక్స్ మీట్‌లో భారత్‌కు చెందిన తేజస్విన్ శంకర్ హైజంప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. 24 ఏళ్ల తేజస్విన్ 2.26 మీటర్ల దూరం ఎగిరి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 2007 ప్రపంచ చాంపియన్, 2010 కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత డొనాల్డ్ థామస్ (బహామస్) 2.23 మీటర్లతో రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. అమెరికాలోని కన్సాస్ స్టేట్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నాక ఆడిన తొలి టోర్నీలో తేజస్విన్ స్వర్ణం సాధించడం విశేషం. గత ఏడాది బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో తేజస్విన్ కాంస్య పతకాన్ని సాధించాడు.




హర్మన్‌ప్రీత్

వేలంపై కాదు... పాక్‌తో సమరంపైనే దృష్టి

- భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్
- టి20 ప్రపంచకప్‌లో 12న పాక్‌తో పోరు
- ముంబైలో 13న డబ్ల్యూపీఎల్ వేలం

కేప్‌టౌన్: మహిళల టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌తో జరిగే సమరంపైనే తాము దృష్టి పెట్టామని, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) కోసం నిర్వహించే వేలంపై ఆలోచించడం లేదని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పేర్కొంది. దక్షిణాఫ్రికా గడ్డపై అండర్–19 అమ్మాయిల జట్టు సాధించిన వరల్డ్‌కప్ స్ఫూర్తితో తమ ప్రపంచకప్ వేట సాగుతుందని చెప్పింది. మెగా ఈవెంట్‌లో హర్మన్ సేన 12న జరిగే తమ తొలి మ్యాచ్‌లో పాక్‌లో తలపడుతుంది. మరుసటి రోజే ముంబైలో మహిళా క్రికెటర్ల వేలం కార్యక్రమం జరుగుతుంది. ఆదివారం జట్టు కెప్టెన్లతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హర్మన్ మాట్లాడుతూ ‘ప్రపంచకప్పే అన్నింటికంటే ముఖ్యమైంది. దాని తర్వాతే ఏదైనా..! ఐసీసీ మెగా ఈవెంట్‌పైనే మేం దృష్టి సారించాం. మిగతావి ఎప్పుడూ ఉండేవే. ఓ క్రికెటర్‌గా ఏది ప్రధానమో ఏది అప్రధానమో నాకు బాగా తెలుసు. దేనిపై దృష్టి సారించాలో కూడా తెలుసు. గత నెల షఫాలీ వర్మ నేతృత్వంలోని అండర్–19 మహిళల జట్టు సాధించిన వరల్డ్‌కప్‌ను మేమంతా చూశాం. జూనియర్ టీమ్ స్ఫూర్తితో మేం కూడా ప్రపంచకప్ సాధించాలనే పట్టుదలతో ఉన్నాం’ అని వివరించింది. అలాగే దేశంలో జరిగే మహిళల లీగ్‌లతో జాతీయ జట్లకు చాలా మేలు జరుగుతుందని చెప్పింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దేశాల్లో జరుగుతున్న లీగ్‌లతో ఆ జట్లు ఏ స్థాయిలో ఉన్నాయో... అలాగే డబ్ల్యూపీఎల్‌తో మన జాతీయ జట్టు, అమ్మాయిలకు ఎంతో ప్రయోజనం ఉంటుందని, నాణ్యమైన విదేశీ క్రికెటర్లతో కలిసి ఆడటం వల్ల నైపుణ్యం పెరుగుతుందని భారత కెప్టెన్ తెలిపింది.

వేలం ఇబ్బందికరమే


న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సారథులు ప్రపంచకప్ సమయంలోనే క్రికెటర్ల వేలం జరగనుండటం ఇబ్బందికరమని అభిప్రాయపడ్డారు. ‘కొందరు క్రికెటర్లు వేలంలో అమ్ముడుపోతారు. మరికొందరేమో మిగిలిపోతారు. ఇంకొందరికి ఎక్కువ ధర, కొందరికి తక్కువ ధర లభిస్తుంది. ఇది క్రికెటర్ల మానసిక స్థితిపై ప్రభావం చూపిస్తుంది’ అని న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డివైన్ పేర్కొంది. ఆసీస్ కెప్టెన్ మెగ్ లానింగ్ మాట్లాడుతూ ‘నిజంగా ఇది (వేలం) ఇబ్బందికర పరిణామమే. ప్రపంచకప్‌లో ఆడేందుకు వచ్చిన అమ్మాయిలను తప్పకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. కొందరు జీర్ణించుకుంటారు. ఇంకొందరు జీర్ణించుకోలేరు. ఇది కాస్త ఆటపై ప్రభావం చూపుతుంది’ తెలిపింది.

టాపార్డరే కీలకం: మిథాలీ



న్యూఢిల్లీ: ఈనెల 10 నుంచి దక్షిణాఫ్రికా వేదికగా జరిగే సీనియర్ మహిళల టి20 వరల్డ్‌కప్‌లో భారత అవకాశాలు టాపార్డర్ రాణించడంపైనే ఆధారపడి ఉంటాయని దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ తెలిపింది. ‘భారత టాపార్డరే కీలకం. ఓపెనర్ స్మృతి మంధాన ఫామ్‌లో ఉంది. ఆమె మ్యాచ్ విన్నర్. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కూడా బాగా ఆడుతోంది. ఇటీవలే సఫారీలో అండర్–19 మెగా ఈవెంట్ గెలుచుకొచ్చిన షఫాలీ వర్మ, రిచా ఘోష్‌ల అనుభవం కూడా భారత సీనియర్ జట్టుకు ఉపకరిస్తుంది. అయితే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లాంటి మేటి జట్లను ఓడిస్తే మిగతా జట్లపై విజయం సులువవుతుంది. బౌలింగ్‌లో సవాళ్లు ఎదురవుతాయి. ఈ కఠిన పరీక్షను ఎదుర్కోవాలంటే బౌలర్లు తమ ప్రదర్శనను మెరుగుపర్చుకోవాల్సిందే’ అని మిథాలీ విశ్లేషించింది.

తొలి టెస్టుకు హాజల్‌వుడ్ దూరం!



న్యూఢిల్లీ: భారత జట్టుతో తొలి టెస్టులో బరిలోకి దిగకముందే ఆస్ట్రేలియా జట్టు ఇబ్బందుల్లో పడింది. నాలుగు టెస్టుల గావస్కర్–బోర్డర్ ట్రోఫీ సిరీస్‌లో భాగంగా ఈనెల 9 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య నాగ్‌పూర్‌లో తొలి టెస్టు జరగనుంది. అయితే ఆస్ట్రేలియా ప్రధాన పేసర్లలో ఒకడైన జోష్ హాజల్‌వుడ్ కాలి కండరాల గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో అతను తొలి టెస్టుతో పాటు రెండో టెస్టుకూ దూరం కావడం ఖాయమైంది. 32 ఏళ్ల హాజల్‌వుడ్ ఇప్పటివరకు ఆసీస్ తరఫున 59 టెస్టులు ఆడి 222 వికెట్లు తీశాడు. ఇప్పటికే చేతి వేలి గాయంతో మిచెల్ స్టార్క్ తొలి టెస్టుకు దూరం కాగా... ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ కూడా తొలి టెస్టులో ఆడటం సందేహంగా మారింది.

కాలికట్ హీరోస్ విజయం

బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కాలికట్ హీరోస్ జట్టు 10–15, 15–9, 15–8, 15–14, 15–11తో ముంబై మెటియోస్ జట్టును ఓడించింది. నేడు జరిగే మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు తలపడుతుంది. రాత్రి 7 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

ముంబై జట్టు మెంటార్‌గా జులన్


జులన్




దేవిక

ముంబై: డబ్ల్యూపీఎల్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ తమ కోచింగ్ బృందాన్ని ఆదివారం ప్రకటించింది. ఈ బృందంలో అందరూ మాజీ మహిళా క్రికెటర్లే ఉండటం విశేషం. ఇటీవల ఆటకు గుడ్‌బై చెప్పిన భారత బౌలింగ్ దిగ్గజం జులన్ గోస్వామిని తమ జట్టు మెంటార్, బౌలింగ్ కోచ్‌గా ముంబై నియమించుకుంది. 40 ఏళ్ల జులన్ మూడు ఫార్మాట్‌లలో కలిపి 284 మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి 355 వికెట్లు పడగొట్టడంతోపాటు 1,924 పరుగులు సాధించింది. 2014 నుంచి 2016 వరకు భారత జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా పనిచేసిన మాజీ ఆల్‌రౌండర్ దేవిక పల్షికార్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించారు. 2006 నుంచి 2008 మధ్యకాలంలో దేవిక భారత్ తరఫున ఒక టెస్టు, 15 వన్డేలు ఆడింది. 2018లో ఆసియా కప్ విజేతగా నిలిచిన బంగ్లాదేశ్ జట్టు శిక్షణ బృందంలో దేవిక సభ్యురాలిగా ఉంది.

హెడ్ కోచ్‌గా చార్లెట్

ముంబై జట్టు హెడ్ కోచ్ బాధ్యతల్ని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ చార్లెట్ ఎడ్వర్డ్స్‌కు కట్టబెట్టారు. 2017లో క్రికెట్‌కు వీడ్కోలు పలికిన 43 ఏళ్ల చార్లెట్‌కు కోచింగ్‌లో విశేష అనుభవం ఉంది. మూడు ఫార్మాట్‌లలో కలిపి 309 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన చార్లెట్ 10,273 పరుగులు సాధించింది. ఇంగ్లండ్ దేశవాళీ క్రికెట్‌లో సదరన్ వైపర్స్ జట్టుకు, సదరన్ బ్రేవ్ (హండ్రెడ్ టోర్నీ) జట్టుకు, ఆస్ట్రేలియాలో మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ సిక్సర్స్ జట్టు హెడ్ కోచ్‌గా పనిచేసిన చార్లెట్ అమెరికా క్రికెట్ జట్టుకు కూడా కొంతకాలం శిక్షణ అందించారు. మరోవైపు డబ్ల్యూపీఎల్ వేలం కార్యక్రమం ఈనెల 13న ముంబైలో జరుగుతుంది. ఒక్కో జట్టు కనిష్టంగా 15 మందిని గరిష్టంగా 18 మంది క్రికెటర్లను కొనుగోలు చేసేందుకు వీలుంది. ఒక్కో జట్టు వేలంలో రూ. 12 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

అశు ‘కంచు పట్టు’

వరల్డ్ రెజ్లింగ్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నీ

జాగ్రెబ్ (క్రొయేషియా): యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాగ్రెబ్ ఓపెన్ వరల్డ్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నమెంట్‌లో పురుషుల గ్రీకో రోమన్ 67 కేజీల విభాగంలో భారత రెజ్లర్ అశు కాంస్య పతకాన్ని సాధించాడు. కాంస్య పతక పోరులో 23 ఏళ్ల అశు 5–0తో అడోమస్ గ్రిగాలియునస్ (లిథువేనియా)పై నెగ్గాడు. అశుకు 500 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 44 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో అశు 0–9తో రెజా అబ్బాసి (ఇరాన్) చేతిలో ఓడిపోయాడు. అయితే రెజా ఫైనల్ చేరుకోవడంతో... రెజా చేతిలో ఓడిపోయిన వారి మధ్య ‘రెపిచాజ్’ పద్ధతిలో అశుకు కాంస్య పతకం కోసం పోటీ పడే అవకాశం లభించింది. ‘రెపిచాజ్’ తొలి బౌట్‌లో అశు 8–0తో పోహిలెక్ (హంగేరి)పై... రెండో బౌట్‌లో 9–0తో హావర్డ్ (నార్వే)పై గెలుపొంది కాంస్య పతక బౌట్‌కు అర్హత సాధించాడు.



భార్యపై వినోద్ కాంబ్లీ దాడి

కేసు నమోదు చేసిన పోలీసులు

ముంబై: భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ తన భార్యపై దాడికి పాల్పడటంతో ముంబై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం మద్యం తాగొచ్చిన కాంబ్లీ భార్య ఆండ్రియాను దుర్భాషలాడుతూ వంటగదిలోని కుకింగ్ పాన్‌ను ఆమెపైకి విసిరాడు. ఇది ఆమె తలకు బలంగా తగిలి గాయమైంది. వెంటనే ఆసుపత్రికి వెళ్లిన ఆండ్రియా చికిత్స అనంతరం పోలీసులను ఆశ్రయించింది. 51 ఏళ్ల కాంబ్లీపై ఐపీసీ సెక్షన్లు 324 (ప్రమాదకరమైన వాటితో గాయపరచడం), 504 (ఉద్దేశపూర్వకంగా అవమానించి శాంతికి భంగం కలిగించడం) కింద కేసులు నమోదు చేశారు.



టెన్త్ క్లాస్‌లో.. పదికి పది ఇలా!

పదో తరగతి..ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశ! టెన్త్‌లో సాధించే మార్కులు, సబ్జెక్ట్ నైపుణ్యాలు భవితకు పునాదిగా నిలుస్తాయి. అంతేకాదు పదో తరగతి సబ్జెక్ట్‌ల్లో పొందే మార్కుల ఆధారంగా చేరాల్సిన ఉన్నత విద్య కోర్సుపై స్పష్టత వస్తుంది. ఇంతటి కీలకమైన టెన్త్ క్లాస్ వార్షిక పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి-2023 పరీక్షలు.. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. పదోతరగతి పరీక్షల్లో తాజా మార్పులు.. పరీక్ష విధానం.. వార్షిక పరీక్షల్లో మెరుగైన స్కోర్‌కు మార్గాల గురించి తెలుసుకుందాం..

- ఏపీ, తెలంగాణలో ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు
- రెండు రాష్ట్రాల్లోనూ ఆరు పేపర్లలోనే పరీక్షలు నిర్వహణ
- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలే కీలకం
- మంచి స్కోర్ సాధించేందుకు సబ్జెక్ట్ నిపుణుల సూచనలు


పదో తరగతి ప్రత్యేకం

‘పదో తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు, జీపీఏ సాధించాలంటే.. పాఠ్యపుస్తకాల అభ్యసనంతోపాటు అనువర్తిత దృక్పథం సొంతం చేసుకోవాలి. చదివే ప్రతి అంశాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకుంటూ.. ఆయా సబ్జెక్ట్ అంశాలపై పట్టు సాధించాలి’ అంటున్నారు సబ్జెక్ట్ నిపుణులు.

ఏప్రిల్ 3వ తేదీ నుంచి

రెండు తెలుగు రాష్ట్రాల్లో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటి నుంచే చక్కటి ప్రణాళికతో చదువు కొనసాగిస్తే.. మంచి మార్కులు సాధించడం కష్టమేమీ కాదు.

ఆరు పేపర్లుగానే

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ ఈ ఏడాది నుంచి ఆరు పేపర్లుగా పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పేపర్–1, పేపర్–2 విధానానికి స్వస్తి పలికారు. దీనికి బదులుగా ప్రతి పేపర్‌లోనూ పార్ట్–ఎ, పార్ట్–బిలు ఉంటాయి. ఇంతకు ముందు జరిగిన పేపర్–1,పేపర్–2 విధానంలో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సబ్జెక్ట్ నిపుణుల విశ్లేషణ. రెండు పేపర్ల స్థానంలో ఒకే పేపర్‌గా ఏపీలో 100 మార్కులకు, తెలంగాణలో 80 మార్కులకు ప్రతి సబ్జెక్ట్‌లోనూ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం సిలబస్ అంశాల నుంచి ఒకే పేపర్‌లో ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. పరీక్షకు కేటాయించే వ్యవధిని పెంచడం విద్యార్థులకు ఊరటనిచ్చే అంశం. తెలంగాణలో పరీక్ష సమయాన్ని మూడు గంటలుగా, ఏపీలో 3:15 గంటలుగా పేర్కొన్నారు.

సైన్స్ ఒకే పేపర్.. పార్ట్–ఎ, పార్ట్–బిగా

- గతంలో సైన్స్‌లో.. పీఎస్(ఫిజికల్ సైన్స్), ఎన్ఎస్(నేచురల్ సైన్స్) పేరుతో రెండు పేపర్లు ఉండేవి. ఇప్పుడు పీఎస్, ఎన్ఎస్ రెండింటినీ ఒకే పేపర్‌గా.. పార్ట్–ఎ, పార్ట్–బి పేరుతో ప్రశ్నలు అడుగుతారు. పార్ట్–ఎలో పీఎస్(భౌతిక రసాయన శాస్త్రం), పార్ట్–బి(జీవ శాస్త్రం) నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఏపీలో పార్ట్–ఎ, పార్ట్–బిలు 50 మార్కులు చొప్పున, తెలంగాణలో.. పార్ట్–ఎ, పార్ట్–బిలు 40 మార్కులకు చొప్పున ఉంటాయి.
- ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి బ్లూ ప్రింట్స్, మోడల్ పేపర్స్‌ను పరిశీలిస్తూ.. సబ్జెక్ట్ వారీగా ఆయా అంశాలకు ఉన్న వెయిటేజీకి అనుగుణంగా ప్రిపరేషన్ సాగించాలి. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షల్లో మంచి స్కోర్ సాధించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ పదో తరగతి పరీక్ష పేపర్ల స్వరూపం

మ్యాథమెటిక్స్

- ఒక మార్కు ప్రశ్నలు 12(12 మార్కులు), రెండు మార్కుల ప్రశ్నలు 8(16 మార్కులు), నాలుగు మార్కుల ప్రశ్నలు 8(32 మార్కులు), ఎనిమిది మార్కుల ప్రశ్నలు 5(40 మార్కులు).

జనరల్ సైన్స్

- పార్ట్–ఎ.. పీఎస్‌లో ఒక మార్కు ప్రశ్నలు 6(6 మార్కులు); రెండు మార్కుల ప్రశ్నలు 4(8 మార్కులు), నాలుగు మార్కుల ప్రశ్నలు 3(12 మార్కులు), ఎనిమిది మార్కుల ప్రశ్నలు 3(24 మార్కులు).
- పార్ట్–బి.. జీవ శాస్త్రంలో ఒక మార్కు ప్రశ్నలు 6(6 మార్కులు); రెండు మార్కుల ప్రశ్నలు 4(8 మార్కులు); నాలుగు మార్కుల ప్రశ్నలు 5(20 మార్కులు); ఎనిమిది మార్కుల ప్రశ్నలు 2(16 మార్కులు).

సోషల్ స్టడీస్

- ఒక మార్కు ప్రశ్నలు 12(12 మార్కులు), రెండు మార్కుల ప్రశ్నలు 8(16 మార్కులు), నాలుగు మార్కుల ప్రశ్నలు 8(32 మార్కులు), ఎనిమిది మార్కుల ప్రశ్నలు 5(40 మార్కులు).

ఇంగ్లిష్

రెండు మార్కుల ప్రశ్నలు 5(10 మార్కులు); రెండు మార్కుల ప్రశ్నలు 3(6 మార్కులు), ప్యాసేజ్ ఆధారిత మరో రెండు మార్కుల ప్రశ్నలు 2(4 మార్కులు) అడుగుతారు. పోస్టర్ ఆధారిత ప్రశ్నలు 5(10 మార్కులు). సెక్షన్–బికు 40 మార్కులు. సెక్షన్–సికు 30 మార్కులు.

తెలుగు.. పద్య,గద్య భాగాలు, వ్యాకరణం

- ఎనిమిది మార్కుల ప్రశ్నలు 7(56 మార్కులు), 4 మార్కుల ప్రశ్నలు 3(12 మార్కులు), స్వల్ప సమాధాన, బహుళైచ్ఛిక ప్రశ్నలకు 32 మార్కులు.
- అన్ని సబ్జెక్ట్‌లలోనూ 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

తెలంగాణ పదో తరగతి పరీక్ష పేపర్ల స్వరూపం

- సూక్ష్మ లఘు సమాధాన ప్రశ్నలు ఆరు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు(మొత్తం 12 మార్కులు).
- లఘు సమాధాన ప్రశ్నలు 6 ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు (మొత్తం 18మార్కులు).
- వ్యాసరూప సమాధాన ప్రశ్నలు ఆరు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు అయిదు మార్కులు (మొత్తం 30 మార్కులు).
- పార్ట్–బి పేరుతో బిట్ పేపర్ నుంచి 20 మార్కులకు బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు.
- ఇలా మొత్తం పార్ట్–ఎ, పార్ట్–బి నుంచి 80 మార్కులకు ప్రతి సబ్జెక్ట్‌లో పరీక్ష జరుగుతుంది.

సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్ ఇలా

మ్యాథమెటిక్స్

పదో తరగతి స్థాయిలో విద్యార్థులు క్లిష్టంగా భావించే సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్. సిలబస్ అంశాలను పూర్తిగా అధ్యయనం చేస్తూ.. ప్రాక్టీస్ చేయడం ద్వారా ఈ సబ్జెక్ట్‌పై పట్టు సాధించొచ్చు. సంఖ్యా వ్యవస్థ; బీజగణితం; నిరూపక రేఖాగణితం; రేఖాగణితం; క్షేత్రమితి; త్రికోణమితి; సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. ప్రాబ్లమ్ సాల్వ్ చేయడంతోపాటు కారణాల నిరూపణ, వ్యక్తీకరణ, ఒక సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడం వంటి నైపుణ్యాలు పొందాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే.. రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. పాఠ్యపుస్తకంలో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు; సమితులు; బహుపదులు; రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు; సంభావ్యత; సాంఖ్యక శాస్త్రం; త్రికోణమితి; క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలను సాధన చేయాలి.

–కె.సారథి, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ నిపుణులు

సైన్స్ పేపర్.. పార్ట్–ఎ.. పీఎస్

సైన్స్ సబ్జెక్ట్‌లో పార్ట్–ఎ ఫిజికల్ సైన్స్(పీఎస్)లో మంచి మార్కులు సాధించాలంటే.. అప్లికేషన్ అప్రోచ్‌తో చదవడం ఎంతో ముఖ్యం. ఆయా చాప్టర్లకు సంబంధించిన అంశాలను నిజ జీవిత సంఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగిస్తే.. విషయ పరిజ్ఞానం మరింత పెంపొందించుకోవచ్చు. విషయ అవగాహనతోపాటు, ప్రశ్నించడం -పరికల్పన చేయడం; ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు–ప్రాజెక్ట్ పనులు; పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా కృషి చేయాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై పట్టు సాధించాలి. మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల లఘు, అతి స్వల్ప, బహుళైచ్ఛిక ప్రశ్నలకు సులువుగా సమాధానాలిచ్చే పట్టు లభిస్తుంది. ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభించి.. మంచి మార్కులు సొంతమవుతాయి.

–ఎం.రవీంద్ర, ఫిజిక్స్ సబ్జెక్ట్ నిపుణులు

సైన్స్ పేపర్.. పార్ట్–బి ఎన్ఎస్(నేచురల్ సైన్సెస్)

సైన్స్ పేపర్‌లోనే పార్ట్–బిగా ఉండే జీవశాస్త్రంలో రాణించేందుకు.. అవగాహన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలను పెంచుకోవాలి. పుస్తకాల్లోని ఆయా అంశాలకు సంబంధించి ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి. విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నేర్చుకున్న అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించే విధంగా చదవాలి. ప్రయోగాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం ఎంతో మేలు చేస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి. డయాగ్రమ్స్ విషయంలో భాగాలను గుర్తించడమే కాకుండా.. వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

–పి.నీలకంఠం, సబ్జెక్ట్ టీచర్

తెలుగు

ఫస్ట్ లాంగ్వేజ్‌గా ఉండే తెలుగు పేపర్‌లో మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులు.. ముందుగా పద్యభాగం, గద్యభాగంలోని అన్ని అంశాలను గుర్తుంచుకోవాలి. వాటిని పునశ్చరణ చేసుకోవాలి. పాఠాన్ని కేవలం చదవడంతో సరి పెట్టకుండా.. సారాంశాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ప్యాసేజ్ పేరిట ఉండే అపరిచిత గద్యం ఎంతో ముఖ్యం. ఈ విషయంలో సొంతగా ఆలోచిస్తూ చదవాలి. ఉపవాచకానికి సంబంధించి ఇతివృత్తం, ప్రాముఖ్యత, పాత్రలు, వాటి ప్రాధాన్యత, వ్యక్తుల ప్రవర్తన శైలి తదితర అంశాల ద్వారా ఇచ్చే సందేశాన్ని తెలుసుకోవాలి. వ్యాకరణంలో మంచిగా ప్రతిభ చూపాలంటే.. సంధులు, సమాసాలు, సంయుక్తార్థాలు, ఉత్పత్త్యర్థాలు, జాతీయాలు బాగా చదవాలి.

–జి.వెంకట రమణ, ఎస్ఏ–తెలుగు

ఇంగ్లిష్

ఇంగ్లిష్ పేపర్‌లో మంచి మార్కులు పొందేందుకు వెర్బల్, నాన్–వెర్బల్ అంశాలు బాగా చదవాలి. ఉదాహరణకు టేబుల్స్, బార్ డయాగ్రమ్స్, పై చార్ట్స్ తదితర అంశాలను అధ్యయనం చేయాలి. సొంతంగా విశ్లేషించేలా నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం పాత ప్రశ్న పత్రాల సమాధానాలను పరిశీలించడం కూడా మేలు చేస్తుంది. ప్రతి పాఠం చివరలో ఉండే కాంప్రహెన్సివ్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రతి పాఠానికి సంబంధించి సారాంశాన్ని గ్రహించి సొంతగా రాసుకునే అలవాటు చేసుకోవాలి. పోయెట్రీ ప్రశ్నల్లో మంచి మార్కుల సాధన కోసం సదరు పద్యంలో ముఖ్య పదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. వీటితోపాటు పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్. ఈ విషయంలో చదవడంతోపాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందేందుకు మరింత ఆస్కారం లభిస్తుంది. అదే విధంగా అపరిచిత గద్యం(అన్ నోన్ ప్యాసేజెస్) సారాంశాన్ని గ్రహించేలా చదవాలి. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చుయేషన్స్, బాడీ ఆఫ్ ది లెటర్ వంటి అంశాలపై పట్టు ఎంతో అవసరం.

–డి.హనుమంతరావు, ఎస్ఏ–ఇంగ్లిష్

సోషల్ స్టడీస్

ఈ సబ్జెక్ట్‌లో మంచి మార్కులు పొందాలంటే.. సమకాలీన అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. పాఠ్య పుస్తకంలోని ఏదైనా ఒక అంశాన్ని చదువుతున్నప్పుడు దానికి సంబంధించి మన నిజ జీవితంలో జరుగుతున్న సంఘటనలతో పోల్చుకుంటూ చదవాలి. సమకాలీన అంశాల విషయంలో ప్రతిస్పందన, ప్రశ్నించడం, ప్రశంస/అభినందనలపై సాధన చేయడం ఎంతో అవసరం. అవగాహనకు సంబంధించి ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి.. సొంత పరిజ్ఞానంతో రాసే నైపుణ్యం పెంచుకోవాలి. జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో భారతదేశం -భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత, ఉత్పత్తి–ఆదాయం, సుస్థిరాభివృద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధ కాలాల సమయంలో ప్రపంచం; సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రను ప్రత్యేక దృష్టితో చదవాలి. సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగల నుంచి అనుసరించారు తదితర కోణాల్లో చదవాలి.

–బి.శ్రీనివాస్, సబ్జెక్ట్ టీచర్

పదో తరగతి వార్షిక పరీక్షలు.. ముఖ్యాంశాలు

- ఏపీ, తెలంగాణలో ఏప్రిల్ 3 నుంచి వార్షిక పరీక్షలు.
- రెండు రాష్ట్రాల్లో పేపర్–1, పేపర్–2 విధానానికి స్వస్తి.
- కేవలం ఆరు పేపర్లలోనే పరీక్షలు.
- ఏపీలో ప్రతి సబ్జెక్ట్‌లో 100 మార్కులకు, తెలంగాణలో ప్రతి సబ్జెక్ట్‌కు 80 మార్కులకు పరీక్ష.
- సైన్స్‌కు సంబంధించి పార్ట్–ఎగా పీఎస్, పార్ట్–బిగా ఎన్ఎస్ సబ్జెక్ట్‌లతో ఒకటే ప్రశ్న పత్రం.
- వ్యాసరూప సమాధాన ప్రశ్నల్లో ఇంటర్నల్ ఛాయిస్ విధానం.

పదో తరగతి విద్యార్థులు.. దృష్టి సారించాల్సిన అంశాలు

- సిలబస్‌లో ఆయా సబ్జెక్ట్‌లు, చాప్టర్లలో సిలబస్‌ను పరిశీలించాలి.
- ముఖ్యమైన చాప్టర్లను వెయిటేజీ ఆధారంగా వర్గీకరించుకోవాలి.
- అత్యధిక వెయిటేజీ ఉండే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- ఇప్పటి నుంచే ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు పెంచుకోవాలి.
- మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్ కాన్సెప్ట్స్, థీరమ్స్‌ను బాగా అధ్యయనం చేయాలి.
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	910	60,842
నిఫ్టీ ▲	244	17,854

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,007	▽	194
డోజోన్స్	33,926	▽	128
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,902	▲	82
డాక్స్	15,477	▽	33
షాంఘై (20వ తేదీ ముగింపు)	3,263	▽	22
నికాయ్	27,509	▲	107

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.41	83.08
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	88.03	91.16
€	యూరో	ఒకటి	98.76	102.13
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	62.98	65.05
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.94	59.33
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.69	63.75
SAR	సౌదీ రియాల్	ఒకటి	20.24	22.01
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.31	23.07
¥	చైనా యువాన్	[illegible]	10.26	12.85


పన్ను భారం తగ్గించుకోవాలంటే..



- ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్, ఎన్‌పీఎస్ మెరుగు
- బీమా, రాబడి కోసం యులిప్‌లు
- ఎన్ఎస్‌సీ, ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీలు
- కేవలం పన్ను ఆదా ఒక్కటే చూడొద్దు
- రిస్క్, రాబడి కోణంలో ఎంపిక ఉండాలి

వేతన జీవులకు ఆదాయపన్ను చట్టంలోని పలు సెక్షన్లు గణనీయంగా పన్ను మినహాయింపులు ఇస్తున్నాయి. పాత పన్ను విధానంలో రూ.5 లక్షల వరకు ఆదాయంపై పన్ను లేకపోగా, అందుబాటులోని అన్ని మినహాయింపులు, తగ్గింపు ప్రయోజనాలను వినియోగించుకుంటే మరో రూ.5 లక్షల ఆదాయంపైనా పన్ను భారం లేకుండా చూసుకోవచ్చు. ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచే తమ ఆదాయం, పన్ను బాధ్యతలకు అనుగుణంగా ప్రణాళిక వేసుకుని, పెట్టుబడులు చేసుకోవడం మెరుగైన మార్గం. కానీ, చాలా మందికి ఇది ఆచరణలో అసాధ్యంగా ఉంటుంది. ఆర్థిక సంవత్సరం చివరిలోనే పన్ను ఆదా బాధ్యతలపై ఎక్కువ మంది దృష్టి సారిస్తుంటారు. ఈ సమయంలో పన్ను భారం తగ్గించుకునేందుకు అందుబాటులో ఉన్న సాధనాలపై కథనం ఇది.

ఏడాది చివర్లో వ్యవధి తక్కువగా ఉన్నప్పుడు, హడావిడిగా చేసే పెట్టుబడుల్లో తప్పులకు చోటు ఇవ్వకూడదు. అదే సమయంలో పన్ను ఆదా ఒక్కటే ప్రామాణిక అంశం కూడా కాకూడదు. ఒకవైపు పన్ను ఆదా ప్రయోజనాన్ని ఇస్తూనే, మరోవైపు చేసిన పెట్టుబడి మంచి ప్రతిఫలాన్ని కూడా అందించేలా ఉండాలి. పైగా మనలో కొందరు చిన్న వయసులో ఉంటారు. మరికొందరు మధ్య వయసులో, కొందరు రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉండొచ్చు. కొందరి ఆర్జన మెరుగ్గా, కొందరి ఆర్జన మధ్యస్థంగా, తక్కువగాను ఉండొచ్చు. ఆదాయానికి అనుగుణంగా తీసుకునే రిస్క్ సామర్థ్యం మారిపోతుంటుంది. ఉదాహరణకు ఈఎల్ఎస్ఎస్ అన్నది సెక్షన్ 80సీ కింద అర్హత కలిగిన పన్ను సాధనాల్లో ఒకటి. అచ్చం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే ఈ సాధనంలో పెట్టుబడులపై రాబడి దీర్ఘకాలంలో ఏటా 12 శాతానికి పైనే లభిస్తుంది. ఇందులో వ్యయాలు చాలా తక్కువ. మూడేళ్ల లాకిన్ పీరియడ్ ముగిసిన తర్వాత లిక్విడిటీ సమస్యే ఉండదు. కానీ, కొందరికి ఈక్విటీలు నచ్చకపోవచ్చు. కొందరికి పెట్టుబడులు అన్నింటినీ ఈక్విటీలకు కేటాయించడం ఇష్టం లేకపోవచ్చు. అందుకనే అందుబాటులో సాధనాలు, వాటి మంచి చెడులను అర్థం చేసుకుంటే, ఇన్వెస్టర్లు తమకు నచ్చినవి ఎంపిక చేసుకోవచ్చు.



యులిప్‌లు



యులిప్‌లలో గడిచిన ఐదేళ్ల కాలంలో వార్షిక రాబడి 8–9 శాతం మధ్య ఉంది. యులిప్ అన్నది ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే బీమా సాధనం. బీమా సంస్థలు ఒకవైపు పాలసీదారులకు బీమా రక్షణ ఇస్తూ.. మరోవైపు ఈక్విటీ, డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెట్టి, వచ్చిన రాబడిని పంచుతాయి. యులిప్‌లోనూ ఎన్‌పీఎస్‌లో మాదిరే ఈక్విటీ, డెట్ మధ్య కేటాయింపులను మార్చుకునే సౌలభ్యం ఉంది. ఇలా మార్చుకుంటే పన్ను కట్టక్కర్లేదు. ఈక్విటీల విలువలు గరిష్టాలకు చేరినప్పుడు డెట్‌కు మారి, మార్కెట్లు దిద్దుబాటుకు గురైనప్పుడు తిరిగి ఈక్విటీల్లోకి పెట్టుబడులను మళ్లించుకోవచ్చు. రాబడులపై పన్ను లేకపోవడం మరో ఆకర్షణీయ అంశం. యులిప్‌లో పెట్టుబడులపై ఐదేళ్ల పాటు లాకిన్ ఉంటుంది. ఆ తర్వాత కోరుకున్నప్పుడు పాక్షిక ఉపసంహరణలు చేసుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో మాదిరి ఇందులో ఫండ్ మేనేజర్‌ను మార్చుకోవడానికి అవకాశం లేదు. యులిప్‌ను జీవితంలో ముఖ్యమైన లక్ష్యాల కోసం పెట్టుబడి సాధనంగా ఉపయోగించుకోవచ్చు. వార్షిక పెట్టుబడితో పోలిస్తే జీవిత బీమా కవరేజీ కనీసం 10 రెట్లు ఉంటే సెక్షన్ 10(10డీ) కింద మెచ్యూరిటీ సమయంలో తీసుకునే మొత్తంపైనా పన్ను ఉండదు.

ఎన్‌పీఎస్- మూడు ప్రయోజనాలు

PFRDA NATIONAL PENSION SCHEME

ఇందులో రాబడులు గడిచిన ఐదేళ్ల కాలంలో వార్షికంగా 8–11 శాతం మధ్య ఉన్నాయి. ఇందులో చేసే పెట్టుబడులు రిటైర్మెంట్ వరకు లాకిన్‌లోనే ఉంటాయి. డెట్ నుంచి ఈక్విటీ, ఈక్విటీ నుంచి డెట్‌కు అలోకేషన్‌ను మార్చుకునే సౌలభ్యం ఉంది. ఎన్‌పీఎస్‌కు సంబంధించి మూడు రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలను ఇందులో ఇన్వెస్ట్ చేసి, ఆ మొత్తంపై పన్ను లేకుండా చూసుకోవచ్చు. సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద రూ.50,000 మొత్తంపై అదనపు పన్ను మినహాయింపు కూడా అందుబాటులో ఉంది. ఉద్యోగి మూలవేతనం, డీఏలో 10 శాతాన్ని ఎన్‌పీఎస్‌కు కంపెనీలు జమ చేస్తే, ఆ మొత్తంపైనా పన్ను ఉండదు. సెక్షన్ 80సీసీడీ (2) కింద ఈ ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. కనుక ఎన్‌పీఎస్ ఇచ్చే ప్రయోజనాలతను వేరొక సాధనంతో పోల్చడం సరికాదు. ఎన్‌పీఎస్‌లో ఈక్విటీ, కార్పొరేట్ బాండ్స్, గవర్నమెంట్ బాండ్స్ (గిల్ట్ ఫండ్స్) అనే మూడు కేటగిరీలు ఉంటాయి. ఇన్వెస్టర్లు ఈక్విటీలకు గరిష్టంగా 75 శాతం మించకుండా కేటాయింపులు చేసుకోవచ్చు. మిగిలిన రెండింటిలో నూరు శాతం కేటాయింపులకు అనుమతి ఉంది. మూడింటి మధ్య తమ రిస్క్‌స్థాయిని బట్టి కేటాయింపుల్లో మార్పులు చేసుకోవచ్చు. ఏడాదిలో నాలుగు సార్లు ఇలా చేసుకునేందుకు అనుమతి ఉంది. పనితీరు నచ్చకపోతే ఫండ్ మేనేజర్లను కూడా మార్చుకోవచ్చు. మార్కెట్ల పట్ల అవగాహన ఉన్న వారికి ఇది అనుకూలమైన టూల్. వీటికి అదనంగా ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ విభాగం కూడా ఉంది.

ఎన్‌పీఎస్‌లో విభాగాల వారీ రాబడులు

విభాగం	ఏడాది	మూడేళ్లు	ఐదేళ్లు (%లో)
ఈక్విటీ ఫండ్స్	2.91	14.76	11.10
కార్పొరేట్ బాండ్‌ఫండ్స్	3.30	7.31	7.66
గిల్ట్‌ఫండ్స్	3.29	6.09	8.02
ఆల్టర్నేట్ ఫండ్స్	6.27	7.13	7.55

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్



ఇది ఐదేళ్ల పథకం. తర్వాత మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. ఇందులో వడ్డీ రేటు ప్రస్తుతం 8 శాతంగా ఉంది. 60 ఏళ్లు దాటిన వారు క్రమం తప్పకుండా ప్రతి 3 నెలలకు ఒకసారి (త్రైమాసికం ఆరంభంలో) ఆదాయం అందుకునేందుకు ఇది అనుకూలం. ఇందులో పెట్టుబడులను సెక్షన్ 80సీ కింద చూపించి మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. పెట్టుబడిపై వచ్చే వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. కాకపోతే 60 ఏళ్లు నిండిన వారికి ఏటా రూ.50 వేల వరకు వడ్డీ ఆదాయంపై పన్ను మినహాయింపు అమల్లో ఉంది. అంటే ఈ పథకంలో రూ.6.5 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఒక ఏడాదిలో రూ.50,000 పన్ను లేని ఆదాయం అందుకోవచ్చు. వార్షికాదాయం రూ.50వేలు మించితే టీడీఎస్ అమలు చేస్తారు.

పీపీఎఫ్



ఇందులో ప్రస్తుత వడ్డీ రేటు 7.1 శాతం. పెట్టుబడులు 15 ఏళ్ల పాటు లాకిన్‌లో ఉంటాయి. పెట్టుబడిపై సెక్షన్ 80సీ కింద మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. పెట్టుబడి, రాబడి, ఉపసంహరణ ఇలా ఏ దశలోనూ పన్ను చెల్లించాల్సిన అవసరం లేని సాధనం ఇది. కనుక స్థిరాదాయ పథకాలతో పోలిస్తే మెరుగైనది. బ్యాంక్ ఎఫ్‌డీల పైనా ఇంతే వడ్డీ రేటు లభిస్తున్నప్పటికీ, అది పన్ను పరిధిలోకి వస్తుంది. పీపీఎఫ్‌ను అన్ని ప్రభుత్వరంగ, ప్రైవేటు వాణిజ్య బ్యాంకుల్లో ప్రారంభించొచ్చు. పోస్టాఫీసులోనూ దీన్ని తెరవొచ్చు. బ్యాంకుల్లో మరింత సౌకర్యంగా ఉంటుంది. సొంత ఖాతా నుంచే పీపీఎఫ్ కంట్రిబ్యూషన్ బదిలీ చేసుకోవచ్చు. కోరుకున్నప్పుడు ఈ-స్టేట్‌మెంట్ తీసుకోవచ్చు. ఆరో ఏట తర్వాత పాక్షిక ఉపసంహరణకు అనుమతి ఉంటుంది. నాలుగో ఏడాది చివరి నాటికి ఉన్న బ్యాలన్స్‌నుంచి సగం తీసుకోవచ్చు. 15 ఏళ్ల కాల వ్యవధి తర్వాత మరో ఐదేళ్లు పొడిగించుకోవచ్చు. మూడో ఏట నుంచి ఆరో ఏట వరకు బ్యాలన్స్‌పై రుణం తీసుకునే సదుపాయం కూడా ఉంది.

ఈఎల్ఎస్ఎస్ పథకాల రాబడులు



విభాగం	మూడేళ్లు	ఐదేళ్లు (%లో)
కెనరా రొబెకో ట్యాక్స్‌సేవర్	20.82	15.44
మిరే అస్సెట్ ట్యాక్స్ సేవర్	19.24	14.31
డీఎస్‌పీ ట్యాక్స్ సేవర్	18.42	12.43
ఐడీఎఫ్‌సీ ట్యాక్స్ అడ్వాంటేజ్	23.54	12.09
ఐసీఐసీఐ ప్రు.లాంగ్‌టర్మ్ ఈక్విటీ	16.21	11.90

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) పథకాల్లో చేసే ప్రతీ పెట్టుబడికి మూడేళ్ల లాకిన్ ఉంటుంది. ఆ తర్వాతే ఉపసంహరించుకోగలరు. ప్రస్తుతం మార్కెట్లు అనిశ్చితుల మధ్య ఉన్నాయి. కనుక ఒకే విడత ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కంటే, నెలవారీ వాయిదాల రూపంలో పెట్టుబడులు పెట్టుకోవడం అనుకూలం. లంప్‌సమ్‌గా ఇన్వెస్ట్ చేస్తే కనీసం, ఐదు, ఏడేళ్లపాటు కదపకుండా కొనసాగించడం ద్వారా రాబడులు పొందొచ్చు. ఇన్వెస్ట్ చేసిన తర్వాత, ఒకవేళ మార్కెట్లు కిందకు పడిపోయి నష్టాలు చూపిస్తుంటే, ఆందోళన చెందే తరహా వ్యక్తిత్వం ఉన్న వారికి అనుకూలం కాదు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో రూ.1.5 లక్షల మొత్తం ఇన్వెస్ట్ చేసి ఆ మేరకు పన్ను లేకుండా చూసుకోవచ్చు. ఉపసంహరించుకున్నప్పుడు దీర్ఘకాల మూలధన లాభాల పన్ను అమలవుతుంది. రూ.లక్షకు మించిన లాభంపై 10 శాతం పన్ను చెల్లించాలి.



జీవిత బీమా పథకాలు



జీవిత బీమా ఎండోమెంట్ ప్లాన్లలో రాబడి దీర్ఘకాలానికి 5 శాతంగా ఉంటుంది. పన్ను ఆదా కోసం ఇది మెరుగైన ఎంపిక కాదు. దీనికంటే కూడా యులిప్‌లు మెరుగైనవి. లేదంటే ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. బీమా ఎండోమెంట్ ప్లాన్లలో జీవిత బీమా కవరేజీ కూడా చెల్లించే ప్రీమియానికి నామమాత్రంగానే ఉంటుంది. రూ.50 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ రూ.12,0000 ప్రీమియానికి వస్తుంది. కానీ, ఎండోమెంట్ ప్లాన్‌లో రూ.50 లక్షల కవరేజీ కావాలంటే ఏటా రూ.4-5 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. జీవితానికి రక్షణ కోణంలోనే బీమా ఉత్పత్తులు కొనుగోలు చేయాలి.

ఎన్ఎస్‌సీ, పన్ను ఆదా ఎఫ్‌డీలు



ఎన్ఎస్‌సీలను పోస్టాఫీసు నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. పన్ను ఆదా ఎఫ్‌డీని బ్యాంకుల్లో తీసుకోవచ్చు. రెండింటిలోనూ లాకిన్ పీరియడ్ ఐదేళ్లు. ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీపై డీసీబీ బ్యాంక్ అత్యధికంగా 8.10 శాతం రేటును ఆఫర్ చేస్తుంటే, యాక్సిస్ బ్యాంక్ రూ.7.75 శాతం ఇస్తోంది. మిగిలిన బ్యాంకుల్లో 6.70 శాతం నుంచి 7.50 శాతం మధ్య రేట్లు ఉన్నాయి. పన్ను ఆదా ఎఫ్‌డీ అంటే పెట్టుబడిపైనే. వడ్డీ రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. వ్యక్తిగత ఆదాయానికి కలుస్తుంది. ఎన్ఎస్‌సీ కేవలం పోస్టాఫీసులోనే కొనుగోలు చేసుకోగలరు. దీంతో పోలిస్తే ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీని బ్యాంకుల్లో ప్రారంభించడం, క్లోజ్ చేసుకోవడం సులభం. కొన్ని బ్యాంక్‌లు ఆన్‌లైన్‌లోనూ ఆఫర్ చేస్తున్నాయి. ఎన్ఎస్‌సీలో ప్రస్తుతం 7 శాతం రేటు అమల్లో ఉంది. ఎన్ఎస్‌సీలో పెట్టుబడిని సెక్షన్ 80సీ కింద మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. వడ్డీ రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది.

సుకన్య సమృద్ధి యోజన



ప్రస్తుత వడ్డీ 7.6%. కుమార్తెల పేరిట ప్రారంభించి, పెట్టుబడులు పెట్టుకునే పథకం ఇది. వారికి 18 ఏళ్లు వచ్చే వరకు దీన్ని కొనసాగించుకోవచ్చు. పదేళ్లలోపు ఆడపిల్లలను కలిగిన తల్లిదండ్రులు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు. ఏటా రూ.1.50 లక్షల పెట్టుబడిపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. గడువు ముగిసిన తర్వాత తీసుకునే మొత్తంపైనా పన్ను ఉండదు. ఈ పథకంలో వడ్డీ రేటును కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తుంటుంది. బ్యాంకు శాఖలు, తపాలా కార్యాలయాల్లో ప్రారంభించుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్టంగా ఇద్దరు కుమార్తెల పేరిట దీన్ని తెరుచుకునేందుకు అనుమతి ఉంది. ఇద్దరి పేరిట ఖాతాలు తెరిచినా సెక్షన్ 80సీ కింద ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలకే పన్ను మినహాయింపు కోరగలరు.

రిటైర్మెంట్ మ్యూచువల్ ఫండ్స్



వీటిల్లో గత మూడేళ్ల కాలంలో చూస్తే వార్షిక రాబడులు 7–13 శాతం మధ్య ఉన్నాయి. రిటైర్మెంట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను సైతం సెక్షన్ 80 సీ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ మ్యూచువల్ ఫండ్స్ పథకాలు పెట్టుబడుల్లో 40 శాతాన్ని ఈక్విటీలకు, 55–60 శాతాన్ని డెట్ సాధనాలకు కేటాయిస్తుంటాయి. ఫ్రాంక్లిన్ పెన్షన్ ఫండ్, యూటీఐ రిటర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ ఫండ్ ఇందుకు ఉదాహరణలు. వీటిల్లో రిస్క్ తక్కువ. తక్కువ రిస్క్ ఉండాలని కోరుకునే ఇన్వెస్టర్లు రిటైర్మెంట్ కోసం వీటిల్లో ఇన్వెస్ట్ చేసి సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. వీటిల్లో పెట్టుబడులకు ఐదేళ్ల లాకిన్ ఉంటుంది. రాబడి మాత్రం పన్ను పరిధిలోకి వస్తుంది. డెట్‌కు ఎక్కువ కేటాయింపులు చేస్తే, డెట్ ఫండ్స్ మాదిరిగా లాభంపై 20 శాతం పన్ను చెల్లించాలి. లాభం నుంచి ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించొచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-2-2023	
విశాఖ	460–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445–00
విజయవాడ	445–00
5-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	412–00
వరంగల్	414–00

ఐపీఓ బాటన ఐఆర్ఈడీఏ, వాప్కోస్

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2 ప్రభుత్వ రంగ కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను చేపట్టే ప్రణాళికలున్నట్లు దీపమ్ కార్యదర్శి తుహిన్ కాంత పాండే తెలియజేశారు. శుద్ధ ఇంధన రంగ ఫైనాన్స్ మినీ రత్న కంపెనీ ఐఆర్ఈడీఏ, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ వాప్కోస్ జాబితాలో ఉన్నట్లు పేర్కొన్నారు. తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ. 51,000 కోట్ల లక్ష్యంలో భాగంగా ఈ రెండు కంపెనీల డిజిన్వెస్ట్‌మెంట్‌ను చేపట్టనున్నట్లు తెలియజేశారు.

ఫండ్ పెట్టుబడులను కానుకగా ఇవ్వొచ్చా..?

ఫండ్ పథకంలో నాకు పెట్టుబడులు ఉన్నాయి. వీటిని ఎవరికైనా బహుమతిగా ఇవ్వొచ్చా? – శ్రీలలిత

మ్యూచువల్ ఫండ్స్ పథకంలోని యూనిట్లు ఒకరికి బదిలీ చేయడం కానీ, బహుమతిగా ఇవ్వడం కానీ కుదరదు. ఇన్వెస్టర్ తన పేరిట ఉన్న యూనిట్లు వేరొకరికి బదిలీ చేయడం అన్నది కేవలం.. ఇన్వెస్టర్ మరణించిన సందర్భాల్లోనే చోటు చేసుకుంటుంది. అటువంటి సందర్భంలో నామినీ క్లెయిమ్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుంది. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను పిల్లలకు బహుమతిగా ఇవ్వాలని అనుకుంటే నేరుగా వారి పేరుతో ఇన్వెస్ట్ చేయడం ఒక్కటే మార్గం. పిల్లల వయసు 18 ఏళ్లలోపు ఉన్నా ఇది సాధ్యపడుతుంది. అటువంటప్పుడు పిల్లలు మేజర్ అయ్యే వరకు తల్లిదండ్రులే సంబంధిత పెట్టుబడులపై సంరక్షకులుగా నిర్ణయాధికారం కలిగి ఉంటారు. పిల్లల పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో పాటు, గార్డియన్ కేవైసీ వివరాలను మ్యూచువల్ ఫండ్ సంస్థ అడుగుతుంది. పిల్లల పేరిట (మైనర్లు) ఉన్న ఫండ్ పెట్టుబడులను విక్రయించగా వచ్చిన ఆదాయం.. తల్లిదండ్రుల ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది. ఒకవేళ పిల్లల వయసు 18 ఏళ్లు నిండిన తర్వాత పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే అది వారి వ్యక్తిగత ఆదాయం కిందకే వస్తుంది. మీ పేరిట ఉన్న పెట్టుబడులను విక్రయించేసి, వచ్చిన మొత్తాన్ని పిల్లల బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలి. ఆ తర్వాత వారి పేరిట కొనుగోలు చేసుకోవాలి. మూడో వ్యక్తి (థర్డ్ పార్టీ) నుంచి పెట్టుబడిని ఫండ్స్ సంస్థలు ఆమోదించవు. ఫండ్స్ యూనిట్లు కొనుగోలు చేస్తున్న వ్యక్తి స్వయంగా ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. కనుక బహుమతిగా ఇవ్వాలనుకునే వారికి నగదు బదిలీ చేసి, కొనుగోలు చేసుకోవడం ఒక్కటే మార్గం.




ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను ప్రతి నెలా ఇన్వెస్ట్ చేస్తున్న ఓ మ్యూచువల్ ఫండ్ పథకం స్టార్ రేటింగ్ 4 ఉండేది కాస్తా, 3కు తగ్గింది. అందుకుని ఈ పెట్టుబడులను విక్రయించేసి, తిరిగి 4 లేదా 5 స్టార్ పథకంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. అయితే ఈ మొత్తం ఒకే విడత చేయాలా..? లేక సిస్టమ్యాటిక్ విత్ డ్రాయల్ (ఎస్‌డబ్ల్యూపీ) రూపంలో చేసుకోవాలా? – రాజ్‌దీప్ సింగ్

ఓ పథకం నుంచి వైదొలిగేందుకు స్టార్ రేటింగ్‌ను 4 నుంచి 3కు తగ్గించడం ఒకే కారణంగా ఉండకూడదు. 3 స్టార్ చెత్త పనితీరుకు నిదర్శనం కానే కాదు. 3 స్టార్ రేటింగ్ కలిగిన చాలా పథకాలు ఆయా విభాగాల్లోని సగటు పనితీరుకు మించి రాబడులను ఇస్తున్నాయి. ఒక్కసారి ఒక పథకంలో పెట్టుబడులు కొనసాగించకూడదని నిర్ణయించుకున్న తర్వాత ఇక ఎస్‌డబ్ల్యూపీ ఆలోచనే అక్కర్లేదు. కాకపోతే ఎగ్జిట్‌లోడ్, మూలధన లాభాల అంశాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించుకోండి. విడతలుగా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం సరైనది. ముందుగా ఎగ్జిట్ లోడ్ లేని, దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష వరకు పన్ను లేని మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఇది పన్ను ఆదా అవుతుంది.


తాన్లా ప్లాట్‌ఫామ్స్ — జియోజిత్ ఫైనాన్షియల్ — కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 630 **టార్గెట్:** రూ. 920

ఎందుకంటే: కమ్యూనికేషన్స్ ప్లాట్‌ఫామ్‌ను సర్వీసులుగా అందించే సీపాస్ (ఇక్లు) కంపెనీ తాన్లా ప్లాట్‌ఫామ్స్. దేశీయంగా అతిపెద్ద సంస్థగా నిలుస్తోంది. దాదాపు 40 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. వార్షికంగా 800 బిలియన్ల ఇంటరేక్షన్స్‌ను హ్యాండిల్ చేస్తోంది. 2020–25 మధ్య కాలంలో దేశీయంగా సీపాస్ పరిశ్రమ 30 శాతం వార్షిక వృద్ధిని సాధించగలదని అంచనా. ఇందుకు ప్రధానంగా గరిష్టస్థాయిలోని ప్రభుత్వ నియంత్రణలు, వేగంగా పెరుగుతున్న మొబైల్ కస్టమర్ల సంఖ్య సహకరించనున్నాయి. ట్రూబ్లక్, వైజ్‌లీ ప్లాట్‌ఫామ్ తదితర ప్లాట్‌ఫామ్ బిజినెస్‌ల ద్వారా ఆదాయం పుంజుకోనున్నట్లు కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. వైజ్‌లీ.. క్లౌడ్ ఆధారిత బ్లాక్‌చైన్ వినియోగిత ప్లాట్‌ఫామ్. డేటా ప్రైవసీ, సెక్యూరిటీ, ట్రేకబిలిటీ సేవలందిస్తోంది. అంతేకాకుండా తక్కువ లేటెన్సీ(డేటా బదిలీలో ఆలస్యం)సహా ఉత్తమ స్కేలబిలిటీ(సామర్థ్యం)ను కలిగి ఉంది. గతేడాది(2021–22)కల్లా రూ. 808 కోట్ల నికర నగదు నిల్వలతో పటిష్ట బ్యాలన్స్ షీట్‌ను కలిగి ఉంది. రుణ, ఈక్విటీ(డీఈ) నిష్పత్తి సైతం నామమాత్రంగా 0.03గా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో ఆదాయం నీరసించినప్పటికీ ఇకపై నిలకడను సాధించనుంది.

నవీన్ ఫ్లోరిన్ — జేఎం ఫైనాన్షియల్ — కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 4,004 **టార్గెట్:** రూ. 5,090

ఎందుకంటే: గత నాలుగు నెలల్లో స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ నవీన్ ఫ్లోరిన్ ఇంటర్నేషనల్ కౌంటర్ 17 శాతంపైగా దిద్దుబాటుకు లోనయ్యింది. ఇందుకు ప్రధానంగా అంతర్జాతీయ స్థాయిలో డిమాండు మందగిస్తుందన్న ఆందోళనలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో నమోదైన అనుకోని ఇతర వ్యయాలు కారణమయ్యాయి. కంపెనీ 2022–2025 మధ్య కాలంలో పటిష్ట పనితీరు చూపే అవకాశముంది. వెరసి రానున్న మూడేళ్లలో నికర లాభం వార్షికంగా 39 శాతం చొప్పున వృద్ధి సాధించే వీలుంది. అయితే షేరు దిద్దుబాటుతో మార్కెట్లు ఈ అంశాన్ని కొద్ది రోజులుగా విస్మరించినట్లు కనిపిస్తోంది. హైడ్రోఫ్లోరోఓలిఫిన్స్(హెచ్ఎఫ్ఓ) సరఫరాకు గ్లోబల్ సంస్థ హనీవెల్ నుంచి నవీన్‌కు అదనపు కాంట్రాక్టు లభించేందుకు వీలుంది. కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మ్యాన్యుఫాక్చరింగ్ సంస్థ(సీడీఎంఓ)గా మాలిక్యూల్స్ తయారీ పెంపుతోపాటు, స్పెషాలిటీ కెమికల్స్ కొత్త ప్రొడక్టులను జత చేసుకునే అవకాశముంది. పలు దీర్ఘకాలిక కాంట్రాక్టులను కలిగి ఉన్న కంపెనీగా భవిష్యత్ పనితీరుపై ఆశావహ అంచనాలున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

యాక్సిస్ ఎంఎఫ్ బిజినెస్ సైకిల్స్ ఫండ్.



యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ సంస్థ కొత్తగా బిజినెస్ సైకిల్స్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో మూలధనాన్ని వృద్ధి చేయడం ఈ స్కీమ్ ప్రధాన ఉద్దేశం. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 16తో ముగుస్తుందని సంస్థ సీఈవో నిగమ్ తెలిపారు. నిఫ్టీ 500 టీఆర్ఐ దీనికి ప్రామాణికం.

మిరే అసెట్ నుంచి ఫ్లెక్సీ క్యాప్ ఫండ్.



మిరే అసెట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ (ఇండియా) సంస్థ తాజాగా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించింది. స్టాక్స్‌లో పెట్టుబడి తీరులో వైవిధ్యాన్ని పాటించడం దీని ఉద్దేశం. 5 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం ఇన్వెస్ట్ చేయదల్చుకునే మదుపుదారులకు ఇది అనువైనది. ఈ ఫండ్‌లో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఫిబ్రవరి 17తో ఈ న్యూ ఫండ్ ఆఫర్ ముగుస్తుంది.

పీజీఐఎం ఇండియా గిల్ట్ ఇండెక్స్ ఫండ్



పీజీఐఎం ఇండియా ఫండ్ క్రిసిల్ ఐబీఎక్స్ గిల్ట్ ఇండెక్స్ – ఏప్రిల్ 2028 ఫండ్‌ను ప్రారంభించింది. ఈ ఆఫర్ 16 వరకు అందుబాటులో ఉంటుంది. ఫండ్‌లో ప్రభుత్వ సెక్యూరిటీలకు 98%, టి–బిల్స్‌కు 2% వెయిటేజ్ ఉంటుంది. నెలవారీ ప్రాతిపదికన ఇండెక్స్‌ను సమీక్షించి, రీబ్యాలెన్స్ చేస్తారు. ఫండ్ 2028 ఏప్రిల్ 5న మెచ్యూర్ అవుతుంది. కనీసం రూ. 5,000 నుంచి ఆ పైన రూ. 1,000 చొప్పున ఇన్వెస్ట్ చేయొచ్చు.

క్లుప్తంగా...

ఆశా మాలవ్యకు గవర్నర్ అభినందనలు


ఆశా మాలవ్యను అభినందిస్తున్న గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సాక్షి, అమరావతి: సైకిల్‌పై దేశాన్ని చుట్టివస్తున్న ప్రముఖ పర్వతారోహకురాలు ఆశా మాలవ్యను గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అభినందించారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్ జిల్లా నతారామ్ గ్రామానికి చెందిన ఆశా మాలవ్య మహిళా భద్రత, మహిళా సాధికారత అంశాలను విస్తృతంగా సమాజంలోకి తీసుకువెళ్లేందుకు దేశవ్యాప్తంగా ఒంటరిగా సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ చేరుకున్న ఆమె ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. సైకిల్‌పై దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 25,000 కిలోమీటర్లు ప్రయాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని, ఇప్పటి వరకు ఏపీ సహా 8 రాష్ట్రాల్లో 8,555 కిలో మీటర్లు పూర్తయిందని ఆమె వివరించారు. చిన్న వయసులోనే సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాన్ని ఎంపిక చేసుకుని దేశమంతా సైకిల్‌పై ఒంటరిగా పర్యటించడం గొప్ప విషయమని, ఆశా మాలవ్య లక్ష్యం నెరవేరాలని గవర్నర్ ఆకాంక్షించారు. గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్, ఉప కార్యదర్శి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్: జీవీఎల్



దాబాగార్డెన్స్/అల్లిపురం (విశాఖ దక్షిణ): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం 2029–30 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని రాజ్యసభ సభ్యుడు, ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేలా ఉందన్నారు. ప్రపంచంలో 9వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్... మోదీ ప్రభుత్వం వచ్చాక ఐదో స్థానానికి ఎదిగిందన్నారు. ఈ బడ్జెట్‌లో రాష్ట్రాలకు రూ.3.8 లక్షల కోట్లు కేటాయించారని తెలిపారు. ఏపీకి కేంద్రం రూ.7 వేల కోట్ల నిధులు కేటాయించారని చెప్పారు. బీజేపీ నాయకులు విష్ణుకుమార్‌రాజు, లంకా దినకర్, మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ పాదయాత్రకు స్పందన లేదు

టీడీపీ నాయకుడు లోకేశ్ పాదయాత్రకు ప్రజల నుంచి పెద్దగా స్పందన లేదని జీవీఎల్ నరసింహారావు అన్నారు. నాయకత్వం అనేది స్వయంగా ప్రకాశించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం అమరావతిలోనే ఉంటుందని, సీఎం క్యాంపు ఆఫీస్ రాష్ట్రంలో ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చని, దానిపై ఎవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చన్నారు. రాజధానిగా విశాఖను ముందుగానే నిర్ణయించి ఉంటే ఇంకా బాగుండేదని జీవీఎల్ అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- టీడీపీ నేత యనమల రామకృష్ణుడు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ అసంబద్ధంగా మాట్లాడుతున్నారని టీడీపీ నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మూడున్నరేళ్ల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖలో ఏం జరుగుతుందో బుగ్గనకు తెలియదని, ఆ శాఖపై పెత్తనమంతా ముఖ్యమంత్రిదేనని ఆరోపించారు. కాబట్టి సీఎం వైఎస్ జగన్ తనతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. మూడున్నరేళ్లలో బహిరంగ మార్కెట్ ద్వారా ఎన్ని రూ.కోట్లు అప్పులు తెచ్చారు, ఆర్బీఐ నుంచి తీసుకున్న వేస్ అండ్ మీన్స్ ఎంత, ఓవర్ డ్రాఫ్ట్ ఎంత, వడ్డీ ఎంత కట్టారు, రెవెన్యూ, ప్రాథమిక, ద్రవ్యలోటు ఎంత, ఈ మూడున్నర సంవత్సరాల్లో ఖర్చు చేసిన మూలధన వ్యయం ఎంత, పీడీ అకౌంట్‌లో నిధులు ఎంత వాడారు, పెండింగ్ బిల్స్ ఎన్ని ఉన్నాయి, ఓపెన్ బారోయింగ్స్, ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ ఎంత, వీటి వివరాలు కాగ్‌కు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అధిక ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రాల్లో ఏపీ 2వ స్థానంలో ఉందన్నారు.

సీబీఐ ఎదుట హాజరైన దస్తగిరి

కడప అర్బన్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన దస్తగిరి ఆదివారం కడప కేంద్ర కారాగారంలోని గెస్ట్ హౌస్‌కు వెళ్లి సీబీఐ ఎదుట హాజరయ్యారు. ఈ కేసును హైదరాబాద్ సీబీఐ కోర్టుకు ఇటీవలే బదలాయించగా.. ఈ నెల 10న హైదరాబాద్ సీబీఐ కోర్టుకు హాజరు కావాలని దస్తగిరితోపాటు మరికొందరు నిందితులకు సీబీఐ సమన్లు జారీ చేసింది. సమన్లు తీసుకునేందుకు వచ్చిన దస్తగిరి ఈ నెల 10న హైదరాబాద్ సీబీఐ కోర్టులో హాజరవుతానని సీబీఐ అధికారులకు తెలిపారు.


కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తుని మండలం ఎస్ అన్నవరానికి చెందిన వి.పెదకాపునకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ కొత్తూరు దివ్య


గుంటూరు నగరం భవానీపురానికి చెందిన సారమ్మకు వితంతు పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ విమల


శ్రీకాకుళం జిల్లా రాగోలులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నప్పన్నకు పింఛన్ అందిస్తున్న నందిగాం మండలం దిమ్మిడిజోల వలంటీర్ వెంకటరావు


తిరుపతి టాటా ట్రస్ట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిత్తూరు జిల్లా వెంకటాద్రిపురానికి చెందిన నాగభూషణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుధా

ఆన్‌లైన్ చదువుల పైనే ఆసక్తి

ఏటా పెరుగుతున్న అభ్యాసకులు

- కరోనా తర్వాత 170 శాతం మేర పెరిగిన ఆన్‌లైన్ కోర్సుల నమోదు
- వీటి ఆవశ్యకతను గుర్తించి యూజీసీ ప్రత్యేక ఏర్పాట్లు
- 'స్వయం' ద్వారా అందుబాటులో అనేక కోర్సులు
- పలు ప్రభుత్వ, ప్రైవేటు వర్సిటీలు, ఐఐటీల్లో కూడా..



సాక్షి, అమరావతి: ఇప్పుడు అంతా ఆన్‌లైన్‌మయం. ప్రతి రంగంలోనూ టెక్నాలజీ తన హవాను ప్రదర్శిస్తోంది. ఇందుకు విద్యా రంగం మినహాయింపు కాదు. ముఖ్యంగా కోవిడ్ కల్లోల పరిస్థితుల్లో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ యాప్స్, వెబ్‌సైట్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. స్కూళ్లు, కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులంతా ఇళ్లకే అతుక్కుపోయారు. దీంతో ఆయా విద్యా సంస్థలు తమ విద్యార్థులకు ఆన్‌లైన్ వేదికగా పాఠాలు బోధించాయి. అభ్యసనం మొదలుకుని.. పరీక్షల వరకు అన్నీ ఆన్‌లైన్ వేదికగానే సాగాయి. ఈ నేపథ్యంలో దేశంలో ఆన్‌లైన్ చదువులపై ఆసక్తి చూపేవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేరుగా కాలేజీల్లో చదివే అవకాశాల్లేనివారితో పాటు ఉద్యోగాల్లో ఉన్నవారు, అదనపు విద్యార్హతలను సంపాదించుకోవాలనుకొనే వారు ఈ ఆన్‌లైన్ కోర్సులను ఆశ్రయిస్తున్నారు. సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతూ అన్ని రంగాల్లోనూ డిజిటలైజేషన్ వేగంగా విస్తరిస్తుండడంతో ఆన్‌లైన్ విద్య అందరికీ మరింత అందుబాటులోకి వచ్చింది.

'స్వయం'.. వందలాది కోర్సులు..

ఆన్‌లైన్ కోర్సులకు భారీగా డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రైవేటు ఎడ్‌టెక్ సంస్థలతో పాటు ప్రభుత్వ రంగ విద్యాసంస్థలు, వర్సిటీలు కూడా ఆన్‌లైన్ కోర్సులను అందుబాటులోకి తెస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 'స్టడీ వెబ్స్ ఆఫ్ యాక్టివ్ లెర్నింగ్ ఫర్ యంగ్ ఆస్పైరింగ్ మైండ్స్' (స్వయం – https://swayam.gov.in/) ఏర్పాటు చేసి వందలాది కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చింది. ఆన్‌లైన్ కోర్సులకు సంబంధించి ఇదివరకు ఉన్న నిబంధనలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఒకింత సడలించింది. నిర్ణీత ప్రమాణాలతో ఆన్‌లైన్ కోర్సులను అందించేందుకు పలు సంస్థలకు అనుమతులు కూడా మంజూరు చేస్తోంది. యూనివర్సిటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలు ఇప్పటికే యూజీసీ మార్గదర్శకాల మేరకు ఆన్‌లైన్ కోర్సులను అందుబాటులోకి తెచ్చాయి. మరోవైపు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలు (ఐఐటీలు) కూడా https://nptel.ac.in/ ద్వారా ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. విద్యార్థులే కాకుండా ఆసక్తి ఉన్న వారెవరైనా ఈ కోర్సులను అభ్యసించేలా చర్యలు చేపట్టాయి.

ఆన్‌లైన్ కోర్సులపై ఫిక్కీ సూచనలు

ఆన్‌లైన్ కోర్సులకు సంబంధించి పరిశ్రమల అవసరాలను తీర్చేలా ఆయా కోర్సులు ఉండడంతో పాటు వాటి ప్రమాణాల్లోనూ ఏమాత్రం రెగ్యులర్ కోర్సులకు తగ్గకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) గతంలోనే పలు సిఫార్సులు చేసింది. పాలసీ, టెక్నాలజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కంటెంట్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, సెక్యూరిటీ, పర్యవేక్షణ, ఇవాల్యుయేషన్, అసెస్‌మెంట్, ఇండస్ట్రీ అకాడమియా ఎంగేజ్‌మెంట్ వంటి అంశాల్లో ప్రభుత్వం, విద్యాసంస్థలు, ఎడ్‌టెక్ కంపెనీలు అనుసరించాల్సిన విధానాలపై ఫిక్కీ పలు మార్గాలను సూచించింది.

ఆన్‌లైన్‌లోనే కాకుండా ఓడీఎల్ విధానంలోనూ..

కరోనాకు ముందు ఆన్‌లైన్ చదువులవైపు ఆసక్తి చూపినవారి సంఖ్య అంతంతమాత్రంగానే ఉంది. కరోనా తర్వాత వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2021–2022లో ఆన్‌లైన్ కోర్సుల్లో చేరినవారి సంఖ్య 170 శాతం మేర పెరిగినట్లు యూజీసీ సహా పలు సంస్థల అధ్యయనాలు వెల్లడించాయి. ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) విధానంలోనూ ఆన్‌లైన్ కోర్సుల్లో చేరుతున్నారు. ఆన్‌లైన్, ఓడీఎల్ మార్గాల్లో చదువులు కొనసాగిస్తున్న వారి సంఖ్య క్రమేణా పెరుగుతుండడంతో ఆ మేరకు సంస్థలు కూడా అవసరాలకు తగ్గ కోర్సులను ప్రవేశపెడుతున్నాయి.

బిజినెస్ మేనేజ్‌మెంట్‌పైనే మోజు..

వివిధ వర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలు అందిస్తున్న ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ కోర్సులు, వాటిలో చేరే వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఆన్‌లైన్, ఓడీఎల్ కోర్సులను అభ్యసించే వారిలో ఎక్కువగా పురుషులే ఉంటున్నారు. ఉన్నత విద్య విభాగం సర్వే గణాంకాలు పరిశీలిస్తే.. పురుషుల సంఖ్యలో సగం మంది మహిళలు మాత్రమే ఈ ఆన్‌లైన్, ఓడీఎల్ కోర్సుల్లో చేరుతున్నారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరేవారిలో ఎక్కువ మంది బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరుతున్నట్లుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సెంట్రల్, స్టేట్, డీమ్డ్, ప్రైవేటు వర్సిటీలు ఈ కోర్సులను అందుబాటులోకి తెస్తున్నాయి. టెక్నాలజీ అంశాలకు సంబంధించి ఐఐటీలు, ఇతర ఉన్నత విద్యాసంస్థలు ఎప్పటికప్పుడు కొత్త సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నాయి. ఐఐటీలు వంటి జాతీయస్థాయి ప్రతిష్టాత్మక సంస్థలు కూడా ఆన్‌లైన్, ఓడీఎల్ కోర్సులు అందిస్తున్న నేపథ్యంలో విదేశీ విద్యార్థులు కూడా వీటిని అభ్యసించేందుకు ముందుకు వస్తుండటం విశేషం.

2021-22లో ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్‌ల్లో చేరిన విద్యార్థులు **20,00,000** మంది

2021-22కి ముందు ఈ సంఖ్య **14,00,000**

2021లో ఆన్‌లైన్ కోర్సుల్లో చేరినవారి సంఖ్య **25,000**

2021 తర్వాత ఆన్‌లైన్ కోర్సులలో చేరినవారు **70,000** పైగా

ఆన్‌లైన్ కోర్సులు అందిస్తున్న ఉన్నత విద్యాసంస్థలు 2021లో	2022 నాటికి ఆన్‌లైన్ కోర్సులు అందిస్తున్న ఉన్నత విద్యాసంస్థలు
42	60

ఈ ఏడాది కొత్తగా మరిన్ని కొత్త సంస్థలు కూడా చేరడంతో ఈ సంఖ్య రెట్టింపు అయ్యింది.

ఆయా సంస్థలు అందించే ఆన్‌లైన్ కోర్సులు గతంలో	ప్రస్తుతం ఆయా సంస్థలు అందించే ఆన్‌లైన్ కోర్సుల సంఖ్య
237	400

2022-23 నాటికి ఆన్‌లైన్ కోర్సుల్లో దేశీయ విద్యార్థుల చేరికలు **1,00,000** పైగా

ఓడీఎల్ కోర్సులు అందిస్తున్న విద్యా సంస్థలు	ఓడీఎల్ విధానంలో అందుబాటులో ఉన్న కోర్సులు
90కి పైగా	1,000కి పైగా

ఓడీఎల్ కోర్సులకు రిజిస్టర్ చేసుకున్నవారి సంఖ్య **20,00,000**కి పైగా

కలాం స్ఫూర్తితో అంతరిక్ష విజయాలు

- భారత రక్షణ శాఖ శాస్త్ర, సాంకేతిక సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి


మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ప్రవాస భారతీయులతో డాక్టర్ జి.సతీష్‌రెడ్డి

ఆత్మకూరు రూరల్: దివంగత రాష్ట్రపతి, అగ్రశ్రేణి క్షిపణి శాస్త్రవేత్త డాక్టర్ అబ్దుల్ కలాం స్ఫూర్తితో భారత రక్షణ శాఖ అంతరిక్ష విజయాలు సాధిస్తోందని భారత రక్షణ శాఖ శాస్త్ర, సాంకేతిక సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి అన్నారు. గత నెల 30 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు అమెరికాలోని డల్లాస్‌లో ప్రవాస భారతీయులు, జేఎస్‌టీయూ నిపుణులు ఏర్పాటు చేసిన 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీవోలో తన ప్రస్థానం గురించి వివరించారు. అబ్దుల్ కలాం శిష్యుడిగా డీఆర్‌డీవోలో పెద్ద లక్ష్యాలను ఏర్పచుకుని వాటిని సాధించడం కోసం సహచర శాస్త్రవేత్తలతో కలిసి పనిచేసి ఘన విజయాలు సాధించామన్నారు. గత 8 ఏళ్లుగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధించిన పరిశోధనల ఫలితంగా భారతదేశ రక్షణ వ్యవస్థ కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. దేశ రక్షణకు అవసరమైన ఆయుధాలు, క్షిపణులు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసుకుని అగ్రరాజ్యాల సరసన చేరామన్నారు. ప్రపంచ శాంతి కోసం తన బలాన్ని, బలగాన్ని భారతదేశం వినియోగిస్తోందని సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శాస్త్రవిజ్ఞానం అభివృద్ధికి అంకితభావంతో సతీష్‌రెడ్డి చేసిన పరిశోధనలను పలువురు వక్తలు ప్రశంసించారు. అనంతరం సతీష్‌రెడ్డిని అమెరికాలోని తెలుగు అసోసియేషన్లు అయిన టాంటెక్స్, తానా, నాటా, నాట్స్, ఆట సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాటా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి కోర్సిపాటి, ఆయా సంఘాల నాయకులు చిల్లకూరి గోపిరెడ్డి, అజయ్ కలువ, ఉప్పలపాటి కృష్ణారెడ్డి, బలరామ్, భీమా, భాస్కర్ రెడ్డి, సురేష్, రంగారావు, శ్రీనివాసరాజు, శ్రీనివాసమూర్తి, పులి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుట్రపూరిత కథనాలే

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకుంటామని హెచ్చరించారు.

సీట్ నంబర్ 1 డి... వెళ్లింది హైదరాబాద్

వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం అహోబిలపురం సమీపంలో రూ.5 కోట్లతో పునర్నిర్మించిన శ్రీభానుకోట సోమేశ్వరాలయం మహాకుంభాభిషేకాన్ని ఫిబ్రవరి 4వతేదీ ఉదయం 9.58 గంటలకు నిర్వహించాలని ముహూర్తాన్ని 4 నెలల క్రితమే 2022 అక్టోబర్ 14 నిర్ణయించారని సీఎస్ తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో తాను ఫిబ్రవరి 2వతేదీ రాత్రి 11 గంటలకు రేణిగుంట ద్వారా కడప చేరుకున్నట్లు వివరించారు. 3వ తేదీ ఉదయం 9.50 గంటలకు కడప కలెక్టర్, ఇతర జిల్లా ఉన్నతాధికారులు ఆలయ కార్యక్రమాల్లో పాల్గొన్నారని వివరించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తాను చదువుకున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ముద్దనూరులో విద్యార్థులతో సమావేశం ముగియగానే 4.40కి బయలుదేరానని, సుమారు 8.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయంలో కలెక్టర్, ఇతర అధికారులు తనకు మర్యాదపూర్వకంగా వీడ్కోలు పలికారని తెలిపారు. రాత్రి 9 గంటలకు స్పైస్‌జెట్ ఎస్‌జీ 3003 సిరీస్ ద్వారా 1 డి సీట్‌లో ప్రయాణించి హైదరాబాద్ చేరుకున్నట్లు జవహర్‌రెడ్డి వివరించారు. వాస్తవాలు ఇలా ఉంటే శుక్రవారం రోజు సీఎస్‌తో కలసి ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి విజయవాడ వెళ్లారని, ఒకే వాహనంలో ప్రయాణించారని ప్రచురించిన కథనాలు ఊహాజనితం, సత్యదూరమని చెప్పారు. దారుణమైన ఈ అబద్ధాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన వాణీ జయరాం అంత్యక్రియలు

- నివాళులర్పించిన సినీ, రాజకీయ ప్రముఖులు
- ఆమెది సహజ మరణమేనని పోలీసుల ధ్రువీకరణ


వాణీ జయరాం భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న తమిళనాడు సీఎం స్టాలిన్

తమిళ సినిమా: ప్రముఖ గాయని వాణీజయరాం భౌతికకాయానికి ఆదివారం చెన్నైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు వాణీజయరాం పార్థివ దేహానికి తమిళనాడు సీఎం స్టాలిన్, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అంజలి ఘటించారు. ప్రఖ్యాత గాయని పి.సుశీల వాణీజయరాం మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం ఓ వీడియోను మీడియాకు విడుదల చేశారు. వాణీ జయరాంతో కలిసి తాను 100 పాటలు పాడినట్లు గుర్తు చేసుకున్నారు. ఆమె పెద్దగా నవ్వే వారు కాదని, తాను, జానకి, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కలిసి ఉన్నప్పుడు మాత్రమే నవ్వేవారని చెప్పారు. ఏడుస్వరాల పాటను ఆమె మినహా ఎవరు పాడలేరని, వాణీజయరాంది ప్రత్యేకస్వరం అని కొనియాడారు. కాగా వాణీ జయరాంది అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం ఆమెది సహజ మరణమేనని పోలీసులు ధ్రువీకరించారు. వాణీజయరాం తలకు బలమైన గాయం కావడం, ముఖం రక్తసిక్తమై ఉండటం, చేతిరేఖలు వంటి ఆధారాలను తుడిచి వేయడంతో మొదట అనుమానాస్పదమృతిగా భావించారు. వాణీ జయరాం తన గదిలోని అద్దంతో కూడిన టీపాయ్‌పై పడటంతో తలకు బలమైన దెబ్బతగలడంవల్ల మృతిచెందినట్లు విచారణలో నిర్ధారణ అయ్యిందన్నారు. పోలీసులు 30 రౌండ్లు గాలిలో ఫైర్‌చేసిన అనంతరం వాణీజయరాం భౌతికకాయానికి బీసెంట్ నగర్‌లోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

గిరిజనులకు మరింత ఊతం

ఏపీలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల పట్ల కేంద్ర బృందాల సంతృప్తి

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా అత్యంత వెనుకబడిన గిరిజన తెగలకు మరింత ఊతమిచ్చి వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు అవసరమైన కసరత్తు మొదలైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలతో కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌లో జనవరి 27 నుంచి 30వ తేదీ వరకు కేంద్ర ప్రత్యేక బృందాలు పర్యటించాయి. పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలోని మూడు ప్రాంతాల్లో కేంద్ర బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేశాయి. అత్యంత వెనుకబడిన గిరిజన తెగ (పీవీటీజీ)లు దేశ వ్యాప్తంగా 75 ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 9 ఉన్నాయి. రాష్ట్రంలోని తొమ్మిది గిరిజన తెగల స్థితిగతులను తెలుసుకునేందుకు కేంద్ర గిరిజనశాఖ తొమ్మిది బృందాలను నియమించింది. తొలిదశలో మూడు బృందాలు పాడేరు ఐటీడీఏ పరిధిలోని మూడు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి అధ్యయనాన్ని ప్రారంభించాయి. డొంగ్రియా కోంద్, బోండా పోర్జా, పరంగి పోర్జా గిరిజన తెగల జీవన పరిస్థితిని, వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వారితో మాట్లాడి వివరాలు సేకరించారు. విద్య, వైద్యం, మంచినీరు, రహదారులు తదితర మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయని గిరిజనులు వివరించారు. ఏపీలో గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంపై కేంద్ర బృందాలు సంతృప్తి వ్యక్తం చేశాయి.

మాతోనే అభివృద్ధి

యువగళం పాదయాత్రలో లోకేశ్


మోహరించిన టీడీపీ వర్గాలు

తవణంపల్లె/కాణిపాకం (యాదమరి): రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి కావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చెప్పారు. ఆయన నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర ఆదివారం చిత్తూరు జిల్లాలో మండల కేంద్రమైన తవణంపల్లె నుంచి ప్రారంభమై తెల్లగుండ్లపల్లెలో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన ముస్లింలు, యువకులతో విడివిడిగా సమావేశమయ్యారు. మైనారిటీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ రంజాన్‌తోఫా, దుహాన్ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి, డ్రగ్స్ వ్యాపారాలు అధికమయ్యాయని, ఆయన అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు.

టీడీపీ వర్గపోరు

లోకేశ్ కాణిపాకంలో శ్రీవరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. అక్కడ లోకేశ్ సమక్షంలోనే ఐరాల మండల టీడీపీలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు లత వర్గానికి, మరో వర్గానికి విభేదాలు భగ్గుమన్నాయి. అక్కడే మోహరించి విమర్శించుకున్నారు.

రూ.520కే గన్ డెలివరీ!

- ఆయుధాల పేరుతో అందినంత దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లు
- ఫేస్‌బుక్‌లోని 'మార్కెట్ ప్లేస్' కేంద్రంగా వల.. నాటు, నీటు గన్స్ విక్రయిస్తామంటూ ప్రచారం



సాక్షి, హైదరాబాద్: కంటికి కనిపించకుండా కేవలం ఫోన్ ద్వారానే కథ నడుపుతూ అందినకాడికి దండుకునే సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో తయారైన నాటు, నీటు తుపాకులను తక్కువ ధరకు విక్రయిస్తామంటూ ఫేస్‌బుక్‌లోని మార్కెట్ ప్లేస్ కేంద్రంగా ప్రచారం చేసి మోసాలకు పాల్పడుతున్నారు. తుపాకీకి డబ్బు ఇప్పుడు చెల్లించాల్సిన పనిలేదని, కేవలం రూ.520 అడ్వాన్స్‌గా చెల్లిస్తే డెలివరీ చేస్తామని, ఆ తర్వాత మిగిలిన డబ్బులు చెల్లించాలని నమ్మబలుకుతున్నారు. ఇందులో బాధితులు కోల్పోతున్నది చిన్న మొత్తాలే కావడంతో ఎవరూ పోలీసుల వరకు వెళ్లి ఫిర్యాదులు చేయడం లేదు. దీన్నే అదనుగా భావిస్తున్న అనేక ముఠాలు ఈ తరహా నేరాలకు పాల్పడి అనునిత్యం రూ.లక్షల్లో కొల్లగొడుతున్నాయి.

వీడియో రూపంలో ప్రకటన...

ఫేస్‌బుక్‌లో ఆల్ ఇండియా డెలివరీ పేరుతో ఓ పేజ్ ఏర్పాటు చేసిన సైబర్ నేరగాళ్లు అందులో తుపాకులు, తపంచాలు, కత్తులకు సంబంధించిన వీడియోలు పోస్టు చేస్తున్నారు. ఈ పేజ్ పైనే 86384 67582 అనే మొబైల్ నంబర్ కూడా ఉంటోంది. దేశవ్యాప్తంగా ఎక్కడికైనా డెలివరీ చేస్తామంటూ ఓ లింకును పెడుతున్నారు. ఈ ప్రకటనకు ఆకర్షితులైన వాళ్లు ఈ లింక్ క్లిక్ చేస్తే.. అది నేరుగా వాట్సాప్‌కు వెళ్తోంది. ఫేస్‌బుక్ పేజ్ పైన ఉన్న నంబర్‌తోనే పని చేసే ఈ వాట్సాప్ ఖాతాకు డిస్‌ప్లే పిక్చర్ (డీపీ)గా ఆయుధాలను పక్కన పెట్టుకుని పడుకున్న యువకుడి ఫొటో ఉంటోంది. ఫేస్‌బుక్ ద్వారా ఈ వాట్సాప్ ఓపెన్ కావడంతోనే తెరిచిన వ్యక్తి ఆ ఆయుధాల వివరాలు తెలుసుకోవాలని భావిస్తున్నట్లు సందేశం సైతం పోస్టు అవుతోంది. ఆ వెంటనే స్పందిస్తున్న సైబర్ నేరగాళ్లు వివిధ రకాల తుపాకులకు సంబంధించిన 20–30 ఫొటోలు షేర్ చేస్తున్నారు. చేత్తో పట్టుకుని, వాహనాలపై ఉంచి, వస్త్రాల్లో భద్రంగా కట్టి ఉంచిన తుపాకుల ఫొటోలనే షేర్ చేస్తున్నారు. వీటిని చూసిన వాళ్లు అవతలి వారి దగ్గరే అవి ఉన్నట్లు భావిస్తున్నారు. ఇవతలి వ్యక్తి వాటి ఖరీదు చెప్పమంటూ ఆరా తీస్తే... తొలుత ఓ తుపాకీ ఎంచుకుని దాన్ని తనకు రిటర్న్ షేర్‌చేయమంటూ సైబర్ నేరగాడు సూచిస్తున్నాడు. అలా చేసిన తరువాత ఆ తుపాకీ ధరను రూ.3 వేల నుంచి రూ.5 వేల మధ్య చెప్పి, ఎక్కడకు కావాలంటే అక్కడకు తెచ్చి ఇస్తామంటున్నాడు.

ఇది మోసం కాకపోయినా నేరమే..

ఇలాంటి మోసాల్లో ఒక బాధితుడు కోల్పోయేది తక్కువే అయినా... వారి సంఖ్య ఎక్కువగా ఉంటుండటంతో నేరగాళ్లకు చేరేది రూ.లక్షల్లోనే ఉంటుంది. బాధితులు ఫిర్యాదు చేస్తే వారిని కొంతవరకు కట్టడి చేయొచ్చు. ఇది మోసం కాకుండా నిజంగా ఆయుధాలు డెలివరీ అయినా అదీ నేరమే అవుతుంది. లైసెన్సు లేకుండా ఎవరూ ఎలాంటి ఆయుధాలూ కలిగి ఉండరాదు.

– డి.ప్రభాకర్ నాయుడు, సైబర్ క్రైమ్ నిపుణుడు

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai - 600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943